

# హరి ఇచ్చిన వరము అన్నమయ్య

ఎన్నుకొన్న అన్నమయ్య-పెదతిరుమలయ్యల
సంకీర్తనలకు భావదీపిక

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
**M.Tech.**



హరి ఇచ్చిన వరము అన్నమయ్య

మొదటి ప్రచురణ

జనవరి 2015

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : అమూల్యం

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. & ప్రింటింగ్ :

కె. మురళీకృష్ణ

9848515109

# అంకితము



తిరుమల యాత్రికులంతా తృప్తితో దర్శించే గోవిందరాజస్వామి కోరిన కోర్కెలు పండించే దైవశిఖామణి అన్నమాచార్యులవారు అసంఖ్యాకమైన కీర్తనలు చెప్పిన ఈ గోవిందుని మనసారా ప్రార్థిసూ...

కం॥ గోవిందరాజు వీడని
కోవిదుడా అన్నమయ్య కొలిచెను యిదిగో
నేవేడుకతోనీకృతి
గోవిందుని కంకితమ్ము కుదురుగనిత్తున్.

# హరి ఇచ్చిన వరము అన్నమయ్య

## అన్నమయ్య -పెదతిరుమలయ్యల సభక్తి-సరస సంకీర్తనలకు భావదీపిక

### విషయసూచిక


| క్ర.సం | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అంటcబారి పట్టుకోరె | 1/122 | 1 |
| 2. | అంతచుట్టములా నీకు నవియెల్లను | 17/380 | 2 |
| 3. | అక్కలాల చూడుcడందరును | 3/149 | 3 |
| 4. | అతిదుష్టుcడ నే నలసుcడను | 1/78 | 4 |
| 5. | అదిగాక నిజమతం బదిగాక | 1/40 | 5 |
| 6. | అన్నియుc జదివితిcగా ఆహా నేను | 3/354 | 6 |
| 7. | అనుచు లోకములెల్ల నదె జయవెట్టేరు | 2/111 | 7 |
| 8. | అప్పుడు చూచేదివో అధికుల నధముల | 2/117 | 8 |
| 9. | అప్పcడు దైవాలరాయc | 2/50 | 9 |
| 10. | అయ్యో మాయలc బొంది అందునిందు | 2/12 | 10 |
| 11. | అయ్యో! యేమరినే వాడిప్పుడే | 15/6(పె.అ) | 11 |
| 12. | అయ్యో వారిభాగ్య మంతేకాక | 2/33 | 12 |
| 13. | అల్లనాడే యిదెరగమైతిమి | 3/399 | 13 |
| 14. | అవధారు దేవ హరికులరామ | 3/144 | 14 |
| 15. | అcటదాని చేతిదే | 27/204 | 15 |
| 16. | ఆదిదేవుcడై అందరిపాలిటి | 1/127 | 16 |
| 17. | ఆశాబద్ధుcడనై యలసి | 1/175 | 17 |
| 18. | ఆసలుచెరుచకుమీ అచ్యుతా | 15/238(పె.అ) | 18 |
| 19. | ఇంకానేలా తర్కవాదములు యిన్నియు | 3/353 | 19 |
| 20. | ఇంతదేవుc డింక వేcడీ యెంచి | 2/116 | 20 |
| 21. | ఇంత మాత్రము మా నేమ మిందు | 15/444 | 21 |
| 22. | ఇంతితో మాటాడవయ్య ఇcక వేcటికి | 27/237 | 22 |
| 23. | ఇతరము లిన్నియు నేమిటికి | 1/86 | 23 |
| 24. | ఇదివో వీథివీథుల నీతని తేరు | 2/110 | 24 |

| | | | |
|---|---|---|---|
| 25. | ఇద్దరికిఁ జుట్టరిక మీరీతిఁ గలిగె మీకు | 18/251 | 25 |
| 26. | ఇన్నాళ్లు నా యహంకార మెఱుఁగని | 15/348 | 26 |
| 27. | ఇహమేకాని యిఁకఁ బరమేకాని | 2/131 | 27 |
| 28. | ఎంత చదివి చూచిన నీతఁడే ఘనము | 2/98 | 28 |
| 29. | ఎంత విచారించుకొన్నా నిదియే తత్త్వము | 3/369 | 29 |
| 30. | ఎంత వొద్దు లేదు నీకు నేమి సేయరాదు | 17/446 | 30 |
| 31. | ఎందాఁక నేచిత్త మేతలఁపో | 1/88 | 31 |
| 32. | ఎందునైనా మీరఁబోతే నెవ్వరికి | 3/158 | 32 |
| 33. | ఎక్కడి పురాకృతము యేమి సేసీని | 15/7 | 33 |
| 34. | ఎక్కడి విరతి మాకు నిహమెల్లాఁ దగులు | 3/366 | 34 |
| 35. | ఎట్టు దోయవచ్చు వీని నెంతటివాని | 15/445 | 35 |
| 36. | ఎన్నఁడొకో బుద్ధెరిఁగి యీడేరేది | 2/102 | 36 |
| 37. | ఏది చూచిననుఁ గడు నిటువంటి | 1/140 | 37 |
| 38. | ఏది చూచినా నీవే యిన్నియును | 1/60 | 38 |
| 39. | ఏమందురు యీమాటకు నిందరూ | 2/36 | 39 |
| 40. | ఏమనఁగ నే మవునో యెన్నిక లెట్టో | 17/421 | 40 |
| 41. | ఏమో తెలిసెఁగాని యీ జీవుఁడు | 1/123 | 41 |
| 42. | ఏమి గల దిందు నెంతగాలంబైన | 1/113 | 42 |
| 43. | ఏరా నీ గుట్టెల్ల నే నెఱఁగనిదా | 27/139 | 43 |
| 44. | ఏల వెట్టిసేయించే విందున నీకేమివచ్చె | 3/314 | 44 |
| 45. | ఒద్ద నిద్దరున్నారు వొడ్డోలగమై వున్నాఁడు | 27/113 | 45 |
| 46 | ఒయ్యన చేరి పాదా లొత్తవమ్మ | 17/396 | 46 |
| 47. | కటకటా యీ యాత్మ లేగతి నీడేరఁ | 15/443 | 47 |
| 48. | కడనుండే విజ్ఞానికిఁ గా దిటువలెను | 3/367 | 48 |
| 49. | కనకము కనకమే కడు నినుమినుమే | 3/119 | 49 |
| 50. | కరుణించు మిఁకనైన కాఁపురమా | 2/34 | 50 |
| 51. | కలకలనవ్వుతోడ కలికిచూపులతోడ | 17/381 | 51 |
| 52. | కలిదోషములాల కడు నేల మీరేరు | 2/119 | 52 |
| 53. | కాలమందే నీ దాసులై కడు ధీరులౌట | 15/304 | 53 |

| | | | |
|---|---|---|---|
| 54. | కాలవిశేషమో లోకముగతియో | 1/63 | 54 |
| 55. | కొనమొదలేదో గుటిగాన రొరులు | 2/118 | 55 |
| 56. | కొల్లవలపులు చల్లే గోవిందరాజ నిన్ను | 15/240 | 56 |
| 57. | కోరికె దీరుట యెన్నఁడు గుణమును | 1/176 | 57 |
| 58. | కోరి మాభుజముల డాగులు | 2/101 | 58 |
| 59. | జ్ఞానులాల యోగులాల సకలవిరక్తులాల | 2/26 | 59 |
| 60. | చంకగుదియ యిదే శరణార్తి నే నిదే | 3/389 | 60 |
| 61. | చాలదా మా జన్మము నీ- | 1/110 | 61 |
| 62. | చూడరెవ్వరు దీనిసోద్యంబు | 1/96 | 62 |
| 63. | చేరి మొక్కరో నరులు శ్రీమంతుఁడీతఁడు | 15/132 | 63 |
| 64. | జీవాత్ముని దీమముగాఁ జేసుక | 15/453 | 64 |
| 65. | జీవునికి నిటు బుద్ధి చెప్పవయ్యా | 2/103 | 65 |
| 66. | తనకర్మమెంత చేఁతయు నంతే | 1/213 | 66 |
| 67. | తలఁచినప్పుడు వచ్చు దయ యెప్పుడూఁ | 3/140 | 67 |
| 68. | తలపోఁత బాఁతె తలఁపులకుఁ దమ | 1/41 | 68 |
| 69. | తనదీఁగాక యిందరిదీఁగాక | 1/124 | 69 |
| 70. | తీపనుచు చేఁదు తెగఁదిని వెనకఁ | 1/39 | 70 |
| 71. | తెలిసియుఁ దెలియను తెగదీ | 3/398 | 71 |
| 72. | దిక్కిందరికినైన దేవుఁడు కడుఁ | 1/111 | 72 |
| 73. | నవ్వేవారి నెఱఁగఁడు నలువంకఁ | 27/63 | 73 |
| 74. | నాకేల విచారము నాకేల యాచారము | 3/384 | 74 |
| 75. | నానాటికిఁ బెరిగీని నరసింహము | 3/153 | 75 |
| 76. | నారాయణాచ్యుతానంత గోవిందా | 2/54 | 76 |
| 77. | నిండు సోబనము నేఁడు నెయ్యపు | 9/55 | 77 |
| 78. | నిక్కమైన మాబతుకు నీ చేతిదే | 27/268 | 78 |
| 79. | నిర్మలులు వీరు నిత్యసుఖులు | 2/114 | 79 |
| 80. | నీయంతవాఁడనా నేను నేరము లే | 15/309 | 80 |
| 81. | నీ వాపెకు మగఁడవు నేరుపరివి | 27/50 | 81 |
| 82. | నేటనే తెలునో నీచందము మాకు | 17/441 | 82 |

| | | |
|---|---|---|
| 83. పచ్చిదేరుచు నుట్ల పండుగాయను | 3/150 | 83 |
| 84. పట్టవసముగాని బాలుఁడా పెనుఁ | 1/58 | 84 |
| 85. పదిలము కోట పగవారు | 1/61 | 85 |
| 86. పుట్టినమొదలు నేను పుణ్యమేమీఁ | 3/327 | 86 |
| 87. పెద్ద తెరువుండఁగాను పెడగంతలు | 3/383 | 87 |
| 88. పొద్దువోక నే నూరకే పొదిగేఁగాక | 27/62 | 88 |
| 89. పోయినాఁ బోనీడమ్మాఁ పోయినా | 17/442 | 89 |
| 90. భావము దెలియరే పడఁతులాల | 7/446 | 90 |
| 91. భావించరే చెలులాల పరమాత్ముని | 3/165 | 91 |
| 92. భావింప నీ వొక్కఁడవే బహురూపాల | 15/345 | 92 |
| 93. భీకరపు చక్రమదె పిడుగులు రాలీనదె | 3/164 | 93 |
| 94. భోగసహాయులె పొరుగెల్లా | 2/99 | 94 |
| 95. మంచం బెక్కినపిమ్మట మరి వావియు | 15/455 | 95 |
| 96. మక్కు వలర జేరులైన మంచిపండు | 15/454 | 96 |
| 97. మదమత్సరము లేక మనసు పేదై పో | 1/59 | 97 |
| 98. మద్దకాసిన్నెకా మనకు నేమి బాఁతి | 17/438 | 98 |
| 99 మించిన తలపోఁతలే మీఁద మిక్కిలి | 3/363 | 99 |
| 100.రవ్వలైనా నాయఁగాని రాఁపైనా | 27/184 | 100 |
| 101.వరుసకు నీమగఁడు వచ్చీఁగాక | 27/51 | 101 |
| 102.వినవే చెలియ నేఁడు విభుని | 17/382 | 102 |
| 103.విన్నపము లేమి సేసే వేగినంతాను | 3/147 | 103 |
| 104.విటిగినట్టిబండివారు వెట్టివారు గాక నీ | 17/440 | 104 |
| 105.వేసరకు వీఁడేల యనకుము విడువ | 2/35 | 105 |
| 106.సిరిఁ దొడపై నిడి శ్రీనరసింహుఁడు | 2/113 | 106 |
| 107.హరి యిచ్చిన వరము | 3/364 | 107 |
| 108.హరి నీవే దిక్కు గాని యట | 15/303 | 108 |

# ప్రార్థన

కం॥ శ్రీసతి నెడదను నిలిపిన
ఆ సరసుని వేంకటాద్రి అధిపుని తలచెన్
ఆసను వీడని ప్రేమిక
ఆ సతి మన అన్నమయ్య అలరించె హరిన్

చం॥ గడచిన జన్మలందు తను గాంచిన విద్యల వైభవంబులన్
విడువక జీవుడున్ బడయు వింతగనావిభవంబు కొద్దిగా
గడుసుగకైతలల్లు భళి! కమ్మగ వీనులవిందుజేయురా
వడిగల వేంకటేశ్వరుడ! వాదనకందవు నీదు లీలలున్

కం॥ అనుపమ మాతని లీలలు
కనులారా గాంచినేను కాదనగలనా?
వినిపించ గలనుకైతను
తెనుగున, హరికరుణగాక తెలియనుయెటులో

ఉ॥ ఎవ్వనికైనలొంగనిది,యేమని వేడిన జాలిలేని వా
డెవ్వరు మృత్యుదేవతట, యెందుకువేదన చింతమానుడీ
అవ్వనజాక్షుడౌ హరిని అప్పనినే శరణంచు మ్రొక్కుడీ
నవ్వుచు చావువచ్చినను నమ్ముడు చేరుడు వేంకటేశ్వరున్.

మ॥ హరినే నమ్మిన తాళ్ళపాక సుకవుల్ ఆ వేంకటేశోత్తమున్
వరముల్ వేడరు జీవితమ్ము హరికేపాటించి తామంకితం
బరయన్‌జేసిరి; కీర్తనంబులిటుగా అందించి మోక్షార్థతన్
హరిసాన్నిధ్యముపొందినారు, యిదిగో ఆ బాటనేత్రొక్కితిన్.

ఆ.వె॥ కరివరదుని చేరి హరిచరణము కోరి
వరముగిరము కోర, పరమునెరుగ
చేరరార యనర శ్రీధరా! సిరివరా!
గిరుల దొరవు "దారి" హరిపురంబె

సీ॥ "హరి యిచ్చిన వరము అన్నమయ్య"ని నమ్మి
ఆతడేగురుడంచు అతనిసుతుడు
పెదతిరుమలపాడె పెక్కుకీర్తనములు
అధ్యాత్మశృంగార అద్భుతములు
తండ్రికి తగినట్టి తనయుడే అనిపించె
ఈ మాట ఋజువౌను ఇది చదివిన
ఇరువురి కీర్తనల్ ఇమిడించి తిందున
స్థాలీపులాకమౌ లీలవోలె

తే.గీ॥ పాఠకులకిది నచ్చగా భక్తిరక్తి
చేర్చి యొకచోట దీనిని జెప్పినాడ
నీవు మెచ్చిన ధన్యుడ నవుదునయ్య
ఇంకకోరునదేముంది వేంకటేశ!

**తరళము**

వరములిచ్చెడి శ్రీహరియ్యది వాసిగా నిటులిచ్చెరా
సురుచిరంబగు లీలతో మధుసూదనున్ పొగిడే సిరిన్
మరణమైనను నష్టమేమిటి? మాధవుండిది మెచ్చినన్
విరులు యీకవితా సుమంబులు వేంకటేశ్వర! దాల్చుమా.

శా॥ మాయామేయజగంబు నిత్యమని సంభావించినా బోంట్లునీ
మాయన్ దాటగలేక మత్తులగుచున్ మా బిడ్డలున్భాగ్యముల్
మాయీ బందుగులండ నాకుయనుచున్ మాత్సర్యగర్వాంధులౌ,
ఓయీ శ్రీహరి కాలుడొచ్చిపిలువన్ వొక్కండు రక్షించునా?

ఆ.వె॥ భార్యచాటుజేరు 'బంగారు బిడ్డలు'
"తాళి"కొరకె దిగులు తన పడతికి
బంధుజనులు ఆస్థి వాటాలకేడ్తురు
వేంకటేశ! మనిషి "వెట్టికుంక"

# ముందుమాట

దీనికి పూర్వం "హరినే  అడుగరో ఆమాట" అనే పేరుతో 201 అన్నమయ్య, ఆయన పుత్రపౌత్రులు చెప్పిన అధ్యాత్మక కీర్తనలను భావదర్పణమున వాటి విశ్లేషణకు అద్దం పట్టినట్లు అందించే ప్రయత్నాన్ని శ్రీవేంకటనాథుడు నాచేత చేయించాడు. అక్కడక్కడా మచ్చుకి ఆ త్రండీ కొడుకు చెప్పిన శృంగారకీర్తనలూ తారసిల్లుతాయి. అదేస్ఫూర్తితో అన్నమయ్య ఆయన పుత్రుడు పెదతిరుమలయ్యల కవితా ధోరణిలో వైవిధ్యాన్ని పాఠకులకు రుచిచూపి తద్వారా స్వామి ప్రేమాస్పదుడనయ్యే ప్రయత్నం చేద్దామనే ఆశకలిగింది.

దాని పర్యవసానమే మీ చేతిలోని ఈ రచన. ఇది నా "హరి నామమే కదా! అన్నమయ్య వరము" వలె విడివిడిగా శృంగార, వైరాగ్య, భక్తి, జానపద కీర్తనల సంకలనము కాదు. దీనిలో వైవిధ్యమేమంటే ఇది ఆ తాళ్ళపాక తండ్రీకొడుకులు చెప్పిన భక్తి, శృంగార, వైరాగ్య కీర్తనల మేళవింపు. శృంగారఝురిలో వోలలాడిన రసజ్ఞులను వేదాంతం వెనువెంటే వుండి పలుకరిస్తుంది. తదనంతరం భక్తి విరాజమానమవుతుంది. ఆయా భావాల దీపిక ఈ రచన. పెదతిరుమలయ్య వుపయోగించిన తెలుగు చాలా క్లిష్టమని నా భావన. ఒక "పదకవితాపితామహుని" పుత్రునిగా అటువంటి రచనలే చేసి, స్తనశల్య పరీక్ష చేయగల కవి విమర్శకులను నొప్పించక వొప్పించటం అంత "నల్లెరుపై బండి పోకడ" వ్యవహారంకాదు. అయినా, పెదతిరుమలయ్య అదే పని చేసి సెబాస్ అనిపించినాడు.

దీపము అంధకారంలో వున్న వానికి యెలా దారి చూపిస్తుందో ప్రతి చరణం అన్వయించుకొంటే గాని భావం వెలుగు చూడదని, ఈ హరి కీర్తనలకు అన్నమయ్య వరమే కదా! నా బోటి అనామకుడిని హరికి చేరువచేసి కోట్లాది

సంగీతప్రియులకు ఆత్మానందం కలిగించిన దీపిక ఇది అనిభావించి దీనికి "హరి ఇచ్చిన వరము అన్నమయ్య" అనేపేరు నిశ్చయించాను.

ప్రతి కీర్తనలోని క్లిష్టమైనపదాలకు అర్థాన్ని వివరించడానికి ప్రయత్నించాను. అయితే నేడు వాడుకలో వున్న తెలుగుపదాలు 500 ఏళ్ళ తర్వాత వాడుకలోవుండవు. ఉన్నా రూపాంతరం చెందుతాయి. దీనికి తోడు భాషలో వచ్చి చేరే పదాలూ వాటితో యేర్పడ్డ ప్రయోగాలు వుండనేవున్నాయి. నేటికి మనం 'బల్బువెలిగింది' అంటే 'భావం స్ఫురించింది' అని ఆనాడు అనేవారు. ఇంకా 500 ఏళ్ళ తర్వాత యేమంటారో యెవరూహించగలరు. "అంగవించి" వంటిమాటలు నేడువాడుకలోలేవు. తమిళ కన్నడ భాషల ఉ ద్ధతి వల్ల ఆనాడు వాడబడిన పదాలు నేడు వాడుకలో లేనే లేవు. అందువల్ల నా వివరణ సర్వజనసమ్మతమైన వివరణ కాకపోవచ్చును. కొండొక చోట అదే జరిగితే క్షమార్హుడను.

అన్నీ కలగాపులగం చేసి, శృంగార వైరాగ్య–భక్తి కీర్తనలు జమిలిగా వివరించుట యెందుకని కొంతమందికి సందేహం కలుగవచ్చును. వారికిదే నా సమాధానం. నాకు అన్నమయ్య కీర్తనలు వింటే అంతులేని ఆనందం కలుగుతుంది. కాని మెలకువతోవున్న 16 గంటలూ వినగలనా? స్వామి శరణాగతితో జీవించే ఒక సన్యాసి వుంటాడు. కానీ 16 గంటలు వైరాగ్యంతో వుండగలడా? వుండలేడు. ఎందుకని? శరీరధారణ పొందిన జీవులకు మనస్సు నిలకడగావుండదు. వాళ్ళకి వైవిధ్యం కావాలి. అందుకనే అప్పుడప్పుడు సన్మార్గులు చెడ్డపనులు, దుర్మార్గులు మంచి పనులూ చేస్తుంటారు. మంచి పనులు పుణ్యమూ చెడ్డపనులు పాపము ఇస్తాయను కొంటే మానవ జీవితమే పాపపుణ్యాల సంకలనం. పర్యవసానంగా జీవుడికి అంత్యమున యేమొస్తుందో యెవరికి తెలుసు? ఆదిశంకర మఠాధిపతులు సాక్షాత్తుదైవాంశసంభూతులు. వారికే కారాగారం తప్పలేదుకదా! అంతెందుకు

విష్ణువు యొక్క నందకాంశసంభవుడైన అన్నమయ్యకే సంకెలలు తప్పలేదుకదా! కనక మానవ జీవితం పొందాక కష్టసుఖాలను కాదన వీలులేదే.

మానవుడి మనోవైచిత్రి అనూహ్యం. భక్తికి పురుషరూపమైన అన్నమయ్య కొన్ని వేల శృంగార కీర్తనలు చెప్పారు. అట్లాగే వైరాగ్య జానపద కీర్తనలూ అసంఖ్యాకంగా చెప్పారు. ఆయా దశలలో మానవునికి కలిగే ఆయాభావాలననుసరించి ఆతని ప్రతిస్పందన వుంటుంది.

అందుకే ఈ "హరియిచ్చిన వరము అన్నమయ్య"లో శృంగార, భక్తి, వైరాగ్యాలను జమిలిగా యెన్నుకొని వివరించాను. అంతేకాదు, ఈ వైవిధ్యభరిత కీర్తనలను తండ్రీకొడుకులైన అన్నమయ్య, పెదతిరుమలయ్య యెలా చెప్పారో సింహావలోకనం చేసే ప్రయత్నమూ జరిపాను.

ఇది రసజ్ఞులకు నచ్చుతుందని నా ఆశ. శృంగార కీర్తన తరువాత భక్తి దానిననుసరించి వైరాగ్య కీర్తన విశ్లేషించినందువలన కవి భావపరంపరను అర్థం చేసికొనవచ్చును. దానికి తోడు ఒకతరం అంతరమున్న అన్నమయ్య పెదతిరుమలయ్యల కవితాశైలిలోని వ్యత్యాసం గమనించడానికి కూడా అవకాశం అందిపుచ్చుకున్నట్లవుతుందని నా అభిప్రాయం. నా మట్టుకు నాకు పెదతిరుమలయ్యను విశ్లేషించడమే కష్టం అనిపిస్తుంది. ఆయనవాడిన కొన్ని తెలుగు పదాలు, నిఘంటువుల్లోనూ కానరాలేదు అంటేనమ్మండి.

ఈ రచన నాకెంతో తృప్తి నిచ్చింది అన్న మాట నిజం. కొన్ని కీర్తనలు సంగీతపరంగా రసజ్ఞులను అలరిస్తే కొన్ని సాహిత్యపరంగా అలరిస్తాయి. ఏదియేమైనా ఆనందం కలుగుతుందనే మాట నిజం.

నేనింత వరకు యెన్నికీర్తనలను విశ్లేషించినా ఇంతవరకు గోవిందరాజస్వామికి అంకితం ఇవ్వలేదు. దీనితో గోవిందుడు నా కొఱతను తీర్చినన్ను కటాక్షించినాడు.

1 సంఖ్య: 122 సంపుటము: 1 పుట: 84 రాగం: ఆహిరి

**పల్లవి:** అంటఁబారి పట్టుకోరె అమ్మలాల యిదె
వెంటఁబారనీదు నన్ను వెడమాయతురుము

**చ. 1:** కాఁగెడు పెరుగుచాడె కవ్వముతోఁ బొడిచి
లేఁగలఁ దోలుకొని అలిగిపోయీని
రాఁగతనమున వాఁడె రాతిరి నారగించఁడు
ఆఁగి నన్నుఁ గూడడిగె నయ్యో ఇందాఁకను

**చ. 2:** కొలఁదిగాని పెరుగు కొసరికొసరి పోరి
కలవూరుఁ గాయలెల్లఁ గలఁచిపెట్టె
పలుకఁడు చేతిచట్టి పారవేసి పోయీనదె
చెలఁగుచు మూఁటగట్టెఁ జెల్లఁబో యిందాఁకను

**చ. 3:** మట్టుపడ కిటు నూరుమారులైనా నారగించు
ఇట్టె యిందరిలోని నాన్నాళ్ళును
వెట్టికి నాకొరకుఁగా వేంకటేశుఁ డారగించె
యెట్టు నేఁ డాఁకట ధరియించెనో యిందాఁకను

**భావదీపిక:**

చక్కటి జానపద కీర్తన చిన్నారి కృష్ణయ్యపై వినిపిస్తున్నారు అన్నమయ్య. యశోద తోటి గోపికలతో ఇలా అంటున్నది. ఓ అమ్మలారా! వాడిని అంటబారి (వెంట పరుగిడి) పట్టుకోండి. విడిపోయిన నా ఈ మాయదారి తురుము(కొప్పు) నన్ను వాడివెంట పరుగిడనీయదు. వాడు కాగెడు పెరుగును కవ్వముతో పొడిచి, నాపై అలిగి లేగదూడలను కాచుకొస్తానని పోయాడు. రాగతనమున (పొగరుతో) రాత్రి భోజనం కూడా చేయలేదు. అయ్యో! బిడ్డ ఆకలివేసి ఇందాక కూడు పెట్టమని అడిగాడే? ఊరగాయ జాడీలో యెంత పెరుగు కుమ్మరించాడో తెలుసా? ఊరగాయనంతా పాడుచేశాడు. అదేమిటిరా అంటే పలుకడు. పైగా అలక వొకటి. తన చేతిలోని చట్టి (పెరుగన్నం తినే మట్టి పాత్ర) నేలకేసి కొట్టి, పారవేసి అదే తింటానని దాన్నే మూటగట్టి వెంట తీసుకుపోయాడు. అమ్మ బాబోయ్!! యేమి పిల్లడమ్మా! వాడు ఇట్లా కుదురుకొనకుంటే, బిడ్డ ఈ పాటికి నూరు మారులైనా తిని వుండేవాడు. ఇన్నాళ్లూవాడికి వెట్టి చాకిరి చేశాను. దానికి ఫలితంగా ఈనాడు వేంకటేశ్వరుడై నా బిడ్డడై ఆరగించాడు. నేడుకూడా నా బిడ్డ ఆకలికి తాళలేడమ్మా!

*** మట్టుపడు = కుదురుకొను, * కాగెడు = కాగునిండా**

2 సంఖ్య : 204 సంపుటము: 27 పుట: 138 రాగం: దేశి

**పల్లవి:** **ఆఁటదాని చేతిదే ఆయపుఁగాఁపురమెల్లా**
**నీటున నీకన్నియును నేరుపఁగవలదా**

**చ. 1:** **నిన్ను దూరఁదగవా నీతోఁ బొందుసేసిన-**
**వన్నెల సతుల దూరవచ్చుఁగాక**
**మిన్నక దొరతనాన మించి మత్తుడవై యుంటే**
**తినఁగాఁ దామెల్లా నిన్ను తిద్ది తీర్చవలదా**

**చ. 2:** **అలుగ నీతోఁ దగునా అండనున్న నీ సతుల-**
**నలిని యేమిసేసినా నమరుఁగాక**
**కలసేటి జవ్వనపు గజరు నీకుఁ బట్టితే**
**తెలిపి నిన్నుఁ జాయకుఁదెచ్చుకొనవలదా**

**చ. 3:** **కొంగవట్టి నీగుణాలు కొసరితే నమరునా**
**సంగడి నీ ఇంతులఁ గొసరుట గాక**
**ముంగిట శ్రీ వేంకటేశ ముంచి నన్నుఁ గూడితివి**
**వుంగిటిగొన్న నిన్నుఁ దామొరయఁగ వలదా**

**భావదీపిక:**

ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు తాను స్వామి చెలికత్తెయై స్వామికి వత్తాసుపలుకుతూ యేమంటున్నారో వినండి. అయినా స్వామీ! ఒకమాట నిజము. అనురాగమయమైన కాపురం ఆడదాని చేతిలోనే ఉన్నదయ్యా! చక్కగా నీకు అన్నియు వోపికతో నేర్పి నిన్ను దిద్దుకోవలదా? ఆడది అణకువతోనే యేదన్నా సాధించగలదు. ప్రభూ! యెంతోమంది "వన్నెకత్తెలు" నీపై ఆశతో నీచెలిమి ఆపేక్షించుతుంటారు. దేవి వాళ్లని తప్పుబట్టాలిగానీ నిన్ను నిందించవచ్చునా? ఒకవేళ మిన్నక (ఊరకనే) నీవు దొరతనాన, అతిమత్తుడవై వుంటే, తామెల్ల (దేవి, ఆమె ఆప్తులు) నిన్ను దిద్దుకోవాలిగాని "రట్టు" చేసుకుంటే లాభమేమిటి? స్వామీ! ఒకవేళ నీవే వారిని నీ సతిగా స్వీకరించినందున వారు నీ సతులైతే దేవి వాళ్లనేమి చేసినా చెల్లుతుంది కాని నీపై అలిగితే ప్రయోజనమేమిటి? ఒకవేళ నిన్ను యౌవనపు మదము పట్టిందనుకొంటే అది నీకు తెలియునట్లు జేసి నిన్ను చాయకు తెచ్చుకోవాలి (తన మరుగున ఉండేట్లు చేసుకొనవలెను) అంతేగాని నీపై ఆగ్రహించవచ్చునా? దానివల్ల వొరిగేదేమిటి? దేవా! నీ గుణములను కొంగుబట్టి (బలవంతముగా) ఆ దేవి కొసరితే (తప్పుబట్టి కసురుకుంటే) న్యాయమేనా? నీకు చేరువయైన నీ భామలననవలెను. సరే! అదంతా అటుంచు; ఓ శ్రీవేంకటేశ్వరా! చెలరేగి నన్ను కూడితివి, నీకు వశమైనవారు నీమనస్సేమిటో తెలుసుకోవద్దా!! నీవెప్పుడూ దేవి స్వంతమే.

*** గజరు = మదము; * కొంగుబట్టి = బలవంతముగా**

3 సంఖ్య : 380 సంపుటము: 17 పుట: 220 రాగం: పాడి

**పల్లవి:** **అంత చుట్టములా నీకు నవి యెల్లాను**
**సంతసమే కాక నీకు జాలిమాలి యేలే**

**చ. 1:** **ఆకసపుచందురుఁడు అఱచేతిలోనఁ జిక్కె**
**చేకొని రమణి యింకాఁ జింత యేలే**
**దాకొన్న తుమ్మిదలును తన్నుఁ దానె వెడ జారె**
**నీ కేల చిన్నఁబోను నెలతరో నేఁడు**

**చ. 2:** **ముంచినట్టి చల్లగాలి ముక్కుననే వెళ్లఁ జొచ్చె**
**వంచిన శిరసుతోడ వాఁడ నేటికి**
**పంచశరునియమ్ములు పక్కనఁ గన్నులు మలసె**
**యెంచరాని యలపులు యిపు డేలే నీకు**

**చ. 3:** **నిరతిఁ జిలుకపల్కు నీ మోనమునఁ జిక్కె**
**పరగ నివ్వెఱగులు పై నేలే**
**గరిమ శ్రీవేంకటేశుఁ గలసితి విదివో**
**అరిది యలమేల్మంగ వన్నియుఁ జేకూడెనే**

**భావదీపిక:**

పెదతిరుమలయ్య కూడా తన తండ్రివలెనే, కొరుకుడు పడని పదప్రయోగం చేయటంలో దిట్ట. దీనిపల్లవిని చూడండి. ఇక్కడ మాలి అంటే తోటమాలి అనుకోకండి. అది “జాలి” అనే పదానికి జంటపదం. నేటికాలంలో “జాలిగీలి” అంటాము. ఆయన దేవి చెలికత్తెయై ఇలా అంటున్నారు. ఏమమ్మా అవి (చంద్రుడు, తుమ్మెదలు, చల్లగాలి, మన్మథుని అమ్ములు) యెల్లా నీకు చుట్టములై పోయాయినవా? అవి స్వామిని యెంత తపింప చేస్తాయో చింతించక సంతసమేలనమ్మా? నీకు జాలిమాలి లేవా యేమిటమ్మా? ఓ రమణీ! ఆకాశంలో చంద్రునివంటి భర్త నీ అరచేతిలో నున్నాడు. ఇంకా నీకు దిగులు యెందుకమ్మా? జారిన నీకొప్పు గుమిగూడి దాగిన తుమ్మెదలను తలపించుచున్నది. ఓ నెలతా! దీనికి నీవేల చిన్నబుచ్చుకొనెదవు? విజృంభించిన చలిగాలి ముక్కులలోకి వెళ్లిపోతున్నది. మరి వంచిన నీ శిరస్సు వాడిపోయిన ముఖమును చూపుచున్నదే మమ్మా? పంచశరుడైన మన్మథుని బాణముల తాకిడికి నీకన్నులేనాడో ఉద్రేకమునకు లోనైనవి. ఈనాడు నీవు అలపు (శ్రమను) ప్రకటించి ప్రయోజనమేమమ్మా? గొప్ప ఆసక్తి నీ చిలుకపలుకులలో ప్రతిబింబిస్తుంటే ఇంకా నీ పారవశ్యం ప్రకటించాల్సిందేముందమ్మా? ఇదిగో శృంగార రాయడైన శ్రీవేంకటేశ్వరునికూడినావు. అరుదైన అలమేల్మంగవు. అన్నీ అమరిన సిరుల రాణివి నీకు లోటేమిటమ్మా?

*** దాకొన్న = దాగిన, * నివ్వెఱగు = పారవశ్యము**

4 సంఖ్య : 399 సంపుటము: 3 పుట: 269 రాగం: దేసాక్షి

**పల్లవి:** **అల్లనాఁడే యిదెరఁగ మైతిమి గాని**
**యిల్లిదె దేవుని కృప యీడ నున్నది సుండి**

**చ. 1:** **చేరువవో మోక్షము శ్రీహరిభక్తికిని**
**ధారుణిఁ గర్మమునకే దవ్వుగాని**
**యీరీతి నింద్రియముల నించుకంతే దాఁటిన**
**దూరముగాదు జ్ఞానపుత్రోవ వున్నది సుండి**

**చ. 2:** **ధరఁ జేతిది వైకుంఠ మతని దాస్యమునకు**
**పరధర్మముల కగపడదు గాని**
**అరుదైన యాసల ఆయము వొడిచితేనే**
**అరసి యాకంతగుండా నందవచ్చుఁ జుండి**

**చ. 3:** **తలఁపులో దక్కె ముక్తి తగు శరణాగతికి**
**శిలుగుఁ బుణ్యములకుఁ జిక్కదుగాని**
**తెలిసి శ్రీవేంకటేశు తిరుమంత్రము నాలికెఁ**
**బలికినాడనే దివ్యపద మబ్బుఁ జుండి**

**భావదీపిక:**

అత్యద్భుతమైన ఆధ్యాత్మ కీర్తన వినిపిస్తూ అన్నమయ్య ఏమంటున్నారో గమనించండి. జీవుడి అత్యున్నతమైన కోరిక మోక్షమే. కానీ జీవులంతా తొలినాళ్లలో యవ్వనచాపల్యానికి లోనై అల్లనాడే ఇదెరుగరు. మేమూ అంతే. కాని ఇల్లిదిగో మాకు తిరుమలదేవుని కృప ఈ జన్మలోనే ఉన్నది, సుండీ అంటున్నారు. ఆ మోక్షము ధాత్రిలో కర్మబంధాలలో తగులుకొనేవారికి దూరంగా ఉంటుంది. కాని శ్రీహరి భక్తిని తగులుకొన్నవారికి మాత్రం చేరువలో (సమీపముననే) ఉంటుంది. ఈ విధముగా జీవుడు ఇంద్రియముల దాడిని నిగ్రహించగానే జ్ఞానమార్గము వాడికెన్నడూ దూరం కాదు సుమా! ఈ భువిలో ఆ శ్రీహరి దాస్యమునకు వైకుంఠము చేతిలో ఉన్న నిమ్మపండులాంటిది. కాని అన్యధర్మములను చేబట్టిన వారికి మాత్రం వైకుంఠం దుర్లభమే. జీవునికి ఆశల ఆయము (మర్మము) తెలిసి దానిని విడిచిబెట్టితే అరుదైన కంత(దూరిపోయే మార్గము) కనబడుతుంది. దానిగుండా పోతే ముక్తిని పొందవచ్చును సుమా! తగువిధంగా శ్రీహరి శరణాగతి పొందినవాడికి ముక్తి యెక్కడో వైకుంఠంలో ఉండదు; వాడి మనస్సులోనే ఉంటుంది. కష్టతరమైన పుణ్యకార్యాల గందరగోళంలో పడిపోక శ్రీవేంకటేశ్వరుని తిరుమంత్రమైన "ఓం నమో వేంకటేశాయ" ను మీ నాలుకపై పెట్టుకుంటే, ఆ మోక్షమార్గం దొరకదా!

*** శిలువు = కష్టతరమైన, * అయము = మర్మము**

5 సంఖ్య : 238 సంపుటము: 15 పుట: 161 రాగం: లలిత

**పల్లవి: ఆసలు చెరుచకుమీ యచ్యుత**
**ఆ సుద్దులె యీ సుద్దులు అచ్యుతా**

**చ. 1: అలవాటే తొల్లే నీకు నచ్యుతా**
**అలుగము ఇంక నీతో నచ్యుతా**
**అలయకు మింక నీవు అచ్యుతా నిన్ను**
**నలమి పట్టెఁగాని యచ్యుతా**

**చ. 2: ఆలసించఁ బనిలేదు అచ్యుతా**
**ఆలిమగని సంధి నచ్యుతా**
**ఔలే నీ విట్టే యచ్యుతా**
**ఆలించి మమ్మేలితివి ఆచ్యుతా**

**చ. 3: అసము దించకు మింక నచ్యుతా**
**అసురుసురై చిక్కితి మచ్యుతా**
**అసలు చెమటఁ గడి యచ్యుతారతి**
**యసుదా శ్రీవేంకటాద్రి యచ్యుతా**

**భావదీపిక:**

ఈ అధ్యాత్మ భక్తి సన్నుతిలో పెదతిరుమలయ్య అచ్యుతిని పరిపరి విధములుగా కీర్తిస్తున్నారు, వేడుకొంటున్నారు. ఇంతచిన్న కీర్తనలో కూడా నిఘంటువుని వెదకాల్సివస్తున్నదంటే ఆయన పాండిత్యం యెంతటిదో కదా! ఇది గోపికల వేడుకోలు అని అర్ధమవుతున్నది కదా! ఓ అచ్యుతా! ఆశలను చెరచకుమయ్యా! ఆ సుద్దులే (అలనాటి నీ లీలలే) నేను చెప్పబోయే యీ సుద్దులయ్యా అచ్యుతా! స్వామీ! నేను నీకిదివరకే అలవాటైపోయాను. ఒట్టుపెట్టి చెబుతున్నాను, ఇక నీపై నేను అలుగను. ఓ అచ్యుతా! నీవింకా అలయకుమయ్యా (ఆలస్యము చేయకయ్యా) నిన్ను అలమిపట్టేము (ఆక్రమించి పట్టుకొంటిమి) అచ్యుతా! ఓ అచ్యుతా! నేను నీకొఱకై సిద్ధముగా నున్నాను. ఇంకా నీవు ఆలస్యముజేయ తగదు. ఆలుమగల మధ్య దూరి పడుకొన్న కొంటె కోణంగివి. ఔనులే గానీ ఓ అచ్యుతా! నీవు మమ్ముల ఆలకించి ఏలుకొన్నావు. ఓ అచ్యుతా! మానినులమైన మా దర్పము దించకుమయ్యా! అసురుసురై (ఉస్సురుమనుచు) నీకు జిక్కినామయ్యా! నీవు సంకోచించక రొచ్చుగా మారిన చెమట కారుతున్న మమ్ముకూడితివయ్యా అచ్యుతా! రతిక్రీడలో అసాధ్యుడవైన అచ్యుతా! ఇక నిన్నేమని కీర్తించమయ్యా?

*** అసము = దర్పము, * అసలు చెమట = రొచ్చుగా మారిన చెమట**

6 సంఖ్య : 127 సంపుటము: 1 పుట: 87 రాగం: సామంతం

**పల్లవి:** **ఆదిదేవుఁడై అందరిపాలిటి**
**కీ దేవుఁడై వచ్చె నితఁడు**

**చ. 1:** **కోరిన పరమ యోగుల చిత్తములలోన**
**యేరీతి నుండెనో యీతఁడు**
**చేరవచ్చిన యాశ్రితులనెల్లఁ బ్రోవ**
**యీరీతి నున్న వాఁడీతడు**

**చ. 2:** **కుటిల దానవుల కోటానఁగోట్ల**
**యెటువలెఁ ద్రుంచెనో యీతఁడు**
**ఘటియించి యిటువంటి కారుణ్యరూపుఁడై**
**యిటువలె నున్న వాఁడీతడు**

**చ. 3:** **తక్కక్క బ్రహ్మాండ తతులెల్ల మోచితా-**
**నెక్కడ నుండెనో యీతఁడు**
**దిక్కుల వెలసిన తిరువేంకటేశుఁడై**
**యిక్కడ నున్న వాఁడీతఁడు**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ భక్తిరసప్రధానమైన కీర్తనలో ఆదిదేవుడైన శ్రీమన్నారాయణుని విభవాన్ని కీర్తిస్తున్నారు. ఇతడు ఆదిదేవుడు. అందరి పాలిటికీ దేవుడైవచ్చి ఇక్కడ వెలసినాడు అన్నీ త్యజించిన పరమయోగులు కూడా తమ చిత్తములలో కోరి ఇతనినే ధ్యానిస్తున్నారు. అట్టివారి చిత్తములలో ఈయన యెట్లావున్నాడో కదా! తన అశ్రితులు తనను చేరవచ్చినచో వారు పామరులైనా అందరినీ ఒకే రీతిగా రక్షించేటందుకే అవనిపై వెలసి యీరీతి నున్నాడితడు. దానవులు కుటిలాత్ములై అన్యదేవతలచే కోరరాని వరములు కోరి బలోపేతులై లోక కంటకులైతే కోటానుకోట్ల సంఖ్యలో నున్న వారిని మాయోపాయాలతో ఇతగాడెటుల ద్రుంచినాడో కదా! అట్టి భీకరుడు నేడు తిరుమల కారుణ్యమూర్తియై యీ విధంగా వెలసినాడు, యెంత ఆశ్చర్యము? సంకోచించక భువనాల నన్నింటినీ తన కుక్షిలో మోయుచున్న ఇతగాడు మరి తానెక్కడున్నాడో కదా! అన్నీ నీవై, అన్ని దిక్కులలోనూ నీవై వెలసి తిరువేంకటేశ్వరుడవై ఇక్కడ మన యెదుటనున్న వాడే ఇతడు.

*** తక్కక = తప్పక, * కుటిల = వంకరబుద్ధి గల**

7 సంఖ్య : 175 సంపుటము: 1 పుట: 118 రాగం: లలిత

**పల్లవి:** **ఆశాబద్ధుఁడనై యలసి నిన్నుఁ గడు**
**గాసిఁ బెట్టినవాఁడఁ గాను**

**చ. 1:** **ఘనకర్మపరుఁడనై కర్మరూపునిఁ జేయ**
**నిను దూరి భారము నీకుఁ గట్టినవాఁడఁ గాను**
**పనిలేని దుఃఖలంపటుఁడనై దుఃఖము**
**గనుపించకుమని కడువేఁడినవాఁడఁ గాను**

**చ. 2:** **శ్రీవేంకటగిరి దేవేశ నాకిది**
**గావలె ననువాఁడఁ గాను**
**కావలసినయవి గదిసిననవి నాకు**
**గావను మనుజుండఁగాను**

**భావదీపిక:**

అన్నమయ్య ఈ అధ్యాత్మకీర్తనలో స్వామితో యేమి విన్నవించుకొంటున్నారో ఆలకించండి. నేను మానవుడను కనుక ఆశాబద్ధుడనైతిని. అందుచేత ప్రతిసారి నా కోరిక తీర్చమని నిన్ను కడుగాసిబెట్టినవాడ (యెక్కువ బాధించినవాడ) నయ్యాను. కావున నన్ను మన్నించుము ప్రభూ! కర్మలమీద లేనిపోని మక్కువ జూపి, గొప్ప కర్మపరుడనై, ఫలితం అనుభవించేటప్పుడు మాత్రం నన్ను కర్మరూపుని జేశావని బాధ్యత నీపైన వేసి నిన్ను నిందించాను. అనవసరమైన దుఃఖముతో గూడిన లంపటాలు నాకు కనబడకుండా చేయమని కడువేడినవాడను కాను. ఇందులో నీ తప్పేమీలేదు. శ్రీవేంకటగిరిపై నెలకొన్న దేవేశా! నాకిది కావాలి స్వామీ! నన్ను అనుగ్రహించు అని భక్తితో వేడిన వాడనుకాను. అటులనే నాకు కావలసినవి నాకు లభిస్తే అవి నాకు గావు అనే విరక్తుడైన మానవుడిని కూడా కాదు. నేను ఆశాబద్ధుడనైన సామాన్య మనుజుడను తండ్రీ!

*** పనిలేని = అనవసరమైన, * కదిసిన = లభించిన**

8 సంఖ్య : 149 సంపుటము: 3 పుట: 100 రాగం: శంకరాభరణం

**పల్లవి:** **అక్కలాల చూడుఁడందరును**
**నిక్కి వారవట్టీ నేఁడు గృష్ణుఁడు**

**చ. 1:** **ఆనవాలవుట్టి అడుకులవుట్టి**
**పానకపుటుట్టి బలిమినే**
**ఆనుక కోలల నందియంది కొట్టి**
**తేనెవుట్టి (?) గొట్టీ దేవకీసుతుఁడు**

**చ. 2:** **పెరుగువుట్టి మంచి పేరిన నేతివుట్టి**
**సరివెన్నవుట్టి చక్కెరవుట్టి**
**వెరవుతోఁ గొట్టి వెస బాలులతో**
**పొరుగువుట్టి (?) గొట్టీ పొంచి రాముఁడు**

**చ. 3:** **మక్కువ నలమేలుమంగఁ గూడి నేఁడు**
**చొక్కి శ్రీవేంకటేశుఁడు వీధుల**
**నిక్కి వుట్లెల్లా నిండాఁ గొట్టి వుట్టి(?)-**
**చక్కిలాలు గొట్టీ జగతీశుఁడు**

**భావదీపిక:**

శ్రీకృష్ణ లీలామృతాన్ని వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఓ అక్కలారా! గోపికలారా! చూడండమ్మా! ఈ చిలిపి కృష్ణుని అల్లరి. అందరూ చూడండి. ఏమి అతిశయము!! నేడు వారవట్టీ (ధారగా కారిపోవునట్లు)చేస్తున్న వీడి నేమి చేయగలము? మేము దాచుకొన్న అటుకులు ఏ వుట్టిలో వున్నాయో పానకము యేయే వుట్టిలో వున్నదో పసిగట్టి యేమి చేశాడో, చూశారా? ఆ తరవాత కోలలు (గొల్లవారు వాడే చిన్న కఱ్ఱలు) తీసికొని వాటిని పగులగొట్టాడు. ఈ దేవకీనందనుడు అంతటితో ఆగాడా? లేదు మేము తేనెదాచుకొన్న వుట్టి పగులగొట్టి తేనెనంతా నేలపాలు చేశాడు. సరే! వీడి అల్లరి చూచి పోనీలే అని వూరకుంటే మరీ రెచ్చిపోయాడు. మేము పెరుగు, పేరిన నెయ్యి, వెన్న, చక్కెర, దాచికొనిన వుట్లని కూడా అలాగే పగలగొట్టినాడు. తాజెడ్డ కోతివనమెల్లా చెరిచిందని వాడి భయంలేని తీరుతో బలరాముడు కూడా తోటి బాలురతో కలసి పొరుగువుట్లను (పక్క ఇంటిలోని వారి వుట్లను) తామూ అలాగే పగలగొట్టారు. నేడు (ఈ కలియుగంలో) ప్రేమతో అలమేల్మంగను గూడి శ్రీవేంకటేశ్వరుడై చొక్కినాడు (పరవశించినాడు). ఆయనే నేటి బాలురను ప్రేరేపించి వుట్ల పండుగనాడు వీధులలో కట్టిన ఎత్తైన వుట్లను పగులగొట్టిస్తున్నాడు. జగతికే ఈశ్వరుడైన ఆయనకిదొక వేడుక.

*** మక్కువ = ప్రేమతో; * నిక్కి = అతిశయించి**

9 సంఖ్య: 78 సంపుటము: 1 పుట: 54 రాగం: ఆహిరి

**పల్లవి:** **అతిదుష్టుఁడ నే నలసుఁడను**
**యితరవివేకం బిఁకనేది**
**చ. 1:** **ఎక్కడ నెన్నిట యేమి సేసితినొ**
**నిక్కపుఁదప్పులునేరములు**
**గక్కన నిన్నిట కలిగిననీవే**
**దిక్కుగాకమరి దిక్కేది**
**చ. 2:** **ఘోరపుఁబాపము కోట్లసంఖ్యలు**
**చేరువ నివె నాచేసినవి**
**నీరసునకు నిటు నీకృప నాకిఁక**
**కూరిమి నా యెడ గుణమేది**
**చ. 3:** **యెఱిఁగి చేసినది యెఱఁగక చేసిన-**
**కొఱతలు నా యెడఁగోటు లివే**
**వెఱపు దీర్చి శ్రీవేంకటేశ కావు**
**మఱువక నాగతి మరి యేది**

**భావదీపిక:**

పశ్చాత్తాప తప్తహృదయులై అన్నమయ్య వినిపిస్తున్న కీర్తన నవధరించండి. ఓ దేవదేవా! నేనెంతో దుర్మార్గుడను. దుష్కార్యములను చేసిచేసీ అలిసిపోయాను. ఇటువంటి నాకు ఇతరములైన వివేకము యెట్లా వుంటుంది? లేదు. చెప్పజాలని నేరములు, తప్పులు యేమేమి, యెక్కడెక్కడ యెన్నెన్ని చేశానో? నిన్నిక్కడ, యీనాడు అతిశీఘ్రముగా పొందాను. ఇక నాకు వున్న దిక్కు నీవేతండ్రీ! మరొక దిక్కు లేనేలేదయ్యా! యెక్కడున్నది? ప్రభూ! కోట్ల సంఖ్యలో ఘోరమైన పాపములను చేశాను. నేను చేసిన నా పాపాలు యెక్కడికో పోలేదు. ఈనాడు అవే నన్ను చుట్టుముట్టి నన్ను పీడిస్తున్నాయి. నీరసునకు (పాపాలు చేసి చేసీ నీరసించి పోయినవానికి) నీకృప యెట్లా కలుగుతుంది? నాలో యెట్టి సుగుణమూ లేదు. నాపై కూరిమి(ప్రేమ) చూపించమని యే ముఖము పెట్టుకొని అడుగ గలను? సిగ్గువుండవద్దా? తెలిసి తెలిసీ యెన్నెన్నో పాపాలు చేశాను. అట్లాగే నాకు తెలియక మరికొన్ని పాపాలు చేశాను. అవికూడా నావలన కోట్లకు తక్కువ కాకుండానే వున్నాయి. అయిందేదో అయింది. “అన్యధా శరణం నాస్తిత్వమేవ శరణంమమ” ఓ శ్రీవేంకటేశ్వరా! నా భయమును నివారించి నన్ను రక్షించు తండ్రీ! నన్ను మఱువకు. నాకింకో దిక్కు లేనేలేదు.

*** అలసుడు = అలసినవాడు, * కొఱతలు = తక్కువ పనులు**

10 సంఖ్య : 40 సంపుటము: 1 పుట: 26 రాగం: శ్రీరాగం

**పల్లవి:** **అదిగాక నిజమతం బదిగాక యాజకం-**
**బదిగాక హృదయసుఖ మదిగాక పరము**

**చ. 1:** **అమలమగు విజ్ఞానమను మహాధ్వరమునకు-**
**నమరినది సంకల్పమను మహపశువు**
**ప్రమదమను యూపగంబమున విశసింపించి**
**విమలేందు యాహుతులు వేల్పంగవలదా**

**చ. 2:** **అరయ నిర్మమకార మాచార్యుఁడై చెలఁగ**
**వరుసతో ధర్మదేవత బ్రహ్మ గాఁగ**
**దొరకొన్న శమదమాదులు దానధైర్యభా-**
**స్వరగుణాదులు విప్రసమితి గావలదా**

**చ. 3:** **తిరువేంకటాచలాధిపునిజధ్యానంబు**
**నరులకును సోమపానంబు గావలదా**
**పరగ నాతని కృపాపరిపూర్ణ జలదిలో**
**నరుహులై యవబృథం బాడంగవలదా**

**భావదీపిక:**

అన్నమయ్య ఈ కీర్తనలో “విజ్ఞాన మహాధ్వరము” (జ్ఞానయజ్ఞము) యెలా చేస్తారో వివరిస్తున్నారు. “అదిగాక నిజమైన మతమేది? అదిగాక యాజకము (యజ్ఞము) మరొకటేది? అదిగాక హృదయానందము యేది? అదిగాక పరము (మోక్షము) వేరొకటున్నదా?” అంటున్నారు. నిర్మలమైన జ్ఞానయజ్ఞమునకు ముందుగా “సంకల్పము” మహాపశువు అమరినది. జ్ఞానానందమను యుపస్తంభమున దానిని వధించి, నిర్మలమైన ఇంద్రియములను ఆ జ్ఞానాగ్ని యందు ఆహుతి చేయవలెను. ఆపైన నిర్మమకారము (మమకారత్యాగము) యజ్ఞము నిర్వహించు ఆచార్యుడై అతిశయించుచుండగా ధర్మదేవత (ధర్మాచరణము) బ్రహ్మయై యుండగా, శమము-దమము-దానము-ధైర్యము మొదలైన భాస్వర(దీప్తించే) సుగుణాలు బ్రాహ్మణోత్తములు కాగా ఆ జ్ఞానయజ్ఞం చేసే నరులకు “సోమపానము” యేమిటో తెలియునా? తిరువేంకటాచలాధీశుడైన వేంకటేశ్వరుని యొక్క నిజ ధ్యానమే. ఆ మహానుభావుని పరిపూర్ణమైన కృపాసముద్రమునకు అర్హులై అవబృథస్నానము (యజ్ఞము కడపట న్యూనాతిరిక్త దోష పరిహారార్థము చేయు స్నానము) నాచరించవలెను కదా!

*** దొరకొన్న = సిద్ధించిన * హృదయసుఖము = ఆత్మానందము**

11 సంఖ్య : 354 సంపుటము: 3 పుట: 239 రాగం: సామంతం

**పల్లవి:** **అన్నియుఁ జదివితిఁగా ఆహా నేను**
**నున్ననిమాటల నోరు నుడిగెడిదేదో**

**చ. 1:** **వొద్దనుండే నాజన్మమోహో మరచితిఁగా**
**చద్దివంటి మాతల్లిచన్ను మఱచితిఁగా**
**ముద్దుతోఁ బొరలే మలమూత్రము మఱచితిఁగా**
**యెద్దువంటివాఁడ నేను యెఱఁగేటిదేదో**

**చ. 2:** **యిప్పటిచవి రేపటికెంచి తనియలేఁగా**
**తప్పక కాంతలఁ జూచి తలఁపు దనియలేఁగా**
**ముప్పిరిఁ బెక్కుగాలము ముదిసీఁ దనియలేఁగా**
**పిప్పివంటివాఁడ నేను పెనఁగేటిదేదో**

**చ. 3:** **యేడదో యీదేహమౌత యేనేమి నెఱఁగఁగా**
**కూడిన మనువెక్కడొ గురుతూ నెఱఁగఁగా**
**యీడనే శ్రీవేంకటేశుఁ డిట్టే నన్నుఁ గాచెఁగా**
**నీడవంటివాఁడ నేను నేరుపింకనేదో**

**భావదీపిక:**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ అధ్యాత్మిక కీర్తనలో తానెన్ని విద్యలనార్జించినా యెద్దువంటివాని వలెనో, పిప్పివంటి వానివలెనో మిగిలిపోయాడు గానీ శ్రీహరికి నీడలాగ ఉంటే ధన్యుడనయ్యేవాడను కదా! అన్ని వేదాలు, శాస్త్రాలు చదివికూడా మృదువుగా మాట్లాడనేర్వక కోపతాపాలతో మగ్గుతూనే వున్నాను. ఒద్దనుండే నా జన్మము (ఆత్మనై వేరువేరు పుట్టుకలు పొందుచున్నాను) అంటున్నారు. ఓహో! మరచితినికదా! ఆయా జన్మలలో జీవనాధారమైన చనుబాలు యెంతమంది స్త్రీల వద్ద త్రాగానో మరిచితిని. ముద్దులు కారుతున్న అందాలూ గుర్తు లేవు. నా మలమూత్రాలలో నేనే దొర్లాడటమూ గుర్తు లేదు. కేవలం ఎద్దులాగ మలమూత్రాల వివక్ష లేక జీవించే నేను తెలియగల జ్ఞానమేది? ఇది యెంతవిచిత్రము!! ఇప్పుడు రుచిగానున్నదే రేపటి రోజున తృప్తి కలిగించదు. స్త్రీల విషయంలో కూడా అంతే. ఇవాళ మోహింప జేసిన కాంత రేపు మొగము మొత్తిస్తుంది. ఎంత ముసలితనము వచ్చినా కాలము దాపురించేదాకా తృప్తి కలగదు. చెఱకు పిప్పివంటి వాడిని. ఇంకా నాకీ పెనుగులాట ఎందుకో తెలియదు. ఈ దేహము ఎక్కడినుండి వచ్చింది? రేపు దీనికి యేమవుతుందో యెరుగను. ఏ జన్మలో ఎవరిని పెండ్లాడానో గుర్తు లేదు. ఈనాడు శ్రీ వేంకటేశుని దయ నాకు కలిగింది. ఆయన నన్ను రక్షించాడు. నేను ఆయన నీడవంటి వాడను. నీడకు నేర్పనేదుంటుందా చెప్పండి?

* **ముప్పిరి = చేరికయై,** * **నున్నటి మాటలు** = మృదువైన మాటలు

12 సంఖ్య : 111 సంపుటము: 2 పుట: 75 రాగం: పాడి

**పల్లవి: అనుచు లోకములెల్ల నదె జయవెట్టేరు**
**నినుఁ గొల్చితిఁ గావవే నీరజాక్షుఁడా**

**చ. 1: అదివో కోనేటిలోన నదివో సర్వ తీర్థములు**
**అదివో పైఁడిమేడల హరినగరు**
**పొదలి పరుషలెల్లా పొదిగి సేవించేరు**
**యిదివో వరములిచ్చె నిందిరానాథుఁడు**

**చ. 2: అదివో వేదఘోషము అదివో సురలమూఁక**
**అదివో విశ్వరూపము అద్భుతమందె**
**గుదిగొనెఁ బుణ్యములు కోట్ల సంఖ్యలు చేరె**
**యిదివో దయదలఁచె నీశ్వరేశ్వరుఁడు**

**చ. 3: అదివో శ్రీవేంకటేశుఁ డక్కున నలమేల్మంగ**
**అదివో నిత్యశూరులు ఆళువారలు**
**నిదుల శేషాచలము నిక్కి పైపైఁ బొడచూపె**
**యిదివో కొలువున్నాఁడు హృదయాంతరాత్ముఁడు**

**భావదీపిక:**

నీరజాక్షుడైన శ్రీహరిని కీర్తిస్తున్నారు అన్నమయ్య. "లోకము లెల్ల, అదిగో జయము జయము అనుచు జయ వెట్టేరు (జయము పలుకుచున్నారు). నేను కూడా అట్లే నిన్ను గొలిచితిని. నన్ను కావవే (రక్షించవయ్యా), పద్మదళ నయనా!" అంటున్నారు. అదిగో నీ కోనేటిలో (స్వామి పుష్కరిణిలో) అల్లదే సర్వతీర్థములూ వున్నవి. అదిగో బంగారు మేడలతో శోభిల్లుతున్న నీ వైకుంఠపురము. అదిగో పరుషలు (తీర్థయాత్రచేయువారి సమూహము). అందరూ వినమ్రులై హరిని సేవిస్తున్నారు. మరి ఇందిరానాథుడు కూడా ఆనందంతో వారు కోరిన వరముల నిచ్చుచున్నాడు. అదిగో బ్రాహ్మణోత్తములు చదువుతున్న వేదఘోష వీనుల విందుగా వినబడుచున్నది. అదిగో దేవతల సమూహము. తన్మయుడైన శ్రీహరి అదిగో అర్హతకలవారికి తన విశ్వరూపమును చూపుచున్నాడు. ఆ విశ్వరూప సందర్శనము వలన వారికి లభించిన పుణ్యములు కోట్ల సంఖ్యలకు చేరినవి. ఆ ఈశ్వరేశ్వరుడే. ఆ విధముగా అందరినీ దయదలచినాడు. అదిగో శ్రీవేంకటేశ్వరుని హృదయ వాసినియైన అలమేలుమంగ. అదిగో నిత్యశూ(సూ)రులైన అళ్వారులు. నిధుల కాలవాలమైన శేషాద్రి నిక్కి యెత్తుగా కనబడుతున్నది. సర్వుల హృదయాంతర్యామి అయిన శ్రీ వేంకటేశ్వరుడు ఇదిగో ఇక్కడే కొలువైవున్నాడు.

*** నిత్య శూ(సూ)రులు = నిత్యనివాసము కలవారు(విష్వక్సేనాదులు)**

13 సంఖ్య : 50 సంపుటము: 2 పుట:34 రాగం: శంకరాభరణం

**పల్లవి:** **అప్పఁడు దైవాలరాయఁ డాదిమూల మీతఁడు**
**యిప్పుడిట్టిమహిమల నెక్కుడాయ నీతఁడు**

**చ. 1:** **చేకొని తొలితొలుతే చేసిన పన్నీరుకాపు**
**జోకఁ గాలువలై సొరిది జార**
**సైకపునీలాద్రినుండి జలజల బారేటి-**
**రేకల సెలయేరులరీతి నున్న దిదివో**

**చ. 2:** **తెప్పలుగా గుప్పినట్టి తెల్లని కప్పురకాపు**
**చిప్పిలుచు వెన్నెలలై చిందఁగాను**
**పుప్పొడిఁదోఁగిన కల్పభూజము నిలుచున్న-**
**చొప్పున నున్నాఁడిదివో సొంపులు మీరుచును**

**చ. 3:** **పొందుగ నంతటిమీఁదఁ బూసిన పునుగుకాపు**
**కందువ మాణిక్యముల గనియైనట్టు**
**అంది శ్రీవేంకటేశ్వరు కదె యలమేలుమంగ**
**చెంది యరతఁ గట్టఁగా శ్రీవిభుఁడై నిలిచె**

**భావదీపిక:**

అన్నమయ్య వినిపిస్తున్న శ్రీనివాసుని అభిషేక మహోత్సవాన్ని మానస నేత్రంతో వీక్షించండి. ఈతడు దైవాల రాయడు (దేవతల సార్వభౌముడు). అప్పడు (మన అందరి తండ్రి). ఈ కలియుగంలో ఇతగాడు చూపిన మహిమలు లెక్కకు మిక్కుటములు పూనుకొని దట్టముగా చల్లిన పన్నీటి కాపుతో ఈ స్వామికి చక్కగా జలకమాడించినారు. అప్పుడు పన్నీరు వరుసగా కాలువలై పారినది. అది చూడటానికి యెట్లావున్నదంటే సుందరమైన నీలాద్రి (నల్లటి కొండ) పైనుండి జలజలమని పారే సెలయేరా అనిపిస్తున్నది. స్వామి వంటి మీద తెల్లటి కర్పూరపు తట్టు గుప్పినట్లు వేసినారు. అవి ఆయన వంటిపై వెన్నెల చిందిన విధముగా నున్నది. అప్పుడా దేవదేవుడెలా వున్నాడంటే.. కల్పవృక్షానికి దట్టంగా పుప్పొడిలో దోగాడించినట్లున్నది. ఇదిగో సొంపులు మీరినట్లు వున్నాడు కదా! కప్పురకాపు వేసిన తరువాత స్వామికి దానిమీద పొందుగా పునుగు జవ్వాది వంటి సుగంధ ద్రవ్యాల మైపూత పూసినారు. నల్లని స్వామిపై ఆ పునుగు కాపు వలన ఆయన మాణిక్యముల గనివలె శోభిల్లుతున్నాడు. ఈ శ్రీవేంకటేశ్వరునకు మా తల్లి అలమేల్మంగనిచ్చి మెడకు కట్టినారు. అప్పటి నుంచే ఈయనగారు శ్రీపతియై మాకు వదలలేని తండ్రియైనాడు.

*** అరతన్ కట్టగా = మెడకు కడితే, * సైకపు = సుందరమైన**

14 సంఖ్య : 117 సంపుటము:2 పుట: 79 రాగం : భూపాళం

**పల్లవి:** **అప్పుడు చూచేదివో అధికుల నధముల**
**తప్పక యెచ్చరి యిదే తలఁచవో మనసా**

**చ. 1:** **కొండలవంటి పనులు కోరి ముంచుకుంటే నూర-**
**కుండి కైకొననివాఁడే యోగీంద్రుఁడు**
**నిండిన కోపములకు నెపముల గలిగితే**
**దండితోఁ గలఁగని యాతఁడే ధీరుఁడు**

**చ. 2:** **సూదులవంటి మాటలు సొరిదిఁ జెవి సోఁకితే**
**వాదులు వెట్టుకొననివాఁడే దేవుఁడు**
**పాదుకొన్న సంసారబంధము నోరూరించితే**
**ఆదిగొని మత్తుఁడు గానెట్టివాఁడే పుణ్యుఁడు**

**చ. 3:** **గాలాలవంటి యాసలు కడుఁ దగిలి తీసితే**
**తాలిమితోఁ గదలనాతఁడే ఘనుఁడు**
**మేలిమి శ్రీవేంకటేశుమీఁద భారము వేసుక**
**వీలక తనలో విఱ్ఱవీఁగువాఁడే నిత్యుఁడు**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన పల్లవిని నేనిలా అర్థం చేసికొన్నాను. అప్పుడు (జీవులు మరణించి భగవంతుని యెదుట నిలిచినప్పుడు) అధికులను అధములను నిష్పక్షపాతంగా చూస్తాడు. ఓ మనసా! ఇది గొప్ప హెచ్చరిక అని భావించు. ఇది విని బాగుపడి నిన్ను నీవు దిద్దుకో. కొండలను బోలిన పనులు (ప్రయోజనము కలిగించు వ్యాపారములు) ముంచుకొనినట్లు తనయెదుటనే వున్నా, వూరకుండే వాడే నిజమైన యోగీంద్రుడు. కోపము అధికముగా కలుగుటకు తగిన కారణమున్నా నిబ్బరంగా కలత చెందని వాడే నిజమైన ధీరుడు. తనను సూదులవంటి మాటలతో బాధిస్తున్నా వాటిని లెక్కసేయక పరులతో వాదనకు దిగనివాడే మనుజులలో దేవుడు. అల్లుకు పోయిన సంసార బంధాలు నోరూరించినా వాటిపై కన్నువేసి మత్తుడు కానివాడే నిజమైన పుణ్యాత్ముడు. ఆశ మనిషిని మట్టుబెట్టగల "గాలము" వంటిది. అది తగులుకొని యెత్తి పారవేసే ధైర్యముతో చలించి పోనివాడే ఘనుడు. బంగారము వంటి శ్రీవేంకటేశ్వరునిపై భారమువేసి, దౌర్బల్యుడుగాక తనలో తానే అతిశయించి వుండువానినే నిత్యుడు అంటారు.

*** వీలక = దౌర్బల్యుడుగాక * దండితో = నిబ్బరముతో, * ఆదిగొని = కన్నువేసి * తీసితే = యెత్తిపారవేస్తే**

15 సంఖ్య : 144 సంపుటము: 3 పుట: 97 రాగం: సాళంగనాట

**పల్లవి:** **అవధారు దేవ హరికులరామ**
**వివిధమై నీబంటు వెలయుచున్నాఁడు**

**చ. 1:** **అదె కలశాపురము హనుమంత రాయఁడు**
**కదనములోన రక్కసులఁ గొట్టి**
**యెదుట నిందరిలోన నేకాంగవీరుఁడై**
**కొదలేక ప్రతాపించి కొలువై వున్నాఁడు**

**చ. 2:** **చల్లని వనాలనీడ సాగుడుఁ గొండలోన**
**వల్లెగా వేసుకొన్న వాలముతోడ**
**పల్లదాన వలకేలు పంతమున నెత్తుకొని**
**కొల్లున మంటపములోఁ గొలువై వున్నాఁడు**

**చ. 3:** **పెక్కు పండ్లగొలలు పిడికిటఁ బట్టుకొని**
**చక్కఁగాఁ బెరిగి పెద్దజంగ చాఁచి**
**యిక్కువ శ్రీవేంకటాద్రి నిరవైన సర్వేశ**
**గుక్కక నీపై భక్తిఁ గొలువై వున్నాఁడు**

**భావదీపిక:**

ఈ కీర్తన పల్లవిలోనే గొప్ప తికమక పెట్టారు అన్నమయ్య. "హరి" అంటే విష్ణువని అందరికీ తెలుసు. "హరి" అంటే కోతి అని కొంతమందికి తెలుసు. కాని "హరి"కి పదునాలుగు అర్థములున్నాయనీ, అందులో "సూర్యుడు" ఒకటియని అతి తక్కువ మందికి తెలుసు. ఈ పల్లవికి అర్థమేమంటే, "సూర్యవంశోద్భవుడవైన రామా! ఓ దేవా! అవధారు (ఆలకింపుము) నీబంటు హనుమంతుడు అనేక విధములుగా అతిశయించుచున్నాడు" అని. అదిగో కలశాపురములో వెలసిన హనుమంతరాయడు. యుద్ధములో రాక్షసులను చావగొట్టి, నేడు మన యెదుట ఏకాంగవీరుడై (అసహాయ శూరునివలె) అంతులేని ప్రతాపముతో కొలువుదీరియున్నాడు. చల్లని గంధపుచెట్ల నీడలో, ఎత్తైన కొండమీద భుజముపై వల్లెవాటులా వేసికొనిన వాలము (తోక)తో, పల్లదాన (పౌరుషముతో) వలకేలు (కుడిచేయి) పంతమున పైకెత్తి, ఈ మంటపములో కొల్లున (అతిశయించి) కొలువై వున్నాడు. అనేక కొనలు గల పండ్లగోలను (ముళ్లగదను) తన పిడికిటిలో బిగించి, ఎంతో ఎత్తుగా పెరిగి, తన పెద్ద జంగను (పంగను) చాచివుంచి ఇక్కడ నెలకొని వున్నాడు. ఇతగాడు అక్కడ శ్రీవేంకటాద్రిపై నున్న సర్వేశ్వరా! నీపై శంకనెరుగని భక్తితో కొలువై వున్నాడు.

*** సాగుడు కొండ = ఎత్తైన కొండ, * గుక్కక = శంకలేక**

16 సంఖ్య : 33 సంపుటము: 2 పుట: 23 రాగం: రామక్రియ

**పల్లవి:** **అయ్యో వారిభాగ్య మంతేకాక**
**నెయ్యపువెన్న వట్టుక నెయ్యి వెదకేరు**

**చ. 1:** **దేవుఁడు వెల్లవిరై దిక్కులెల్లా నిండుండఁగా**
**సోవల నాస్తికునకు శూన్యమై తోఁచు**
**యీవల వాన గురిసి యేరెంతబంటి వారినా**
**కావరపు జీవునకు గతుగతుకే**

**చ. 2:** **హరి శరణంటేఁ గాచే అట్టియుపాయమే వుండఁగ**
**విరసానకుఁ గర్మమే వెగ్గళమాయ**
**పరగ నరులకెల్లాఁ బట్టపగలై యుండఁగా**
**అరయఁ గొన్ని జంతుల కంధకారమాయను**

**చ. 3:** **యిక్కడ శ్రీవేంకటేశుఁ డెదుటనే వుండఁగాను**
**అక్కటా మూఢున కెందు ననుమానమే**
**మక్కువ నింతా నమృతమయమైనఁ గోడికి**
**తెక్కులఁ దవ్వఁ బొయ్యేది తిప్పపెంటలే**

**భావదీపిక:**

అన్నమమయ్య చెప్పిన ఈ అధ్యాత్మకీర్తనలో భగవత్ప్రాప్తి అందరికీ సాధ్యంకాదు. వారి వారి భాగ్యాన్ని పట్టి వుంటుంది, అంతే అంటున్నారు. అయ్యో! వారి భాగ్యమెంతో అంటే వారి ప్రాప్తం. భాగ్యమునకు నోచుకోని వారు, వెన్నచేతిలో వున్నా నెయ్యి యెక్కడున్నదా అని వెదకుతూనే వుంటారు. దేవుడు (పరమాత్మ) ప్రస్ఫుటంగా దిక్కులన్నిటా నిండి వుండగా, నాస్తికులకు శూన్యముగానే తోస్తుంది. హరి యెదుటనే వున్నా ప్రహ్లాదుడు చూడగలిగాడు కాని హిరణ్యకశిపుడు చూడలేకపోయాడు. వానలు బాగా కురిసే యేరు యెంత వ్యర్థంగా పొర్లిపారినా, గర్వంతో నీటిని పట్టి దాచుకోని అహంకారులైన జీవులకు చివరికి మిగిలేది గతుగతుకే (నాకి నాకి నోరుతడుపు కోవటమే) మిగులుతుంది. హరిని శరణని సుఖంగా వుండటం, యెంత తేలికైన వుపాయము!! కాని హరిపట్ల విరసత్వం కలవారికి గర్వమే వెగ్గలమాయ (అధికమవుతుంది). అంతెందుకు, ఇక్కడ తిరుమలలో మన యెదుటనే నిలువెత్తు శ్రీవేంకటేశ్వరుడున్నాడు కదా! మూఢులకు ఈస్వామిని చూచినా అనుమానమే. (ఒకానొకప్పుడు ఈ రచయితా.. అట్టి మూఢుడే). మక్కువతో అమృతం త్రాగించబోయినా గర్విష్ఠి అయిన యువకుడికి అది పట్టక, "తిప్ప పెంటల" (పెంటదిబ్బల్లో) తిరుగుతుంటాడు. అయ్యో!

*** తెక్కుల కోడికి = గర్విష్ఠి అయిన యువకుడికి, * సోవల = దీర్ఘమైన లేక అత్యధికమైన**

17 సంఖ్య : 6 సంపుటము: 15 పుట: 6 రాగం: బౌళి

**పల్లవి:** **అయ్యో యేమరి నే నాఁ డప్పు డేమై వుంటినో**
**అయ్యెడ నీ దాసి నైతే ఆదరింతుగా**

**చ. 1:** **అల్లనాఁడు బాలుఁడవై ఆవులఁగాచేవేళ**
**చిల్లర దూడనైతే చేరి కాతువుగా**
**వల్లెగా విటుఁడవై రేపల్లెలో నుండే నాఁడు**
**గొల్లెత నయినా నన్ను కూడుకొందుగా**

**చ. 2:** **మేలిమి రామావతారవేళ రాయి రప్ప నైనా**
**కాలు మోపి బదికించి కాతువుగా**
**వాలి సుగ్రీవులవద్ద వానరమై వుండినాను**
**యేలి నన్నుఁ బనిగొని యీడేర్తువుగా**

**చ. 3:** **వారిధిలో మచ్చ కూర్మావతారములైన నాఁడు**
**నీరులో జంతువునైనా నీవు గాతువుగా**
**యీరీతి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టే**
**మోరతోపున నిన్నాళ్ళు మోసపోతిఁగా**

**భావదీపిక:**

పెదతిరుమలయ్య వినిపిస్తున్న అధ్యాత్మ కీర్తన ఇది. ఎన్ని జన్మలు పొందినా జీవికి అందులో ఒక్కటి కూడా గుర్తుండదు. ఆ మఱపే లేకపోతే తన నూతన దేహంలో జీవించలేడు. పెదతిరుమలయ్య తాను బాలకృష్ణుని కాలంలోనూ, శ్రీరామచంద్రుని కాలంలోనూ, కృతయుగంలోనూ యేయేజన్మలు పొందాడో తెలియదు గాని తెలిస్తే ఆనాటి అనుభవాలు యెంత బాగుండేవి, అనాడు అప్పుడు అక్కడ నీ దాసినైనా అయితే నన్ను నీవు ఆదరించి వుండేవాడివి కదా! అలనాడు ద్వాపరయుగంలో నీవు బాలకృష్ణుడువైనప్పుడి నేనూ ఒక లేగ దూడనైతే నీవు నన్ను కూడా కాచేవాడివికదా! పోనీ గొల్లెతనై పుట్టినా రేపల్లెలోనా విటుడవై నన్ను కూడియుండేవాడివి కదా! మేలిమి వంటి రామచంద్రుడిగా నీవున్నప్పుడు త్రేతాయుగంలో రాయినై పడివున్నా నీపాదము సోకి వుండేది కదా! పోనీ వాలి సుగ్రీవులిద్దరిలో ఒకరివద్ద కోతినైనా నీవు నన్ను ఆదరించి నా సేవను పొందేవాడివి కదా! కృతయుగంలో నీవు మత్స్యమైనా కూర్మమైనా అదే సముద్రంలో నేనూ ఒక జలజంతువునైతే నాతోటి పెద్ద జలజంతువులనుండి నన్ను రక్షించేవాడివి కదా! ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ నాడు నీ కృపవల్ల నీ దాసుడనైనాను. కాని ఆలోచన లేని వాడనై ఇన్నాళ్ళూ ఐహిక సుఖమే ఆనందమనుకొని మోసపోయాను. నన్ను కాపాడుము తండ్రీ!

*** మోరతోపున = అనాలోచితముగ, * వల్లెగా = లెస్సగా**

**18** సంఖ్య: 12 సంపుటము: 2 పుట: 9 రాగం: భైరవి

**పల్లవి:** **అయ్యో మాయలఁ బొంది అందునిందు నున్నవారు**
**యియ్యగొనఁ గర్తలుగా రెఱఁగరు జడులు** **॥పల్లవి॥**

**చ. 1:** **చుక్కలై యుండినవారు సురలై యుండినవారు**
**యిక్కడనుండి పోయిన యీజీవులే**
**దిక్కుల వారి నిందరు దేవతలంటా మొక్కేరు**
**యెక్కుడైన హరి నాత్మ నెఱఁగరు జడులు**

**చ. 2:** **పాతాళవాసులను పలులోకవాసులును**
**యీతరవాత నుండిన యీ జీవులే**
**కాతరాన వారిపుణ్యకతలే వినేరు గాని**
**యీతల శ్రీహరికత లెఱఁగరు జడులు**

**చ. 3:** **యిరవెఱిఁగిన ముక్తు లెఱఁగని బద్ధులు**
**యిరవై మనలోనున్న యీజీవులే**
**సిరుల మించినవాఁడు శ్రీవేంకటేశ్వరుఁడే**
**శరణాగతులు దక్క చక్కఁ గారు జడులు**

**భావదీపిక:**

అత్యద్భుతమైన ఈ వైరాగ్య కీర్తనలో అన్నమయ్య యేమని అంటున్నారో ఆలకించండి. అందు (పరలోకాలలో) ఇందు(ఈ భూలోకంలో) వున్నవారు యెంత జడులు (మూర్ఖులు)!! అయ్యో! వీరు శ్రీహరి మాయలను బొంది, తాము నిమిత్తమాత్రులని జీవులు పొందే దేనినైనా ఇయ్యటానికి గాని స్వీకరించటానికి గాని వారు కర్తలు కారని యెఱుగలేకున్నారే!! ధ్రువుని వలె నక్షత్రాలైన వారు, కుబేరుని వలె దేవతలైనవారు వొకప్పుడు ఈ భూమి మీదనున్న జీవులే కదా! ఈరోజున వారిని ఇందరు (అందరూ) దేవతలంటూ మొక్కుతున్నారు కదా! ఎక్కడివారికైనా ఇచ్చేది శ్రీహరియే అని ఆత్మలో నెఱుగరే ఈ మూర్ఖులు. పాతాళంలో వున్న బలిచక్రవర్తి వంటి వారూ, బ్రహ్మదేవుని సత్యలోకంలో వున్నవారూ ఒకప్పుడు మానవులే, వాళ్లూ భూలోకంలోనున్న జీవులే. వీరంతా భయభక్తులతో వారి పుణ్య కథలు వింటారే కాని, వారికా లోకాల నొసగిన శ్రీహరి కథలను వినలేక పోతున్నారే.. వీరెంత మూర్ఖులు. తాము యే వికారమూ లేని ముక్తులు అని గ్రహించిన ఘనులు, తాము సంసార బంధాలలో కట్టుబడిన వారు అని భావించే అల్పులు కూడా మనలో వుండే ఈ జీవులే. సిరులు మించిన వాడే శ్రీవేంకటేశ్వరుడే అని శరణాగతులు మాత్రమే గ్రహించగలరని తెలియని జడులు, వీరే.

*** కాతరాన = భయభక్తులతో * బద్ధులు = సంసార బంధాలలో కట్టుబడినవారు**

19 సంఖ్య : 86 సంపుటము: 1 పుట: 59 రాగం: సామంతం

**పల్లవి:** **ఇతరము లిన్నియు నేమిటికి**
**మతిచంచలమే మానుట పరము**

**చ. 1:** **ఎక్కడిసురపుర మెక్కడి వైభవ-**
**మెక్కడి విన్నియు నేమిటికి**
**యిక్కడనే పరహితమునుఁ బుణ్యము**
**గక్కునఁజేయఁగఁగల దిహపరము**

**చ. 2:** **యెవ్వరు చుట్టము లెవ్వరు బంధువు**
**లెవ్వ రిందరును నేమిటికి**
**రవ్వగులక్ష్మీరమణునిఁ దలఁపుచు**
**యివ్వలఁ దాఁ సుఖియించుట పరము.**

**చ. 3:** **యెందరు దైవము లెందరు వేల్పులు**
**యెంద రిందురును నేమిటికి**
**కందు వెఱిఁగి వేంకటగిరిరమణుని**
**చిందులేక కొలిచిన దిహపరము**

**భావదీపిక:**

అన్నమయ్య యేమంటున్నారో ఆలకించండి. స్వర్గప్రాప్తికి ప్రాకులాడటం, బంధుమిత్రులతో సుఖించడం, ముక్కోటి దేవతలకు మొక్కటం వంటి చిల్లర పనులు చేయుటెందులకు? అనవసరమైన ఇతర ప్రయత్నములెందుకు? ఇటువంటి మతిచంచలము మానుట పరము (శ్రేష్టము). ఎక్కడి స్వర్గము, యెక్కడి స్వర్గ సుఖాలు? ఇవన్నీ యెక్కడవున్నాయి? పోనీ వున్నాయనుకొన్నా అవి యేమిటికి (యెందుకు)? ఇక్కడనే (ఈ భూమిమీదే) "పరోపకారం" అనే పుణ్యంచేస్తే వెంటనే ఇహమున ఆత్మానందం, పరమున కైవల్యము సాధింపవచ్చును కదా! మనవాళ్లు అనుకొనే చుట్టాలు యెవ్వరు? బంధువులనే వారలెవ్వరు? వీళ్లంతా యేమిటికి (దేనికి?) సర్వశ్రేష్ఠుడైన లక్ష్మీరమణుని ధ్యానిస్తూ ఇక్కడనే ఆనందం అనుభవించటం శ్రేష్ఠము కదా! ఒకసారి ఆలోచించండి. మనకు యెంతమంది దేవుళ్ళు వున్నారు? యెంతమంది దేవతలున్నారు? ఇంతమంది అవసరమా? దేనికి చెప్పండి? మర్మము తెలిసి శ్రీవేంకటేశ్వరుని చిందరవందర కాకుండా కొలచినచో ఇహములో ఆనందం, పరములో కైవలం లభిస్తాయి!

*** పరహితము = పరోపకారము, * రవ్వగు = శ్రేష్ఠుడైన**

20 సంఖ్య : 110 సంపుటము: 2 పుట: 74 రాగం: సాళంగనాట

**పల్లవి:** **ఇదివో వీథివీథుల నీతని తేరు**
**యెదుట శ్రీవేంకటాద్రిని తేరు**

**చ. 1:** **చట్టువడఁ దోలె నాఁడు సముద్రాలపైఁ దేరు**
**ఘెఉట్టుగాఁ దోలెను పౌండ్రకునిపైఁ దేరు**
**జట్టిగొని తోలె జరాసంధునిపై నదె తేరు**
**కొట్టి తోలె హంసడిచుకులపై(???) తేరు**

**చ. 2:** **ఘోరమై కుంగఁగఁ దోలె కులగిరులపైఁ దేరు**
**కౌరవసేనపై దోలె గక్కనఁ దేరు**
**కోరి మధురమీఁద నక్రూరుఁ గూడ తోలెఁ దేరు**
**ఆరసి సంధిమాటలు ఆడఁ దోలెఁ దేరు**

**చ. 3:** **తచ్చి శిశుపాలాది దైత్యులపైఁ దోలెఁ దేరు**
**పెచ్చుగాఁ దోలె రుక్మిణి పెండ్లి తేరు**
**అచ్చపు శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి**
**చెచ్చెరఁ దోలె దిక్కుల సింగారపుఁ దేరు**

**భావదీపిక:**

శ్రీవేంకటేశ్వరుని రథోత్సవంలో అన్నమాచార్యులవారు పాడిన సంకీర్తన ఇది. విని తరించండి. ఇదిగో తిరుమల వీధివీధీ తిరిగి స్వామితేరు (రథము) మన యెట్టయెదుట సుందరముగా శోభలీనుచున్నది. శ్రీవేంకటాద్రిలో ఇదే కన్నుల పంట. ఒకనాడు సముద్రాలు అణిగిపోవునట్లు రథము తోలినాడీతడు. పౌండ్రక వాసుదేవుడు ఇతని కృష్ణావతారంలో దండెత్తి వస్తే అతనిపై ఘాటుగా రథం తోలి వాడి పీచమణిచాడు. జరాసంధునిపై తన సేనలను జట్టిగొని (సమీకరణము చేసికొని) రథమునెక్కి యుద్ధముచేసి వెడల కొట్టాడు. హంసడి పైన అతని సోదరుడు డిచకుడిపైన రథమును తొలి కొట్టినాడు (జయించినాడు) ఈ శ్రీహరి. కులపర్వతములు క్రుంగిపోవునట్లు రథమును తోలినాడితడు. భారతయుద్ధంలో పార్థసారథిగా రథము తోలినాడితడు. కంసుడు తనను సంహరిద్దామని మధురకు ఆహ్వానిస్తే అక్రూర, బలరాములతో తేరుపై యేగినాడితడు. హస్తినాపురమునకు పాండవరాయబారిగా ఇతగాడు పయనమైనది తేరుమీదనే. శిశుపాలుడు తన మిత్రులైన దైత్యులతో దండెత్తి వచ్చినప్పుడు ఈ కృష్ణయ్య రథముపై వారిని యెదిరించాడు. రుక్మిణీ దేవిని పెండ్లాడు నాడు ఇతను రథముపైననే ఆమెను సంగ్రహించినాడు. సింగారపు దేవుడైన ఈశ్రీవేంకటేశ్వరుడు నేడు అలమేల్మంగతో దిక్కులు అతిశయించగా రథముపై నేగుచున్నాడు.

* **చట్టువడు** = **అణగిపోవు,** * **తచ్చి** = మథించి

21 సంఖ్య : 348 సంపుటము: 15 పుట: 234 రాగం: సాళంగనాట

**పల్లవి:** **ఇన్నాళ్లు నా యహంకార మెఱుఁగని దాయె నన్ను**
**సన్నుతించేను నేరమి క్షమియించవే హరి**

**చ. 1:** **దాసుఁడ నంటేఁ గొంత దయ దలఁతువుగాక**
**నీ సరివాఁడ నంటే నీవు గాచేవా**
**వేసరక కొలిచితే వెస మన్నింతువు గాక**
**వాసి వంతు లెంచుకొంటే వశ మయ్యేవా**

**చ. 2:** **నుతియించితేఁ గొంత పూనుక రక్షింతువు గాక**
**ప్రతి ఘటించితేఁ జలపట్టవా నీవు**
**గతి నీవే యంటేఁ గొంత కైవస మౌదువు గాక**
**యితరుల వేఁడుకొంటే నియ్యకొందువా**

**చ. 3:** **మొక్కితేనుఁ గొంత నీవు మొగమోడుదువు గాక**
**నిక్కి గర్వాన నుండితే నీవు మెచ్చేవా**
**దిక్కై యలమేల్మంగపతివి శ్రీవేంకటేశ్వర**
**చిక్కి యిట్టె మఱుఁగ చొచ్చితేఁ గావ కుందువా**

**భావదీపిక:**

పెదతిరుమలయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో శ్రీహరిని క్షమించమని వేడుకొంటున్నారు. ఇన్నాళ్లా నా అహంకారము వలన నన్ను నేను తెలుసుకొనలేకపోయాను. నాదే తప్పు, నిన్ను సన్నుతించెదను. నన్ను క్షమించు ప్రభూ! నీ దాసుడనని నీకు నమస్కరిస్తే నన్ను క్షమిస్తావు. కొంత దయతలుస్తావు. అంతేగాని నీ సరివాడను అంటే నన్ను రక్షిస్తావా? శ్రమ అనుకోకుండా నిన్ను కొలిచితే వేగముగా మన్నిస్తావు గాని నీ వన్నెచిన్నెలెంచి నీవెంత గొప్పవాడివి, ఎంత ఖ్యాతి వున్నవాడివి అని లెక్కిస్తుంటే నాకు వశమౌతావా? తండ్రీ! నీవే నా రక్షకుడవని నిన్ను నుతిస్తే నన్ను రక్షించపూనుకుంటావు గాని నిన్ను ప్రతిఘటిస్తే నీవు మొండికెత్తకుంటావా? స్వామీ! నీవే గతి అంటే కొంత కైవసమవుతావు గాని, నేను ఇతరులను ప్రార్థిస్తే నీవెందుకు అంగీకరిస్తావు? నీకే శరణని మొక్కితే కొంత మొగమోటము వలన నన్ను కాదనవేమో? అంతేగాని అతిశయించి నా గర్వం చూపిస్తే నీవు మెచ్చెదవా? అలమేల్మంగ పతివైన ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు చిక్కి నీ ఆశ్రయంలో బ్రతికితే నన్ను నీవు మన్నించకుందువా?

*** వాసివంతు = వన్నె చిన్నెలు, * చలపట్టు = మొండితనం**

22 సంఖ్య : 353 సంపుటము:3 పుట: 238 రాగం: బౌళి

**పల్లవి:** **ఇంకానేలా తర్కవాదములు యిన్నియు నిందునే ముగిసెను**
**యింకానేలా కొందరు మోక్షం బెవ్వరికిని లేదనుమాటా**

**చ. 1:** **సరయువు పొంతను సకల జీవులకు**
**సిరుల మోక్షమిచ్చితివని విన్నపుడే**
**మరలుచు నాయనుమానము వాసెను**
**ధర నీవొకఁడవే దైవమవని కంటినయ్యా**

**చ. 2:** **తగిన లంకవొద్దను రాక్షసులను**
**తెగనడిచి ముక్తితెరువు చూపినపుడే**
**వగలఁ బెక్కుదేవతల వరంబులు**
**జగతి నీపగకు సరిగావయ్యా**

**చ. 3:** **యేమని చెప్పుదునిట్టి నీ మహిమ**
**వేమరుఁ బురాణవిధి విన్నపుడు**
**శ్రీమంతుఁడవు శ్రీవేంకటేశ్వర**
**కామింప నీకంటే ఘనము లేదుగదవోఅయ్యా**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ అధ్యాత్మ కీర్తనలో మోక్షం గురించి తన అభిప్రాయాన్ని నిర్ద్వంద్వంగా వివరిస్తున్నారు. నేటి తెలుగులో ఇదే పల్లవిని ఇలాచెప్పవచ్చును. ఇంకా యెందుకీ తర్కములు, వాదములు అన్నీ దీనితోనే ముగుస్తాయి. మోక్షమెవరికీ దక్కదని కొందరు యింకా ఎందుకు వాదిస్తారు? ఇవి మీరు వినలేదా? ఆనాడు నీవు రామావతారాన్ని చాలిస్తున్నప్పుడు ఆయోధ్యాపురజనులందరికి, అక్కడి సకల జీవులకు మోక్ష లక్ష్మిని ప్రసాదించావని విన్నప్పుడు నా అనుమానం తొలగిపోయింది. ఈ ధరలో మోక్షప్రదాత అని పిలువదగిన దైవము నీవేనని నేను గ్రహించాను. అంతకు మునుపు లంకానగరాన్ని నీవు ముట్టడించగా జరిగిన యుద్ధంలో నీచేత హతులైన రాక్షసులందరికీ ముక్తి లభించినప్పుడు, అన్య దేవతల వరములకంటే నీమీద పగతో పొందిన చావే మేలని తెలిసి, వారి వరములు నీపై పగకు సరికావని నేను గ్రహించాను. ఓ దేవదేవా! నీ మహిమల గురించి, ఇంకా నన్నేమి చెప్పమంటావు తండ్రీ! వేల పర్యాయములు అనేక పురాణగాధలలో నీఘనతను పొగడగా విని తరించాను. నీవు శ్రీమంతుడవు, శ్రీపతివి, శ్రీవేంకటేశ్వరుడవు. ఓ అయ్యా! నాతండ్రీ! పదునాల్గు లోకాలలోనూ నీకంటే కామింప(కోరదగినది), ఘనమైనది లేదు లేదు లేదు… ఉండబోదు. (నాకూ ఆ భాగ్యమునివ్వరాదా ప్రభూ!)

*** తెగనదచి = తెగన్ + అడచి; బాగా సంహరించి**

23 సంఖ్య : 116 సంపుటము: 2 పుట: 78 రాగం: దేపాక్షి

**పల్లవి:** **ఇంతదేవుఁ డింక వేఁడీ యెంచి చూపుఁడా**
**చెంతనుండితే రక్షించు చేకొని కొలువరో**

**చ. 1:** **వేసితే వేయురూపులు విశ్వరూప మితఁడు**
**శ్రీసతీశుఁ డిందరిలో శ్రీమంతుఁడు**
**భాసురపు భూమి మోచే బలవంతుఁ డిన్నిటాను**
**దాసులైతే మన్నించు నీదైవముఁ గొలువరో**

**చ. 2:** **గుట్టున బ్రహ్మాండాలు కుక్షిలో నించినవాఁడు**
**అట్టె దేవతల మొర లాలించేవాఁడు**
**చిట్టకపు దానవుల చించి చెండాడేటివాఁడు**
**ఇట్టే శరణంటేఁ గాచు నీతనిఁ గొలువరో**

**చ. 3:** **కాలముఁ గర్మము మాయ గల్పించినయట్టివాఁడు**
**ఆలించి సర్వజీవుల అంతర్యామి**
**వాలి శ్రీవేంకటపతై వరములిచ్చేటివాఁడు**
**యేలీలఁ గొల్చిన మెచ్చు నీవిభుఁగొలువరో**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ భక్తిరసాత్మకమైన కీర్తనలో యేమంటున్నారో వినండి. ఎంచి చూడగా ఇంతటి దేవుడు ఇంక "వేఁడి" (యేడీ). ఈయన యెక్కడో వైకుంఠంలో వుండిపోడు. మీ చెంతనే వుండి రక్షిస్తాడు. సందేహించకండి. ఈ దేవుని చేకొని కొలువరో, అంటున్నారు. ఇతడు వేడితే వేయి రూపములున్న విశ్వరూపుడు. శ్రీతరుణీవల్లభుడైనందువలన ఇతనికంటే శ్రీమంతుడు మరొకడుండడు. తన వరాహావతారంలో భూమిని ఎత్తి కాపాడిన గొప్ప బలవంతుడితడు. తనదాసులైన వారిని తప్పక మన్నించే దేవుడు ఇతడే. తన కుక్షిలో (పొట్టలో) చతుర్దశ భువనాలను దాచికొనిన చతురుడితడే. దేవతలు వేదనజెంది మొరబెట్ట ఆలకించే దిక్కు ఇతడే. చిట్టకపు దానవులను చీల్చి చెండాడేటివాడు ఇతడే. శరణు అంటే చాలు ఇట్టే కాచేవాడు ఇతడే. ఇతని సృష్టిలోనివే కాలము, కర్మము, మరియు మాయ. సర్వజీవులకు లోలోనే వుండి ఆలించు అంతర్యామి ఇతడే. కలియుగమున వేంకటపతిగా వాలి (అతిశయించి) వరములిచ్చేటివాడు ఇతడే. ఏ విధముగా కొలిచినా మెచ్చి కాపాడేవాడు ఈవిభుడే. కావున ఇతనినే కొలువండయ్యా!

*** గుట్టున = మర్మముతో * చిట్టకపు = కపటులైన**

24 సంఖ్య:444 సంపుటము:15 పుట:299 రాగం:బౌళి రామక్రియ

**పల్లవి: ఇంత మాత్రము మా నేమ మిందు నీ కేమి గూడీని**
**చెంత ధర్మమునకు రక్షించేవు నీవు నన్ను**

**చ. 1: పిడికెఁడు బియ్యమే పెద్దరికంబగు చెలిమి**
**తొడిఁబడ సంధ్య మూఁడుదోసిళ్లు నీళ్లు**
**నుడిగే జపము వేళ్ల నూఁటయెనిమి దెంచేది**
**తడుపుకొనేది తీర్థస్నానము లన్నియును**

**చ. 2: వూరక యాకలి గొని వుండేది మా వ్రతములు**
**నీరసపు టాహారాలు నిష్టలెల్లాను**
**వూరఁ దోఁటల పువ్వు లొగి దేవపూజలు**
**గోరమైన బతుకులు కోరేటి తపములు**

**చ. 3: బలసాకు తిలలు దర్భలు పితృపూజలు**
**పలుకకుండేది మా బలు మోసము**
**యిలపై శ్రీవేంకటేశ యిందు నిన్న మెప్పించే మా**
**కలిగినది మాకు నిఁక మణి కాకా**

**భావదీపిక:**

ఈ అధ్యాత్మకీర్తనలో పెదతిరుమలయ్య స్వామితో యేమంటున్నారో వినండి. స్వామీ! మేము ఆచారాలనీ, నియమములనీ యేవేవో పాటిస్తుంటాము. ఎంతో పటాటోపంతో కనుపించే వాటిలో నీపై భక్తి శూన్యం. ఇంతమాత్రాన ఇందులో నీకేమీ గూడదు. అయినా నీవు నన్ను రక్షిస్తూనే వున్నావు. ఇది నీ ధర్మ భావన కాక మరేమి? మా ఇంటిముందు యాచిస్తూ యెవ్వరైనా వస్తే పిడికెడు బియ్యం వేసి కృష్ణార్పణమంటున్నాం. అది నీ చెలిమి కొరకే. సంధ్యవార్చే నెపంతో నీకు మేమిచ్చేది మూడు దోసిళ్ళ నీళ్లు. నీమూట యెనిమిది పేర్లను గబగబ పలికి అదే నీజపము అంటున్నాము. ఒళ్లు తడుపుకొని అదే పుణ్యతీర్థస్నానం అంటున్నాము. ప్రభూ! ఒక్కపూట ఆకలికి వోర్చుకొని అదే వ్రతము అంటున్నారు. ఆహారం మానేసి నీరసంతో ఉస్సురనివుండి, అదే గొప్ప నిష్ఠ అని భావిస్తున్నాము. ఊళ్లో వున్న పూదోటల్లో పూలు కోసికొని వచ్చి నీపై వేస్తే అదే నీపూజ అనుకొంటున్నాము. ఘోరమైన బ్రతుకును గడిపి నిన్ను కోరరాని కోర్కెలను కోరటం తపస్సా? దేవా! బలుసాకు, నువ్వులు, దర్భలు వుపయోగిస్తే పితృదేవతలు తరిస్తారనుకొంటున్నాం. ఎవ్వరితో మాట్లాడకుండా చేసే పనులు చేసేస్తే అది మౌనవ్రతమా!! ఓ శ్రీవేంకటేశ్వరా! పైవాటిలో యేది నిన్ను మెప్పిస్తుందంటావు? పోనీ యే వొక్కటి నిన్ను మెప్పించినా, అదే మాకు ఇక మణిపూస కాక మరేమిటి?

*** తొడిబడు = చెదరిపోవు, * నుడుగు = చెప్పునట్టివి**

25 సంఖ్య : 237 సంపుటము: 27 పుట: 181 రాగం: ఆహిరి

**పల్లవి:** **ఇంతితో మాటాడవయ్య ఇఁక నేఁటికి**
**చెంతలఁ జెలి వుండితే సిగ్గు వొయ్యీనా**

**చ. 1:** **తేనెలు గారేటి మోని తిట్లాపెఁ(పె?) దిట్టితేను**
**దాననే మగతనము తక్కువయ్యీనా**
**నానఁబెట్టి సెలవుల నవ్వులు నవ్వితేనేమి**
**కోనలనీ బిరుదుకు కొంచెమయ్యీనా**

**చ. 2:** **చేగలు దేరేటి గోర చెక్కు లాపె నొక్కితేను**
**సాగిన దొరతనము చవుకయ్యీనా**
**బాగుగ నీ పాదమునఁ దొక్కితేను**
**వేగిరపుఁ బంతానకు వెలితయ్యీనా**

**చ. 3:** **పాలుగారే చన్నులను పైకొని యాపె యొత్తితే**
**మేలిమి నీమనసెల్ల మెత్తనయ్యీనా**
**యీలీల శ్రీ వేంకటేశ యింతి నిన్నుఁ గూడెనిదె**
**ఆలరి నీ వలపు అంగడికెక్కీనా**

**భావదీపిక:**

అన్నమయ్య ఈ సరస శృంగారకీర్తనలో తాను దేవి చెలికత్తెవలె, శ్రీనివాసునికి చక్కటి సలహా ఇస్తున్నారు. ఈ ఇంతితో మాటలాడవయ్యా! నీ చెంతనే చెలి వున్నది కదా! ఇంకా నీకు సిగ్గు పోనేలేదా? ఇరువురూ ఆలూమగలైనాక, ఇకన్ యేటికి సిగ్గు అంటున్నారు. మధురమైన పెదవులున్న మానిని తిట్టి నా శృంగారమే కదా! దాననే (అంతమాత్రాన) నీమగతనానికి యేమి కొరవౌతుంది ప్రభూ! తడి ఆరని పెదవులతో చిరునవ్వు లొలికించే ఆమెతో నీవూ నవ్వితే కోనకోనా మారుమ్రోగె నీ బిరుదుకేమన్నా లోపమవుతుందా స్వామీ! కొనదేలిన గోటితో ఆమె నీ చెక్కులు నొక్కినది పో, కొనసాగుతున్న నీ దొరతనము చవుకైపోతుందా దేవా! కళ్యాణపు వేడుకగా ఆమె నీ పాదమును త్రొక్కినంత మాత్రాన, దుడుకువాడవైన నీ పంతమునకు యేమన్నా వెలితౌతుందా ప్రభూ! పాలుగారే కుచద్వయముతో పెనగి యామె నిన్నొత్తితే బంగారము వంటి నీ మనస్సు మెత్తబడకుండా వుంటుందా? ఓ శ్రీవేంకటేశ్వరా! యీ రీతిగా ఆ ఇంతి నిన్ను గూడినది. అల్లరిబెట్టిన నీ వలపులు ఆమెను బజారున బెట్టవు కదా!

**∗ వేగిరపు = దుడుకు, ∗ చేగలు దేరు = కొనదేలిన**

26 సంఖ్య : 251 సంపుటము: 18 పుట: 168 రాగం: కురంజి

**పల్లవి:** **ఇద్దరికిఁ జుట్టరిక మీరీతిఁ గలిగె మీకు**
**చద్దికి వేఁడికి సరసమూలాడరె**

**చ .1:** **కలువ రేకులవంటికన్ను లాతఁడు నీపతి**
**తొలుతనే నీవెఱుముఁజందురుఁ జూపవే**
**బెళుకులేనియట్టిబింబాధరుఁ డాతఁడు**
**చిలుక పలుకుల రంజిలఁజేయవే**

**చ .2:** **మించుల నీలమేఘము మేనిచాయవాఁడతఁడు**
**కొంచక నీచూపు మెరుఁగులు చల్లవే**
**పొంచి తామరపువ్వలఁబోలిన పాదాలాతఁడు**
**వంచి తుమ్మిదల కొప్పు వడి సోఁక మొక్కవే**

**చ .3:** **గందపుమాని కొమ్మల చేతులతఁడు**
**అందుకొని లతాంగివి అలముకోవే**
**అందపు శ్రీ వేంకటేశుఁ డలమేల్ మంగవు నీవు**
**చెందితి రిన్నిటా నిఁక సేసచల్లుకొనరే**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన మధురకీర్తన నాస్వాదించండి. స్వామికి, దేవికి యీరీతి చుట్టరికము కుదిరినది. మీ ఇద్దరికి భార్య భర్తల సంబంధం ఏర్పడుటచేత చద్దికి, వేడికి (రేయింబవళ్లు) సరససల్లాపములాడుతూ సుఖించండి అంటున్నారు. వీరి మధ్య పోలికలు కూడా యెలా కుదిరినవో చూడండి. దేవీ! నీపతి కన్నులు కలువపువ్వులను బోలినవి. మరి నీ ముఖము మొదటి నుంచీ చంద్రబింబమే. ఆతనికి నీ మోమును చూపవే. మనసులోని భావమేమిటో పైకి తెలుపని గుండ్రని పెదవులు గలవాడతడు. ఇక నీ చిలకపలుకులతో అతనినానందపరచవమ్మా. దేవీ! అతగాడు నీలమేఘఛాయగల శరీరమున్నవాడు. ఇక తిన్నని నీ చూపు తటిల్లతవలె మెరుపులు చల్లుతుంది. అందగాడైన అతని పాదములు తామరపువ్వలను బోలి యున్నవి. గుమిగూడిన నల్లని తుమ్మెదలను పోలిన నీ కొప్పు ఆ పాదములు తాకునట్లు మొక్కితే తుమ్మెదలు పద్మము నాక్రమించినట్లే యున్నది. దేవీ! అతగాని చేతులు, గంధపు చెట్టు కొమ్మలవలె నున్నవి. లతాంగివి (లతవంటి శరీరం కలిగిన) అయినా నీవు ఆ కొమ్మలను (శ్రీహరి చేతులను) అందుకొని పెనవేసుకొనుమమ్మా! నీవు అందమైన శ్రీ వేంకటేశుని అలమేల్మంగవు. ఇన్ని విధములుగా మీరు ఒకరికొకరు తగినవారు. ఇక ఒకరిపైనొకరు తలంబ్రాలు చల్లుకొనండమ్మా!

* **బెళుకులేని = భావం పైకి తెలుపని,** * **అలముకొను** = పెనవేసుకొను

27 సంఖ్య : 131 సంపుటము: 2 పుట: 88 రాగం: లలిత

**పల్లవి:** **ఇహమేకాని యిఁకఁ బరమేకాని**
**బహుళమై హరి నీపై భక్తే చాలు**

**చ. 1:** **యెందు జనించిన నేమి యెచ్చోట నున్న నేమి**
**కందువ నీదాస్యము గలిగితేఁ జాలు**
**అంది స్వర్గమేకాని అల నరకమేకాని**
**అందపు నీనామము నా కబ్బుటేచాలు**

**చ. 2:** **దొరయైనఁ జాలు గడుఁ దుచ్ఛపు బంటైనఁ జాలు**
**కరఁగి నిన్నుఁ దలఁచఁగలితేఁ జాలు**
**పరులు మెచ్చిన మేలు పమ్మి దూషించిన మేలు**
**హరి నీసేవాపరుఁడౌటే చాలు**

**చ. 3:** **యిలఁ జదువులు రానీ యిటు రాక మాననీ**
**తలఁపు నీపాదముల తగులే చాలు**
**యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె**
**చలపట్టి నాకు నీశరణమే చాలు**

**భావదీపిక:**

చక్కటి భక్తిరసప్రధానమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. మనము జీవించివున్నప్పుడు బ్రతుకు సుఖంగా వుండాలి. (ఇహము). శరీరం వదలిపెట్టాక (పరములో) ప్రశాంతిని పొందాలి. దాన్నే ఇహము, పరము అంటారు. ఓ శ్రీహరీ! నీ పైన బహుళమైన (నవవిధ) భక్తి కలిగితే, నాకదే చాలును. నేను యెక్కడవుండి జీవిస్తే యేమి? నాకు నీ దాస్యము ప్రాప్తిస్తే అదేచాలును. మరణించాక ఒక వేళ స్వర్గం వచ్చినా అట్లాకాక నరకములభించినా నాకు విచారమూ లేదు. నేనెక్కడ వున్నా నారాయణా అని నీ నామస్మరణ చేయగలిగితే చాలును. దేవదేవా! నేను యెటువంటి పదవిలో వున్నా, నాకేమి? దొరనైనా వొకటే, ఆ దొర దగ్గర తుచ్ఛమైన బంటునైనా నాకు ఒకటే. పరవశించి నిన్ను ధ్యానించగలిగితే నాకదే చాలును. స్వామీ! నా జీవన విధానాన్ని పరులు అతిశయించి మెచ్చుకొన్నా గర్వించను, నిర్లక్ష్య పెట్టి దూషించినా బాధపడను. నాకు నీ సేవా భాగ్యము దొరికితే చాలును. ఈ భూమి మీద చదువుకొనిన పండితుడినైనా నాకు ఒక్కటే, చదువురానివానిని అనిపించుకొన్నా విచారం లేదు. నా ధ్యాస నీ పాదములపై వుంటే అదే నాకు చాలును. ఓ శ్రీవేంకటేశ్వరా! అతిశయించి నీవు నన్నిట్టేయేలితివి. పంతము పూనిన నాకు నీ శరణమే చాలును.

*** చలపట్టి = పంతముతో;* పమ్మి = అతిశయించి**

28 సంఖ్య : 7 సంపుటము: 15 పుట: 5 రాగం: సాళంగనాట

**పల్లవి:** **ఎక్కడి పురాకృతము యేమి సేసీని**
**యెక్కడా బలువు నీ బంట్లెట్టుండినాఁ జెల్లును**

**చ. 1:** **నీ వల్లఁ బుట్టెను బ్రహ్మ నీవు సేసినదే మాయ**
**భావించి నీ కుక్షిలోనే బ్రహ్మాండాలూ**
**కావింప నీ వేలికవు కమ్మని నట్టౌఁ బనులు**
**దైవమా యిది యెఱిఁగి నీ దాసుఁడనేనైతిని**

**చ. 2:** **భూమి నీ దేవులు నీవు పుట్టించిన దమృతము**
**శ్రీమంతుఁడ విన్నిటా నీ సేసినట్టవును**
**యేమిటివాఁడు యముఁడు యెక్కడి మృత్యువు మరి**
**సామజవరద మీ శరణు చొచ్చితిని**

**చ. 3:** **ఏడఁ జూచినా నీ దాసు లెక్కడాఁ జెడుట లేదు**
**యీడు లేదు శ్రీ వేంకటేశ నీకును**
**యేడ విధి యేడ స్వర్గ మెక్కడిది నరకము**
**జాడతో నీముద్ర నా భుజముల ధరించితి**

**భావదీపిక:**

అద్భుతమైన అధ్యాత్మకీర్తనలో పెదతిరుమలాచార్యులవారు భక్తితత్పరతతో యేమంటున్నారో వినండి. పురాకృతకర్మ (పూర్వజన్మలలో జీవుడు చేసిన కర్మఫలము) ఎక్కడిది (ఇంకాయెక్కడుంటుంది?) అదియేమిసేసీని? ఓ దేవదేవా! బలవంతులైన నీబంట్లను అదియెక్కడా, యేమీచేయలేదు. వారేమి చేసినా చెల్లును. అంతెందుకు స్వామీ! సమస్త జీవకోటిని పుట్టించిన బ్రహ్మను నీవు పుట్టించావు. మాయావశ్యులై జీవులు అల్లాడుతున్నారే, ఆ మాయ నీవు సేసినదే కదా! చతుర్దశ భువనాలూ, నీ కుక్షి (కడుపు) లోనే కదా! ఉన్నవి. వాటికిక యేలికెవరు? నీవే కదా! ఈ సృష్టిలో పనులన్నీ నీవు కమ్మనినట్లు అవుతాయి. ఓ దైవమా! దీనినెరిగి నేను నీ దాసుడనైతినయ్యా! మాకు జీవనాధారమై మేము నివసించే ఈ భూదేవి నీ భార్య. దేవతలందరినీ అమరులను చేసిన అమృతమునకు కారణభూతుడవు నీవే. నీవు శ్రీపతివి, శ్రీమంతుడవు. అన్నిటా నీవు చేసినట్లే జరుగుతుంది. నీవు తలుచుకుంటే ఆ యముడేమి చేస్తాడు? నీవివ్వనిదే మృత్యువు మా దగ్గరికి రాగలదా? ఆనాడు గజేంద్ర రక్షణలో నీవదే నిరూపించావు. అందుకే నేను నీ శరణు చొచ్చితిని దేవా! యెక్కడ జూచినా నీ దాసులే సర్వాధికులు. వారు యెన్నటికీ చెడరు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు ఈడులేని అనాదివి. నీదాక ఎందుకు తండ్రీ! భుజములపై నీ శంఖ చక్ర ముద్రలు ధరించిన నీ దాసులకు స్వర్గంతో పనిలేదు. విధి వారి జోలికి రాదు.

*** సామజవరదా = గజేంద్రరక్షకా * బలువు = బలము**

29 సంఖ్య : 366 సంపుటము: 3 పుట:247 రాగం: శ్రీరాగం

**పల్లవి: ఎక్కడి విరతి మాకు నిహమెల్లాఁ దగులు**
**మక్కళించి మక్కళించి మాయకింతాఁ దగులు**

**చ. 1: పుట్టినప్పుడే పాపపుణ్యములు దగులు**
**అట్టె దేహమున కన్నమూఁ దగులు**
**గట్టిగా నీరెండూనై తే కర్మమూఁ దగులు**
**యెట్టునుఁ బోరాదు మాయకింతాఁ దగులు**

**చ. 2: మనికి సంసారియైతే మమతలుఁ దగులు**
**పెనగఁగఁ బెనగఁగా బిడ్డలూఁ దగులు**
**అనువై యీలంపటాన కాసలెల్లాఁ దగులు**
**మన సొక్కటొక్కటై మాయకింతాఁ దగులు**

**చ. 3: అరయ శ్రీవేంకటాశుఁ డాత్మలోనే తగులు**
**శరణన్నవారికి విజ్ఞానము దగులు**
**గరిమ నిందువల్లనే ఘన మోక్షమూఁ దగులు**
**మరిగినప్పుడే సుమ్మీ మాయకింతాఁ దగులు**

**భావదీపిక:**

"తగులు" అంటే సంబంధము పెట్టుకోవటం అని అర్థం. అన్నమయ్య చెప్పిన ఈ వైరాగ్య కీర్తనలో స్వామీ! మాకు ఇంకా యెక్కడి విరతి(విరక్తి) కలుగుతుందయ్యా? ఇహలోకములో అంతా "తగులే" కదా! నీమాయ వలన ఈ తగులు మాకును మక్కళించి మక్కళించి (ఉబ్బించి ఉబ్బించి) మరీ అందులో కూరుకుపోయేట్లు చేస్తున్నది. స్వామీ! మేము పుట్టుకతోనే పాప పుణ్యాల తగులుతో ఈ భూమ్మీదకు వచ్చాము. అదే విధంగా ఈ దేహానికి అన్నంతో విపరీతమైన తగులు. ఈ రెండిటికీ మేము చేసిన కర్మతో తగులు. ఇక ఆ కర్మవలన మేము యెక్కడికీ పోలేము. మళ్లీ దీనికంతటికీ తగులు (కారణము) నీమాయయే. ఏదో జీవనోపాధికోసం సంసారంలో పడితే ఇక మమతలు తగులుకుంటాయి. ఇంకేముంది? స్త్రీ పురుషులు పెనగీ పెనగీ బిడ్డల్ని కంటారు. ఇక వాళ్లతో తగులు. అనువుగా నున్న ఈ లంపటాల వలన ఆశలు తగులుకొంటాయి. ఒక్కటొక్కటిగా అవి మనసును పీడిస్తాయి. ప్రభూ! దీనికంతా కారణం నీ మాయ కల్పించే ఈ తగులే. ఒకసారి చూస్తే శ్రీవేంకటేశ్వరుడు ఆత్మలో తగులుకొన్నవారికి, ఆయనకు శరణన్న వారికి చక్కటి జ్ఞానము తగులుకొంటుంది. మరి దీనివల్లనే మోక్షము తగులుకొంటుంది (సిద్ధిస్తుంది). ఆ మోక్షాన్ని మరిగినప్పుడే సుమా! మాయ కల్పించే తగులు పోతుంది.

*** మనికి = జీవనోపాధికి, * మరిగినప్పుడే = ఆశపడినప్పుడే**

30 సంఖ్య : 98 సంపుటము: 2 పుట: 66 రాగం: సామంతం

**పల్లవి: ఎంత చదివి చూచిన నీతఁడే ఘనము గాక**
**యింతయు నేలేటి దైవ మిఁక వేరే కలరా**

**చ. 1: మొదల జగములకు మూలమైనవాఁడు**
**తుదఁ బ్రళయమునాఁడు తోఁచేవాఁడు**
**కదిసి నడుమ నిండి కలిగివుండెడివాఁడు**
**మదనగురుఁడే కాక మతి వేరే కలరా**

**చ. 2: పరమాణువైనవాఁడు బ్రహ్మాండమైనవాఁడు**
**సురలకు నరులకుఁ జోటయినవాఁడు**
**పరమైనవాఁడు ప్రపంచమైనవాఁడు**
**హరి యొక్కఁడే కాక అవ్వలనుఁ గలరా**

**చ. 3: పుట్టుగులయినవాఁడు భోగమోక్షాలైనవాఁడు**
**యెట్టనెదుర లోనను యిన్నిటివాఁడు**
**గట్టిగా శ్రీవేంకటాద్రి కమలాదేవితోడి-**
**పట్టపుదేవుఁడే కాక పరు లిఁకఁ గలరా**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన చక్కని అధ్యాత్మకీర్తన నాస్వాదించండి. పల్లవిలో యేమంటున్నారంటే, "ఎంత వేదవేదాంగములను చదివినా.. ఎంత ప్రపంచం చూచినా.. ఇంతటి ఘనుడు, సమస్త సృష్టిని పరిపాలించే దైవము ఇంకా యెవరైనా వేరే వున్నారా?" అని ప్రశ్నిస్తున్నారు. అనాదియైన జగములకు మూలకారణమైనవాడు, అంత్యమున (ప్రళయకాలంలో) కూడా నిశ్చలంగా వుండేవాడు, జగముల మధ్యలో నిండియున్నవాడు, మన్మథుని తండ్రియైన విష్ణువు కాక మరొకరున్నారా? పరమాణువు అంత అణురూపుడు, బ్రహ్మాండమంత విశ్వరూపుడు, దేవతలకు మానవులకు ఆటపట్టయినవాడు పరము అయిన వాడు ఒక్క శ్రీహరిగాక అటుపైన యెవ్వరైనా కలరా? పుట్టుగలయినవాడు (అవతారముల నెత్తువాడు) లేదా జన్మను ప్రసాదించువాడు, భోగములను, ముక్తిని ప్రసాదించువాడు, మన యెదురుగాను.. మనలోపల అంతర్యామిగాన అన్నిటా వున్నవాడు ఇతడేకాక మరెవరు? సుస్థిరంగా శ్రీవేంకటాద్రిపై లక్ష్మీదేవితో వుండేవాడు, ఈ పట్టపు దేవుడు గాక మరెవరున్నారు?

*** మదన గురుడు = శ్రీహరి * కమలాదేవి = లక్ష్మీదేవి**

31 సంఖ్య : 369 సంపుటము: 3 పుట:249 రాగం: ముఖారి

**పల్లవి:** **ఎంత విచారించుకొన్నా నిదియే తత్త్వము హరి**
**వంతుకు నీకృపగలవాఁడే యెరుఁగు హరి**

**చ. 1:** **నిన్ను నమ్మినట్టివాఁడు నిఖిలవంద్యుఁడు హరి**
**నిన్ను నొల్లనట్టివాఁడు నీరసాధముఁడు హరి**
**మున్ను దేవతలు నీకు మ్రొక్కి బ్రదికిరి హరి**
**వున్నతి నసురలు నిన్నొల్లక చెడిరి హరి**

**చ. 2:** **యేపున నీ పేరిటివాఁ డిన్నిటా ధన్యుఁడు హరి**
**నీ పేరొల్లనివాఁడు నిర్భాగ్యుఁడు హరి**
**కేపుల నిన్ను నుతించి గెలిచె నారదుఁడు హరి**
**పైపై నిన్నుఁదిట్టి శిశుపాలుఁడు వీఁగెను హరి**

**చ. 3:** **యిట్టే నీవిచ్చిన వరమెన్నఁడుఁ జెడదు హరి**
**గట్టిగ నీవియ్యనివి కపటములే హరి**
**అట్టె శ్రీవేంకటేశుఁడ వంతరంగుఁడవు హరి**
**వుట్టివడి కానకున్న వొచ్చెము దేహికి హరి**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ అధ్యాత్మ కీర్తనలో శ్రీహరి తత్త్వాన్ని వివరిస్తున్నారు. ఓ శ్రీహరీ! యెంత విచారించుకొనినా, ఇదియే ''హరితత్త్వము'' అని తెలుసుకొనగలవాడెవడు? నీ కృపగలిగిన వాడెవడో వాడు తెలియగలడు గాని, దేవా! “ఇతరులకు నిన్నెరుగ తరమా?” అంటున్నారు. ఓ శ్రీహరీ! నిన్ను నమ్మినట్టి వాడు జగత్తంతటికీ పూజనీయుడు. నిన్ను అంగీకరించని వాడు అధమాధముడు. తొల్లి దేవతలు నీకు మ్రొక్కుటచేతనే ఉన్నతితో బ్రతికినారు. ఓ హరీ! అసురులు నిన్నంగీకరించక చెడిపోయారు. అతిశయముగా సదా నీ నామస్మరణ చేయువారు ధన్యులు. శ్రీహరీ! నీ పేరంటేనే విముఖులైన వారు మిక్కిలి మోసకారియైన నిర్భాగ్యుడు. అదే నారదునినైతే అతగాడు సదా నిన్ను నుతించుట చేతనే గెలిచినాడు (ధన్యుడైనాడు). కానీ చెలరేగి నిన్ను తిట్టిన శిశుపాలుడు వీగిపోయినాడు (పారిపోయినాడు). నీచక్రముచేత చంపబడినాడు. అదే విధముగా నీవు వొసగే పరము (మోక్షము) ఎన్నడూ చెడదు. నీవు వొసగనిదేదైనా కపటమైనదేనయ్యా హరీ! మా అంతరంగంలో నున్న శ్రీవేంకటేశ్వరుడే హరి. ఉట్టిపడినట్లున్న ఆ శ్రీహరిని గాంచలేని దేహికి వొచ్చెము (అవమానము) తప్పదు.

* **పేరిటివారు = నామస్మరణ చేయువారు,** * **కేపులు** = మోసకారియైన

32 సంఖ్య : 446 సంపుటము: 17 పుట: 257 రాగం: ముఖారి

**పల్లవి:** **ఎంత పొద్దు లేదు నీకు నేమి సేయరాదు నన్ను**
**మంతనమైనదాఁకా మన్నించరాదా**

**చ. 1:** **నగి నగి యలపయ్యీ నవ్వుల నీ మాటలకు**
**మగటిమిఁ గొంతవడి మానరా యింక**
**చిగురించఁ జెనకఁగ సిగ్గయ్యీఁ గడుంగడు**
**వెగటు మానినదాఁకా విడువరాదా**

**చ. 2:** **చూచి చూచి సొదగిలి సొంపుల నీ చేఁతలెల్ల**
**తాచి తెరమాఁటుకైనా దలఁగరాదా**
**వాచవిమాటలాడఁగ వాడె నిదె నా మోవి**
**చేచేత దగ్గరుదాఁకా సెలవియ్యరాదా**

**చ. 3:** **కూడి కూడి నిద్ర వచ్చీఁ గూరిమి నీ రతులను**
**వూడనికొఁగిట గొంత వుండఁగరాదా**
**జాడతో శ్రీవేంకటేశ సరుఁస బెండ్లాడితివి**
**యీడుజోడాడినదా కా నియ్యకొనరాదా**

**భావదీపిక:**

దేవి భావాలను చెబుతున్నారు పెదతిరుమలయ్య. ఆమె కీర్తనలో ప్రౌఢత్వం రాని కుసుమపేశల. కౌగిటి కాంక్ష వుందిగాని రతి కోరటం లేదు. అన్నిటికి తెరచాటు కావాలనే బేల. అధరం మధురం అనే అతివ. ఆమే నవ వధువైన దేవి. ఆనాటి తెలుగు శోభన పెండ్లికూతురే, నేటి తెలుగులో అవే మాటల్నేమంటుంది? వినండి మరి. నీకు వేళాపాళా లేదా స్వామీ? ఏమి చేయాలో నాకు తోచటం లేదు. మనిద్దరికీ కాస్త యేకాంతం దొరికేదాకా నన్ను మన్నించి వూరకుండరాదా? ప్రభూ! నీ నర్మగర్భమైన చిలిపిమాటలకు నవ్వీ నవ్వీ నాకు అలసట వస్తున్నది. నీవు శృంగారరాయుడివేనని తెలుసు. అయినా నీ తెగించిన "మగతనం" కాసేపుమానరాదా? నీవు సుతారముగా నన్ను తాకిన నాకు ఎంతో సిగ్గు ముంచెత్తుతున్నది. కాస్త మోటుసరసం మాని నన్ను విడువరాదా? స్వామీ! నీ చేతులు సొంపుగా ఉన్నప్పటికీ కొంత సొదగిలి (విముఖత) కలుగుతున్నది. కాస్త తెరచాటైనా వద్దా ప్రియా! ముఖప్రీతి మాటలు చెప్పి చెప్పీ నాకు మొగము మొత్తుతున్నది. నా నోరెండిపోతున్నది. చేయి చేయి కలిపి దగ్గరయ్యేదాకా నాకు ఒకింత విరామం ఇవ్వరాదా? కూరిమిని పెంచే నీ సురతమున కూడి కూడి బడలికతో నిదుర వచ్చుచున్నది. కొంతసేపు విడివడిన కౌగిటనుంచి విరామము నీయరాదా? అవన్నీ అటుంచి ఓ శ్రీవేంకటేశ్వరా! నాకు చేరువయై పెండ్లాడితివి కదా! నేను శృంగార రస సిద్ధికి సిద్ధమయ్యేదాకా ఇయ్యకొనరాదా? (సమ్మతించరాదా ప్రభూ!)

*** ఈడుజోడాడినదాకా = దాంపత్యానికి సమవుజ్జీలయ్యే వరకు,**

*** మంతనమైనదాకా = ఏకాంతం దొరికేవరకు**

33 సంఖ్య: 102 సంపుటము: 2 పుట: 69 రాగం: లలిత

**పల్లవి:** **ఎన్నఁడొకో బుద్ధెరిఁగి యీడేరేది జంతువుల**
**యిన్నిటా నీమహిమలు యెదిరించి వున్నవి**

**చ. 1:** **కావించి నీపాదతీర్థగంగ ప్రవాహమైనది**
**పావనులై యిందరిని బ్రదుకుమని**
**లావుగా నీప్రసాదతులసి నారువోశున్నది**
**వేవేలు పాతకాలెల్ల విదళించుమనుచు**

**చ. 2:** **చింతల నీమూర్తులు శిలాశాసనాలైనవి**
**పంతముతోఁ గొలిచిట్టె బ్రదుకుమని**
**బంతినే నీనామములు ప్రతిధ్వనులై వున్నవి**
**దొంతులైన భవముల తుద గనుమనుచు**

**చ. 3:** **అందరికి నీసేవలు హస్తగతాలై వున్నవి**
**బందె దీర నీకు మ్రొక్కి బ్రదుకుమని**
**అందపు శ్రీవేంకటేశ అంతరాత్మవై వున్నాఁడ-**
**వెందు చూచిన విజ్ఞాన మింద కొండో యనుచు**

**భావదీపిక:**

భక్తి వైరాగ్యాలు ప్రధాన భూమిక నిర్వహించే కీర్తన వినిపిస్తున్నారు, అన్నమయ్య. జంతువుల వంటి ఈ మానవులు సద్బుద్ధిని పొంది యీడేరేరి (కడతేరునది) యెన్నడొకో (యెన్నడో కదా!) అన్నిటిలోనూ నీ మహిమలు యెట్టెదుటే కనుపించుచున్నవి. ప్రభూ! బ్రహ్మ నీవు త్రివిక్రముడవైనప్పుడు కడిగిన నీ పాదతీర్థము ఆకాశగంగా ప్రవాహమై అందరినీ పావనులను జేసి బ్రతికించినది. అతిశయించి నీవు ప్రసాదించిన తులసి భూమిపై నారుపోసికొని ఇంటింటా ఆరాధింపబడి అసంఖ్యాకమైన మా పాపాలను విదిలించి వేయుచున్నది. అనేక విధములుగా వూహింపబడిన నీ "మూర్తులు" శిలలు కావు.. శిలాశాసనములైనవి. మేముకూడా పట్టుదలతో నీమూర్తులను కొలిచి మాబ్రతుకులను సార్థకము చేసికొన్నాము. మా సమీపముననే అనేకములైన నీనామములు ప్రతిధ్వనిస్తున్నవి. అవి మాతో వాటిని భక్తితో పలికి పేరుకుపోయిన పుట్టుకలనుండి విముక్తి పొందండిరా అంటున్నాయి. మా అందరికి నీ సేవలు హస్తగతములైనవి. అందువలన ఈ జన్మల పీడనుంచి విముక్తులమై నీకు మొక్కి మా బ్రతుకులు సార్థకము చేసికొనినాము. ఓ శ్రీవేంకటేశా! నీవే మా అంతర్యామివై, విజ్ఞానాన్నిస్తాను అందుకోండి అనుచున్నావు. మేము ధన్యులము తండ్రీ!

*** దొంతులైన = పేరుకుపోయిన, * బందెదీర = విముక్తికలుగగా**

34 సంఖ్య:88 సంపుటము:1 పుట:61 రాగం: శ్రీరాగం

**పల్లవి:** **ఎందాఁక నేచిత్త మేతలఁపో**
**ముందుముందు వేసారితి మలిగి వేసరితి**

**చ. 1:** **ఏమిసేతు నేడచొత్తు నేమని బోధింతును**
**నామాఁట విన దిదే నావిహారము**
**యేమరినాఁ దలఁపించీ నేమైనా గడించీ**
**సాముసేసి వేసారితి జడిసి వేసారితితి**

**చ. 2:** **యేడ చుట్టా లేడ బంధు లేడ పొందు లెవ్వరూ**
**తోడైనవారుఁ గారు దొంగలుఁ గారు**
**కూడుచీరగానిచోటై కొరగానిపాటై**
**వాడివాడి వేసారితి వదిలి వేసారతి**

**చ. 3:** **యెందునున్నాఁ డేమిసేసీ నెక్కడ భోగించీని**
**విందులకువిందయినవేంకటేశుఁడు**
**యిందరిహృదయములో నిరవై యున్నాఁ డతఁడు**
**చెంది నన్నుఁ గాచుఁగాక చెనకి వేసారితి**

**భావదీపిక:**

మనిషి బ్రతికి వున్నంతవరకు మనస్సు ఆలోచనలను మానదు. అన్నమయ్య యెందాక ఈ పీకులాట అని విసుగుపడుతున్నారు. ఈ సంసార బంధాలు తగులుటకు ముందు ముందూ విసుగు పుట్టింది. ఇందులో ములిగాక మరీ విసుగు పుట్టింది అంటున్నారు. నేనేమి చేయగలను? ఎందులో చొరబడతాను? ఈ సంసార బంధాలు వద్దని యెవరికి బోధింతును? నా విహారము నామాట విననే వినదు. నేను మఱచిపోదామన్నా నన్ను మఱువ నీయదు. ఏదేమైనా అదే గెలుస్తుంది. దీనితో తలపడి విసిగిపోయాను. ఇదంటే తగని భయం పుట్టి విసుగు ఇంకా యెక్కువై పోయింది. ఈ సంసారంతో నాకు తగులుకొన్న చుట్టాలెటువంటి వారో వినండి. ఎక్కడి చుట్టాలో, ఎక్కడి బంధువులో? వీళ్లలో యెవడు స్నేహితుడు? నిజమైన తోడు వీళ్లలో నెవడు? దొంగలు అనుకోవటానికీ వీలులేదు. నా తిండికి నా బట్టకి నేను పాటు పడవలసిందే, అంతే. తిన్న తిండే తింటూ, కట్టిన బట్టే కట్టుతూ విసిగిపోయాను ప్రభూ! ఎక్కడున్నా, యేమి చేసినా, ఇందులో యేమి భోగముంది? అన్ని సంపదలకు సంపదయైన శ్రీవేంకటేశ్వరుడు, అందరి హృదయములలో నెలకొని యున్నాడు. ఈయన నన్ను రక్షించుగాక! ఈయనతో పంతము పట్టి పట్టి విసిగిపోయానంటే నమ్మండి.

* **వేసారితి** = **విసిగిపోయాను,** * **సాముసేసి** = తలపడి

35 సంఖ్య : 158 సంపుటము: 3 పుట: 106 రాగం: దేవగాంధారి

**పల్లవి:** **ఎందునైనా మీరఁబోతే నెవ్వరికి జవిగాదు**
**యిందరిలోఁ దన కొలఁ దెంచుకొనవలెను**

**చ. 1:** **మంచితనమే వలె మాటలాడే యప్పుడెల్లా**
**కొంచికొంచి యుండవలె కోపపువేళ**
**వంచన యెప్పుడూ వలె వరుస ఘనులఁ గంటే**
**చంచలము మానవలె సతతము దేహికి**

**చ. 2:** **భ్రమయకుండఁగ వలె పడఁతులఁ గంటేను**
**తమకించకుండవలె తన్నుఁ దిట్టితే**
**సుముఖుఁడై యుండవలె చూచినవారికి నెల్ల**
**అమరి యుండఁగవలె నన్నిటాను దేహికి**

**చ. 3:** **కైవశమై యుండవలె ఘనపుణ్యములకెల్ల**
**దైవము నమ్మఁగవలె తనువెత్తితే**
**యీవల శ్రీవేంకటేశుఁడితనికే శరణని**
**భావించి బ్రతుకవలె పనివడి దేహికి**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన పల్లవినే ఈనాటి వాడుక తెలుగులో ఇలా చెప్పుకోవచ్చును. అందరితో వున్నప్పుడు తన హద్దులేవో అంచనావేసికోవాలి. ఎందులోనైన అతి చేస్తే రుచించదు. పైగా యెబ్బెట్టుగా కూడా వుంటుంది. అందుకని నే చెప్పేది వినండి. భూమ్మీద మానవ దేహమును ధరించిన ప్రతివాడికి ఇది తెలియాలి. ఎవరితోనన్నా మాట్లాడేటప్పుడు మంచితనము కనబడుతుండాలి. కోపము వచ్చినప్పుడు అతి తక్కువగా మాటలాడాలి. గొప్పవాళ్ల దగ్గర మన ప్రవర్తనలో యేమాత్రపు వంచన కనబడకూడదు. దేహధారులకు ఎప్పుడూ చంచల స్వభావం శోభస్కరం కాదు. ముఖ్యంగా స్త్రీలను చూచినప్పుడు భ్రమపడకూడదు. తనని యెవ్వరైనా నిందిస్తే తమకించకుండవలెను. తనకెదురు పడిన అందరితోను సుముఖులై (ప్రసన్నవదనులై) వుండాలి. దేహధారులకు ఇవన్నీ పొందికగా వుంటే అందరూ మెచ్చుకుంటారు. గొప్ప పుణ్యకార్యాలు వారికి అలవాటుగా వుండాలి. జన్మనెత్తినందువలన దైవమంటే నమ్మకంతో వుండాలి. ఇవన్నీ వున్ననూ ఇదిగో ఈ శ్రీవేంకటేశ్వరునికే శరణాగతితో వుండాలి. దేహధారులందరూ తమ భావనలో ఆ స్వామినే నిలిపి బ్రతుకవలెను."ఎంతకాలమొ కదా!" అని పాడుకొంటూ.

*** తమకించు = తొందరపడు * కైవశమై = స్వాధీనమై**

36 సంఖ్య:445 సంపుటము:15 పుట: 299 రాగం: సామంతం

**పల్లవి:** **ఎట్టు దోయవచ్చు వీని నెంతటివాని కైనాను**
**పట్టి నీకు శరణంటే బ్రతికింతువు గాక**

**చ. 1:** **మాలతనముపంటిది మదిఁ దగులుఁ గామము**
**ఆలరి ముట్టువంటిది యంటుఁ గ్రోధము**
**కేలి నొదిగించు నెంగిలివంటిది లోభము**
**వాలాయించి యెందుండైనా వచ్చును లోకులకు**

**చ. 2:** **చుట్టి మద్యమువంటిది చొక్కించు మోహము**
**దట్టి మాంసమువంటిది వయోమదము**
**పుట్టిన భ్రమవంటిది పొదిగిన మచ్చరము**
**వుట్టిపడి నోహరించు నూరకే ప్రాణులను**

**చ. 3:** **గోడమఱఁగువంటిది గుట్టుతోడి సంసారము**
**వీడని కట్టువంటిది వేడుక యాసా**
**యీడనే శ్రీవేంకటేశ యేలితివి నీ దాసుల**
**జాడ దప్ప నియ్యవు యీ చందము జీవులది**

**భావదీపిక:**

అత్యద్భుతమైన ఈ అధ్యాత్మకీర్తనలో పెదతిరుమలయ్య అరిషడ్వర్గములని పిలువబడే కామక్రోధాదులు, మనిషిని యెట్లా అంటరాని వాడిని చేస్తాయో చెబుతున్నారు. అంటరానితనం కులం వల్ల రాదు, జీవన విధానం వలన వస్తుందని ఈ కీర్తన కొందరి కళ్ళు తెరిపిస్తుంది వినండి మరి. వీని (ఈ అరిషడ్వర్గములను) యెట్లు బహిష్కరించవచ్చును? ఓ తిరుమలేశా! పట్టుదలతో నీ శరణాగతులైతే నీవేవారిని రక్షిస్తావు. అదిగాక, ఈ అరిషడ్వర్గాల పీడ తప్పదు గాక తప్పదు దేవా! ఈ కామము ఉన్నదే అది మనస్సులో తగులుకొంటే అట్టివాడు అంత్యజునివలె అంటరానివాడే. వాడు దేనికైనా తెగిస్తాడు. ఉచ్ఛ నీచములెరుగడు. క్రోధము తగిలినవాడు ముట్టరానివాడు. వాడి ఆలోచనే అపభ్రంశముగ ఉంటుంది. ఇక లోభము ఉన్నదే చేతిలో దాచిన యెంగిలి లాంటిది. అది పారవేసేదాకా ఇంకేం మంచిపనీ చేయలేము. ఈ గుణాలు లోకులకు ఎక్కడినుంచైనా సంక్రమించవచ్చును. ఇక మోహము ఉన్నదే అది మద్యము వంటిది. అది తాగితేనే చెడు. మనిషి మోహ పీడితుడైతే చెడు. లేనిచో వారు చెడ్డవారు కాదు. ఇక వయస్సున వచ్చే మదము మాంసభక్షణ వంటిది. రుచిగా ఉన్నా ఆరోగ్యానికి హానికరం. ధుర్యోధనునివంటి వారు మచ్చరముతో నశించిరి. దానిని ఓర్వలేనితనం అంటాము. ఈ గుణాలు బయట పడ్డాయో ఊరకే ప్రాణులను హరించి వేస్తాయి. ఇక గుట్టుగా ఉన్న సంసారము గోడచాటు వంటిది. చాటు లేకపోతే అదే జుగుప్స కలిగిస్తుంది. ఇక ఆశ ఉన్నదే అది బంధనము వంటిది. దానికి (ఆశకు) లొంగినవాడు అశక్తుడే. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ దాసుల్ని ఈ దుర్గుణాలేమీ చేయలేవు.

*** జాడతప్పు = దారితప్పు, * ఉట్టిపడు = బయటపడు**

37 సంఖ్య : 60 సంపుటము: 1 పుట: 40 రాగం: సామంతం

**పల్లవి:** **ఏది చూచినా నీవే యిన్నియును మఱి నీవే**
**వేదవిరహితులకు వెఱతు మటుగాన**

**చ. 1:** **ఇరవుకొని రూపంబులిన్నిటానుఁ గలనిన్నుఁ**
**బరికించవలెఁగాని భజియింపరాదు**
**గరిమచెడి సత్సమాగంబు విడిచిన నీ-**
**స్మరణవిజ్ఞానవాసన గాదుగాన**

**చ. 2:** **యిహదేవతాప్రభలనెల్ల వెలుఁగుట నీకు**
**సహజమనవలెఁగాని సరిఁ గొలువరాదు**
**అహిమాంశుకిరణంబులన్నిచోట్లఁబరగు**
**గ్రహియింపరా దవగ్రాహములుగాన**

**చ. 3:** **యింతయునుఁ దిరువేంకటేశ నీవునికిఁ దగఁ**
**జింతింపవలెఁగాని సేవింపరాదు**
**అంతయు నవరుహమును నరుహంబనఁగరాదు**
**అంతవానికిఁ బరుల కలవడదుగాన**

**భావదీపిక:**

"వేద విరహితులు" అంటే వేదము పట్ల విరసత్వము కలవారని అర్థం. వారిగురించి చెబుతూ అన్నమయ్య. అటువంటి వారికి మేము భయపడి అందుకే దూరంగా వుంటాము. మాకుమాత్రం యేది చూచినా నీవే. మరి ఇన్నియును (సర్వము) నీవే. పలు దేవతల్నీ, పలు రూపాల్నీ పూజిస్తారు. అర్హమైనదేదో అనర్హమైనదేదో వారికి తెలియదు ప్రభూ! ఈ దేవతలందరి దేహములలో వున్న పరమాత్మవు నీవే. ఇది సత్యమే అట్టి పరమాత్మను వారిలో కూడా గ్రహించవలెను. కాని నిన్ను భజిస్తున్నామని వారిని భజింపదగదు. వైభవము చెడిపోవునట్లు, నీ శరణాగతుల సత్సంగము విడిచి పరులతో చేరితే నీస్మరణ చర్చ అవుతుందేగాని, జ్ఞాన వాసన కానేకాదు. మరి ఇక అదెందుకు? దేవా! ఇహమున ఈప్సితములను నెరవేర్చి ఆ దేవతల వైభవము నినుమడింప జేయుట నీకు సహజమే. అదంతే నని గ్రహించవలెనుగాని, వారు నీతో సరియైన వారని గొలువరాదు. అహిమాంశుడు (చల్లనివి కాని కిరణములుగల సూర్యుడు) తన కిరణాలను అన్ని చోట్లా పడేటట్లు చేస్తాడు అని గ్రహించాలే గాని చేతు లడ్డము పెట్టుట తెలివిగలవాడు చేసే పనేనా? స్వామీ! శ్రీవేంకటేశ్వరా! వారందరిలోనూ నీవునికిని గుర్తించి అదియును నీదేనని చింతించవలెను గాని వారిని సేవింప తగదు. అనర్హమైనదంతా అర్హమైనవే అని వాదించవచ్చునా? ఎందుకంటే అంత వానికి వున్న మహిమ పరులకు అలవడదు కదా!

*** గరిమచెడి = వైభవము చెడి; * సత్సమాగంబు = సత్సంగము**

38 సంఖ్య:421 సంపుటము:17 పుట:243 రాగం: రామక్రియ

**పల్లవి:** **ఏమనఁగ నే మవునో యెన్నిక లెట్టో**
**నా మనసులోననే నవ్వితిఁ బో నేను**

**చ. 1:** **ఆకెకుఁగా నొత్తి మాటలాడితే నీ చిత్త మెటో**
**కాక యేవి ననకున్నఁ గాంత యెట్టో**
**యీకడ నాకడ నే నిద్దరి నే మన లేక**
**నాకు నాకే వెఱగై నవ్వితి బో నేను**

**చ. 2:** **నెమ్మది మీ యిద్దరిలో నిజ మాడఁగా నెటొ**
**వుమ్మడి నూరక నే నుండితే నెట్టొ**
**చిమ్ముల మీ యలుకలు చిమ్మిరేఁగిన వొట్లు**
**నమ్మ లేక నాలోనే నవ్వితిఁ బో నేను**

**చ. 3:** **తలపోసి విఱలోని తమకము లవి యెట్టో**
**కొలఁది విఱతిన యింతికోరిక లెట్టో**
**చెలిఁ గూడితివి నేఁడు శ్రీవేంకటేశ్వర**
**నిలువున మిమ్ముఁ జూచి నవ్వితిఁ బో నేను**

**భావదీపిక:**

పెదతిరుమలయ్య, స్వామిని వలచిన సఖియ. కాని ఆ స్వామిని దేవిని విడదీసేటంత స్వార్థపరురాలు కాదామె. స్వామిపై తన పిచ్చి ప్రేమ స్వామికి దేవిపై వున్న అసామాన్యమైన అనురాగం చూచి తనపై తనకే జాలి కలిగి నవ్వొస్తుంటుంది. అదే ఈ కీర్తనలో వివరిస్తున్నారు. నేనెప్పుడు యేమంటే యేమవుతుందో? నేను స్వామిని యెన్నుకున్నాను. ఆ యెన్నిక గతేమిటో!! నేను నా పిచ్చికి నా మనస్సులోనే నవ్వుకొంటాను. పో! ఇక ఇదింతే. నా మూలంగా వాళ్లిద్దరూ కీచులాడుకోవడం లేదు కదా! ఆమె తరపున గట్టిగా వొత్తి మాట్లాడితే స్వామి ఏమనుకుంటాడో! పోనీ, నేనేమీ అనకబోతే ఈ కాంతయేమనుకుంటుందో! ఇటువైపుగాని, అటువైపుగాని, నేనేమీ అనలేక, నాకే భయమేసి భార్యాభర్తల కీచులాటలో తలదూర్చితే యేమవుతుందో వూహించి నవ్వు వచ్చింది. మీ ఇద్దరిలో యెవ్వరు నెమ్మదస్తులో నిజం చెబితే యేమవుతుందో యేమో! పోనీ నాకెందుకులే అని వుభయతారకముగా వూరకుంటే యేమవుతుందో! సరదాగా మొదలైన మీ ప్రణయ కలహం చిమ్మిరేగిన వొట్లు (విజృంభిస్తే.. నాపై ఆన) మీగొడవ నమ్మలేక నాలో నాకే నవ్వొస్తుంది ప్రభూ! మీరు ఒకరి గురించి యింకొకరు చేసే ఆలోచనలెట్టివో!! అతిశయించిన ఈ యింతి కోరికలు యే తీరున ఉంటాయో!! ఓ శ్రీవేంకటేశ్వరా ఇవన్నీ ఇట్లా ఉండగానే నీవు ఆ చెలిని(దేవిని) కూడితివి. మీ ఆలూమగలను చూచి నాకు నిలువునా నవ్వు వస్తున్నదయ్యా!

*** చిమ్ముల = సరదాగా, * నిలువునా = నిలుచున్నట్లే, ఒక్కసారిగా**

39 సంఖ్య: 123 సంపుటము:1 పుట:84 రాగం: భూపాళం

**పల్లవి:** ఏమో తెలిసెఁగాని యీ జీవుఁడు
నేమంపునెరవిద్య నేరఁడాయ

**చ. 1:** కపటాలె నేరిచెఁగానీ జీవుఁడు
యెపుడైనా నిజసుఖ మెఱఁగఁడాయ
కపురులే చవిగొనెఁగానీ జీవుఁడు
అపరిమితామృత మానఁడాయ

**చ. 2:** కడలనే తిరిగీఁగానీ జీవుఁడు
నడుము మొదలుఁజూచి నడవఁడాయ
కడుపుకూటికే పోయీఁగానీ జీవుఁడు
చెడని జీతముపొంతఁ జేరఁడాయ

**చ. 3:** కనియుఁగానకపోయఁగానీ జీవుఁడు
దినము వేంకటపతిఁ దెలియఁడాయ
కనుమాయలనె చొక్కెఁగానీ జీవుఁడు
తనియ నిట్టే మంచిదరిఁ జేరఁడాయ

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో "ఈ జీవుడికి యేవేవో తెలిసినవి గాని, నియమబద్ధమైన నెరవిద్య (గొప్ప అధ్యాత్మ విద్యను) నెరుగక యున్నాడు" అని వాపోతున్నారు. ఈ జీవుడు కపటమెలా చేయాలో నేర్చినాడు. కాని యెప్పటికైనా నిజమైన సుఖము యెలా దక్కుతుందో తెలియకున్నాడు. అందాల నాస్వాదిస్తున్నాడు. జీవుడు అపరిమితమైన అమృతమును పొందలేకున్నాడు. ఈ జీవుడు చివరి గమ్యం చేరాలని చూస్తున్నాడే కానీ ఆ మార్గమునకు మొదలు తెలియదు మధ్యలో కూడా తెలియదు. ఈ జీవుడు కడుపునిండా కూటికే కక్కుర్తి పడుతున్నాడు గాని, చెడిపోని జీతము అయిన ఆత్మానందానికి చేరువగాకున్నాడు. ఈ జీవుడు చూచికూడ గ్రహించలేకున్నాడు. అతగాడు దినమంతా శ్రీవేంకటేశ్వరుని చూచినా ఆ స్వామి తత్త్వమును గ్రహించలేకున్నాడు. దురదృష్టవంతుడైన ఈ జీవుడు ఆయన మాయకు లోనై పోతున్నాడు కానీ తృప్తి నెరిగి మంచి గమ్యమును చేరలేకున్నాడు.

*** కపురులు = అందాలు * తనియ =** తృప్తితో

40 సంఖ్య: 36 సంపుటము: 2 పుట: 25 రాగం: వరాళి

**పల్లవి:** **ఏమందురు యీమాటకు నిందరూ నిన్ను**
**నీమాయ యెంతైనా నిన్ను మించవచ్చునా**

**చ. 1:** **నేను నిన్నుఁ గొలిచితిని నీవు నన్ను నేలితివి**
**పాని పంచేంద్రియాలేల పనిగొనీని**
**కానిలేని బంట్లఁ దేరకాండ్లు వెట్టిగొనఁగ**
**దానికి నీ కూరకుండ ధర్మమా సర్వేశ్వరా**

**చ. 2:** **పుట్టించినాఁడవు నీవు పుట్టినవాఁడను నేను**
**పట్టి కర్మమేల నన్ను బాధపెట్టీని**
**వొట్టినసొమ్ముకు వేరొకరు చేయిచాఁచితే**
**తట్టి నీవు వహించుకోఁదగదా సర్వేశ్వరా**

**చ. 3:** **యెదుట నీవు గలవు యిహములో నేఁ గలను**
**చెదరిన చిత్తమేల చిమ్మిరేఁచీని**
**అదన శ్రీవేంకటేశ అరితేరినట్టినన్ను**
**వదలక రక్షించుకో వన్నెగా సర్వేశ్వరా**

**భావదీపిక:**

అన్నమయ్య ఈ కీర్తనలో స్వామితో యేమంటున్నారంటే.. దేవా! అంతా యీ మాటకు బదులుగా నిన్నేమంటారో తెలియునా? యేది యెంతైనా నీ మాయ యెంత గొప్పదైనా, నిన్ను అధిగమించడానికి తగునా? మేము నీ దాసులము. ఆరి తేరిన మా జోలికది రా తగునా? అంటున్నారు. ప్రభూ! నేను నిన్ను కొలిచితిని. నీవు నన్ను యేలితివి. పాని (పాయని) పంచేంద్రియాలు యెందుకు నన్ను వోడించాయి? కానిలేని బంట్లను (అశక్తులైన నీ దాసులను) సంబంధంలేని యెవరెవరో వచ్చి వెట్టి చాకిరి చేయించుకొంటుంటే నీవు చూస్తూ వూరకుండవచ్చునా సర్వేశ్వరా? దేవా! నీవే పుట్టించినవాడవు. నేనే పుట్టినవాడను. మరి మధ్యలో ఈ నా కర్మయేల నన్ను బాధిస్తున్నది? నీవు స్వంతం చేసికొన్న సొమ్మును నేను. ఇట్టి నాకోసం మరొకరు చేయి చాచి స్వంతం చేసికోబోతుంటే నువ్వు వూరక వుంటావా? పూనుకొని నన్ను స్వీకరించతగదా సర్వేశ్వరా? మా యెట్ట యెదుట నీవు వున్నావయ్యా?దేవదేవా! మేము ఇహములో మాత్రమే వున్నాము. మా చిత్తము చెదరిపోయేలా యెందుకు చేశావయ్యా? అతిశయించిన వోశ్రీవేంకటేశ్వరా! నన్ను వదలక వన్నెతో రక్షించవయ్యా సర్వేశ్వరా!

**∗ తేరకాండ్లు = సంబంధంలేనివారు ∗ తట్టి = తన్ని**

41 సంఖ్య : 140 సంపుటము: 1 పుట: 96 రాగం: శ్రీరాగం

**పల్లవి:** **ఏది చూచినను( గడు నిటువంటి సోద్యములే**
**మేదినికి( గిందుపడి మిన్నందనేలా**

**చ. 1:** **కరిరాజుగాంచినకరుణానిధివి నీవు**
**అరిది నరసింహరూపైతివేలా**
**వురగేంద్రశయనమున నుండి నీవును సదా**
**గరుడవాహనుండవై గమనించనేలా**

**చ. 2:** **పురుషోత్తమఖ్యాతి( బొదలి యమృతము వంప**
**తరుణివై వుండ నిటు దైన్యమేలా**
**శరణాగతులకు రక్షకుండవై పాము నీ**
**చరణములకిందైన చలముకొననేలా**

**చ. 3:** **దేవతాధిపుండవై దీపించి యింద్రునకు**
**భావింప తమ్ముండనని బరగితేలా**
**శ్రీవేంకటాచలస్థిరుండవై లోకముల**
**జీవకోట్ల లోన( జిక్కువడనేలా**

**భావదీపిక:**

అద్భుతమైన ఈ అధ్యాత్మకీర్తనలో పురుషోత్తముని ఖ్యాతి వివరిస్తూనే అన్నమయ్య దేవదేవా! నీవేమి చేసినా విచిత్రమే, యేది చూచినా ఇటువంటి చోద్యములే మేదినికి గిందుపడి మిన్నందనేల? (ఇంతోటి దానికి భూమిలోనికి క్రుంగిపోనక్కరలేదు, ఆకాశమంత యెత్తు యెగరనవసరం లేదు). ఈయన తీరే ఇంత... అంటున్నారు. ప్రభూ! నీవు గజేంద్రుని సంరక్షించిన కరుణానిధివి కదా! భీకరుడవైన నృసింహుడవై హిరణ్యకశిపుని చీల్చి రక్తం త్రాగేవేమిటయ్యా? సదా నీవు ఆదిశేషుని తల్పముగా శయనిస్తావు కదా! మరి పాముల శత్రువైన గరుత్మంతుడు నీ వాహనమా!! ఇదేమిటి స్వామీ? నీఖ్యాతియేమని, పురుషోత్తముడవని, అమృతం అసురులకు కాక సురులకు దక్కాలని అందాల భరిణి మోహిని వయ్యావా? నీకిదేమి దైన్యమయ్యా? శరణాగత రక్షకుడవే, మరి పాపం కాళీయుడనే పాముని రక్తం కక్కుకొనునట్లు వాని పడగలపై యెక్కి తొక్కావు. అంత పగ నీకు దేనికయ్యా? నీవు దేవతాధిపుడవు కదా! పోయి పోయి అదితి కడుపున బుట్టి ఇంద్రుడికి తమ్ముడవై ఉపేంద్రుడవనిపించుకొన్నావు. ఇదేమి వింత!! నీవు సర్వేశ్వరుడవు సర్వలోకేశ్వరుడవు, వచ్చీ వచ్చీ భూమ్మీద వేంకటాద్రిపై కాంతులీనుతూ లోకములలోని జీవకోట్లకు చిక్కుపడిపోయి ఇంతమంది మాట వింటున్నావు. నీకిదేమి బాధ్యత తండ్రీ!!

*** దీపించి = కాంతులీనుతూ, * ఉరగేంద్రుడు** = ఆదిశేషుడు

42 సంఖ్య : 113 సంపుటము: 1 పుట: 77 రాగం: శ్రీరాగం

**పల్లవి:** **ఏమి గల దిందు నెంతగాలంబైన**
**పామరపు భోగ మాపదవంటి దరయ**

**చ. 1:** **కొండవంటిది యాస, గోడ వంటిది తగులు**
**బెండువంటిది లోని పెద్దతనము**
**పుండువంటిది మేను, పోలించినను మేడి-**

**చ. 2:** **కంచువంటిది మనసు, కలిమిగల దింతయును**
**మంచువంటిది, రతి భ్రమతవంటిది**
**మించువంటిది రూపు, మేలింతయును ముట్టు-**
**పెంచువంటిది, దీనిప్రియ మేమిభ్రాంతి**

**చ. 3:** **ఆఁకవంటిది జన్మ, మడవివంటిది చింత**
**పాఁకువంటిది కర్మంధమెల్ల**
**యేఁకటము దిరువేంకటేశుఁ దలఁచిన కోర్కి**
**కాఁక (?) సౌఖ్యములున్న గనివంటి దరయ**

**భావదీపిక:**

రాయి వంటి మనస్సు అంటే యేమిటి? కఠినమైనదని అర్థం. ఇది ఉపమాలంకారము అన్నమయ్య అత్యద్భుతమైన ఉపమాలంకారాలను వాడుతూ ఈ కీర్తనలో పామరులు అనుభవించే భోగము పరిశీలించి చూస్తే ఆపదవంటిదే. ఎంతకాలమైనా ఇట్లాగే వుంటుంది. ఏమిగల దిందులో అంటున్నారు. ఇక మానవుల ఆశను చూద్దామా అంటే అది యెక్కలేని కొండ వంటిది. వాడికి దేనిమీదైన తగులు (వ్యసనము) కలిగిందంటే అది గోడవంటిది. వాణ్ణి అందరికీ దూరం చేస్తుంది. వృద్ధాప్యము బెండువంటిది (శక్తి విహీనమైనది). ఈ శరీరం పుండువంటిది. ఇది వున్నంతకాలమూ "సలుపుతూనే" వుంటుంది. పోల్చి చూస్తే శృంగార భావాలనీ మేడిపండులాంటివి. మేడిపండు చూడ మేలిమైయుండును, పొట్టవిప్పి చూడ పురుగులుండు. మనస్సు కంచువంటిది. కింద పడేస్తే ముక్కలవుతుంది. సంపద మంచువంటిది. చూస్తుండగానే కరిగి నీరవుతుంది. రతిక్రీడ భ్రమత వంటిది. (మోహము వంటిది) క్షణికానందమిస్తుంది. రూప సౌందర్యం "మించు" (మగవాళ్లు పెండ్లిలో కాలి వ్రేలికి తొడిగే మట్టెలవంటి అలంకరణ) వంటిది. ఎంతకాలం వుంటుంది? చేసిన మేలు ముట్టు పెంకు వంటిది. ఎవ్వరూ గుర్తుపెట్టుకోరు. ఈ చెప్పిన వాటిమీద మానవుని ప్రేమ కూడా గొప్ప భ్రాంతి. జీవులు పొందే జన్మ, "ఆఁక వంటిది యెప్పుడు విముక్తి కలుగుతుందో యెవడికీ తెలియదు. చింత మన కాలి "మడెమె" లాంటిది. అది మన వెన్నంటే వుంటుంది. కర్మబంధము "పాఁక" వంటిది. దానిని విడిచి పోలేము. తిరువేంకటేశ్వరుని గొప్ప అపేక్షతో తలచినచో ఆ కోర్కెయొక్క "కాఁక" (వేడి) సౌఖ్యముల గని వంటిది.

* **ఆఁక = చెరసాల,** * **ఏకట** = గొప్ప అపేక్ష

43 సంఖ్య : 139 సంపుటము:27 పుట: 254 రాగం: సాళంగనాట

**పల్లవి:** **ఏరా నీ గుట్టెల్ల నే నెఱఁగనిదా**
**తేరి చూడరాదా మమ్ము తెఱవలలోనను**

**చ. 1:** **తోడనే వెలితౌనా నీ దొరతనమునకును**
**నీడల నావద్ద నిట్టె నిలుచుంటేను**
**జడ దప్పీనా నీ జవ్వనమదమునకు**
**వీడెము నా కందిచ్చితే వెలఁదులలోనను**

**చ. 2:** **ఇంచుకంత దరగీనా యిప్పటి నీ సత్తువలో**
**పంచల నా చెప్పినట్టి పని సేసితే**
**నించిన నీ చలములో నెరుసులు దొరలీనా**
**మంచముపైఁ గూచుండి మాఁటలాడితేను**

**చ. 3:** **వూరకె నీవు వెట్టిన వొట్టు నీపై మోఁచీనా**
**యేరా నాకుఁ బంతము లిచ్చితే నీవు**
**ఆరీతి శ్రీవేంకటేశ అంతలో నన్నుఁగూడితి**
**తారుకాణౌనా నాతో తమకించితేను**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ సరస కీర్తనలో నాయిక, స్వామిని యెలా దెప్పిపొడుస్తున్నదో చూడండి. ఏమిరా నీగుట్టునంతా నేనెఱగనిదా? మేము దారిలో పోతుంటే మమ్ము దొంగచూపులు చూచెదవేమి? తేరిపార చూడరాదా? నాపై అనురాగంతో నాచెలులు చూస్తుండగా తాంబూలమియ్య రాదా? తోడనే (అంతమాత్రాన) నీ దొరతనము దెబ్బతింటుందా? కాస్త నీడపట్టున నాతోగడిపితే, పోనీ కొంచెము సేపు మంచముపై నాతో కూర్చుండి మాటలాడితే, నీ సత్తువ ఇప్పటికిప్పుడు తరిగిపోతుందాయేమిటయ్యా? సంసారపక్షముగా నేను చెప్పినట్లు చేస్తే అతిశయించి నీ పంతములలో లొసుగులు దొర్లుతాయాయేమి? స్వామీ! వూరకనే నీవు పెట్టిన వొట్టు నీపై తిరిగి పెట్టగలనా? మరియేమిరా నాతో ఆ విధముగా నీవు పంతములిచ్చెదవు? ఏదియేమైనా యేరీతి పంతములాడినా, వో శ్రీవేంకటేశ్వరా! నన్ను కూడితివి. నాతో తన్మయత్వం చెందుటయే నీ అనుగ్రహానికి తార్కాణము. అవునా?

*** తారుకాణము = ఋజువు, * నించిన = అతిశయించిన**

44 సంఖ్య : 314 సంపుటము: 3 పుట: 212 రాగం: లలిత

**పల్లవి:** **ఏల వెట్టిసేయించే విందున నీకేమివచ్చె**
**కాలముఁ గర్మముచేతఁ గప్పేవు లోకులను**

**చ. 1:** **బద్దులమాటలాడి భ్రమయించి రేపల్లెలో**
**ముద్దులు చూపి వెన్నులు ముచ్చిలినట్టు**
**కొద్దిమాలినకర్మము కొంత మాకు గడియించి**
**వద్ద నిన్నుఁ ఎఱఁగానివాని(?) వలె దాఁగవలెనా.**

**చ. 2:** **మఱి పాడవులకు నెమ్మది వావులటు చెప్పి**
**మొఱఁగి యిందరిలోన మొక్కినయట్టు**
**కుఱకుఱదై వాలఁ గొందరము గడియించి**
**యెఱిఁగి వెఱఁగనట్టె యేమిసేసెవయ్యా**

**చ. 3:** **మడుగఁగఁబోయి వడి ఘంటాకర్ణునికి**
**యిరవుగ మోక్షవరమిచ్చినయట్టు**
**తిరమై శ్రీవేంకటాద్రిఁ దిరువారాధన గొని**
**వరుస నీదాసులకు వరమిచ్చేనయ్యా.**

**భావదీపిక:**

ఆవేదనతో దేవదేవుని ప్రశ్నిస్తున్నారు అన్నమయ్య. ఎందుకు స్వామీ! మాకు యీవెట్టి చాకిరి? ఇదంతా మాచేత చేయిస్తే, నీకేమొస్తుంది? ఇందులో నీకు యేమి సంతోషం కలుగుతుంది? ఈ లోకాన్ని (లోకులను) కాలము, కర్మము అనే వాటితో కప్పివేసి యెందుకు అంతులేని భ్రమలలో, బంధాలలో పెట్టుట వలననే నీకూ అవే తగిలాయి. ఆ నాడు కృష్ణయ్యగా రేపల్లెలో యేమి చేశావు? ఎన్ని అబద్ధాలు చెప్పావు? ఎంతమందిని భ్రమపెట్టావు? ముద్దులు మూటలు కట్టించి, యెంతవెన్న కాజేశావు? ఇంత కొద్దిమాలిన (మితిలేని) కర్మచేశావు కాబట్టే మాకు ఆ దుష్కర్మలనే అంటగట్టావు. నీవు దేవదేవుడివి. నీకు అదిలీల. మరిమాకో? కర్మబంధమై వెట్టి చాకిరి చేయిస్తోంది. ప్రభూ! కాలమునకు నీవాళ్లూ లొంగక తప్పదని నీ స్వంత బావలైన పాండవులను యెంత వ్యధకు గురిచేశావు? భార్యనే ఒడ్డి అవమానాల పాలుజేశావు. దాని ఫలితంగా ధర్మరాజు పాదాలకు మొక్కినావు. అర్జునునికి దివ్యాస్త్రాలనిప్పించావు. వాని రథం తోలినావు. కుఱకుఱదైవాలను (ద్వేషమున్న ఇంద్రాది దేవతల చేత) కూడా చేయరాని పనులు చేయించావు. నీవన్నియు నెఱిగియు యేమీ యెరుగనివానివలె అందరిని కాలప్రభావానికి లోనుచేశావు. ఏమి చేశావయ్యా తండ్రీ? పిశాచరూపము పోవాలని వరమడుగ బోయిన ఘంటాకర్ణునికి యేకంగా కుబేరత్వమూ, మోక్షమూ ఇచ్చావు. అట్లాగే నేటి కలికాలంలో కూడా మావంటి కర్మపీడితులకు, కాలబద్ధులకు నిన్ను శరణంటే తిరువేంకటేశ్వరుడవై స్వయంగా అభయహస్తమును చూపి, వరదహస్తముతో కోరిన వరములనిస్తున్నావు. నీదాసులను స్వయంగా రక్షిస్తున్నావు.

*** బద్దుల మాటలు = అబద్ధాలు, * తిరమై = సుస్థిరమై**

45 సంఖ్య:113 సంపుటము:27 పుట:76 రాగం: నాదరామక్రియ

**పల్లవి:** **ఒద్ద నిద్దరున్నారు వొడ్డోలగమై వున్నాఁడు**
**కొద్దిమీరి లోకమేలే గుణవంతుఁ డతఁడు**

**చ. 1:** **తమకమే కలిగితే తానే నాయింటికి వచ్చీ**
**రమణుని దూరకురే రామలాల**
**సముకమున నే నుంటే చనవు తానే యిచ్చీ**
**తిమురుచు నీతనితో దీకొనఁగ వచ్చునా**

**చ. 2:** **మన్నించవలసితే మాటలు తానే యాడీ**
**సన్నల నాడించకురే సతులాల**
**పన్ని నే సేవసేయఁగా భావము దానే కరఁగీ**
**విన్నపము లిట్టె చేసి వేఁగిరించవచ్చునా**

**చ. 3:** **కరుణ గలిగితేను కాఁగిటఁ దానే కూడీ**
**పరుసా లాడకురే పడఁతులాల**
**ఇరవై శ్రీ వేంకటేశుఁ డీతఁడిదె నన్ను నేఁడె**
**అరుదై పెనఁగఁగాను అవుఁగాదనవచ్చునా**

**భావదీపిక:**

అన్నమయ్యా స్వామి వలపుకత్తెగా చెప్పిన ఈ సరస శృంగార కీర్తన అతి మధురమని దీని చదువరి తేలికగా గ్రహించగలడు. ఒడ్డోలగమై ఉండటమంటే "మహా వైభవముతో నుండుట" అని అర్థం. ఈ స్వామివద్ద ఇరువురు భామలు (శ్రీదేవి, భూదేవి) ఇరుప్రక్కల నుండగా మహావైభవముతో నున్నాడు. అతగాడెవరనుకున్నారు? లోకములనెల్ల అతిశయముగా పరిపాలించే సద్గుణవంతుడు. ఆ స్వామికి నాపై మోహము కలిగితే తనే నా ఇంటికి వచ్చాడు. ఓ భామలారా! ఆయనను నిందించకండి. నేను (అన్నమయ్య) ఆయన సముఖముననుంటే తనే నాకు ఆదరణ నిచ్చాడు. అంతమాత్రాన, తిమురుచు (తొందరపడి) ఆయనను దీకొనవచ్చునా? (యెదిరించవచ్చునా?) నన్ను మన్నించాలని ఆయన భావించి తనే నాతో మాటలాడినాడు. ఓ సతులారా! అంతమాత్రాన సౌంజ్ఞలతో ఆయనను బెదిరించకండమ్మా! నేను ఒప్పుగా ఆయనకు సేవ చేస్తే నా ఆరాధనాభావానికి కరిగినవాడై నన్ను అనుగ్రహించాడు. మీరు ఆయనకు నాపై ప్రతిగా విన్నపములు చేసి, తొందరబెట్టవచ్చునా? ఓ పడతులారా! నాపై కరుణాంతరంగుడై స్వామి నన్ను కౌగిలించినాడు. అంతమాత్రాన పరుషంగా మాట్లాడవద్దు. ఈ శ్రీవేంకటేశ్వరుడు అరుదుగా నన్ను పెనవేసుకుంటే ఆయనను అవుగాదనవచ్చునా (తిరస్కరించవచ్చునా)

* **పన్ని = ఒప్పుగా,** * **పరుసాలాడకురే** = పరుషంగా పోట్లాడవద్దు

46 సంఖ్య:396 సంపుటము:17 పుట:229 రాగం:రామక్రియ

**పల్లవి:** **ఒయ్యన చేరి పాదా లొత్తవమ్మ**
**తియ్యని నోరనే మాట తియ్యవమ్మా**

**చ. 1:** **పదియారువన్నెబొమ్మ పట్టపు వొలుకేమమ్మ**
**యెదురుగొండ లెక్కితి వేమమ్మ**
**పెదవిపై వాదులనే బేంట్లు రాలి తమ్మ**
**యిదివో నీపతితోడ నింత వద్దా అమ్మా**

**చ. 2:** **అతనునిం గన్నకొమ్మ హరియఱచేతి నిమ్మ**
**యితని యలుక దేర్చ వేమమ్మ**
**మతకాలే నెరుపేవు మదము చెక్కులం గమ్మ**
**యితవరి పతితోడ నింత గద్దా అమ్మ**

**చ. 3:** **యీవిం గల్పకపు రెమ్మ యింటిలో దాంచిన సొమ్మ**
**యీవిభుం దప్పక చూచే వేమమ్మ**
**శ్రీవేంకటేశుండైన శ్రీనరసింహునితోడ**
**యీవేళనే యెక్కుకొంటి వింత గద్దా అమ్మా**

**భావదీపిక:**

అహోబల నృసింహుని దేవేరిపై సరస, సభక్తి, శృంగార కీర్తన వినిపిస్తున్నారు పెదతిరుమలయ్య తన తండ్రి అన్నమయ్యవలెనే ఈ నృసింహుడే ఆ తిరుమల వేంకటేశ్వరుడని భావిస్తున్నారు. ఎదురుకొండపైనెక్కి పతికి ప్రీతి కలిగిస్తున్న శ్రీలక్ష్మికి తనపతిని చేరి ఒయ్యన (మెల్లగా) ఆయన పాదముల నొత్తమని బోధిస్తున్నారు. మధురమైన ఆమె నోటితో తన పతికి ఇంపుగా మాటతియ్యవమ్మా (మాట్లాడవమ్మా?) అంటున్నారు. తల్లీ! నీవు పదియారు వన్నెల బంగారు బొమ్మవు. పట్టపురాణివలె కులుకుదేవివమ్మా! మరి నీపతి ఆ కొండపై నుంటే నీవు యీకొండ నెక్కావేమమ్మా? పైపై పెదవులతో వూరకనే నీ పతితో వాదనకు దిగి బెట్టు చేస్తావేమమ్మా? ఇదిగో ఆయన ఉగ్ర నారసింహుడు అట్టి ఆయనతోనే ఇంత వద్దా (చనువా) తల్లీ? తగిన సమయము చూచిన తరుణీ! ఆ హరి (సింహము) నీచేతి నిమ్మ (నీ అధీనుడు). మరి, అతగాని అలుకను తీర్చవేమమ్మా? తల్లీ నీవేమి మాయలు చేసినావో గాని నీ చెక్కిళ్లు గర్వమును తొణికిస్తుంటే నీకు హితకారియైన పతితో ఇంత చేస్తావా అమ్మా! ఓ జగజ్జననీ! దాతృత్వంలో నీవు కల్పవృక్షపు రెమ్మవు. మనోధైర్యం కలిగించడంలో నట్టింట్లో దాచిపెట్టిన సొమ్మువి. మరి ఈ నీ విభుని అంత తదేకముగా చూస్తావేమమ్మా? అక్కడ తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడైన ఈ అహోబల నారసింహునితో ఈ వేళ యెక్కు కొంటివి (యెక్కువైతివి) ఇంతటి దానవా తల్లీ?

*** మతకాలు = మాయలు; * తప్పకచూచు = తదేక దృష్టి**

47 సంఖ్య : 119 సంపుటము: 3 పుట: 80 రాగం: బౌళి

**పల్లవి:** **కనకము కనకమే కడు నినుమినుమే**
**వెనక సరిదూఁగితే వెలువకురాదు**

**చ. 1:** **హరిఁ గొలిచినవారి కమరు నన్నిసుఖాలు**
**గరిమతో వారల భాగ్యమే భాగ్యము**
**తెరమరఁగుల కర్మదేహులెల్ల వీరితోడ**
**పురుఁడు వెట్టుకోఁబోతే పోలికలు రావు**

**చ. 2:** **భాగవతులైనవారు పట్టినదెల్లా నీడేరు**
**చేగదేర వారలు సేసినదే చేఁత**
**తీగెసంసారమత్తులు తెలియక వీరివలె**
**వేగినంతా నయ్యేమంటే వెరవులఁ బడవు (?)**

**చ. 3:** **శ్రీవేంకటేశుదాసులు చేసినదెల్లా సృష్టి**
**యేవంకా ధ్రువపట్టమే ఇటు వారికి**
**కావరపు మనుజులు గతిగనేమని వారి-**
**తోవల నడవఁబోతేఁ దూగదు తమకును**

**భావదీపిక:**

అన్నమయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో హరిదాసులు కర్మదేహులు చూడటానికి ఒక్కమాదిరిగా వున్నా మరియే పోలికా వుండదు. కనకమూ, ఇనుమూ రెండూ లోహాలే. కాని వాటిని సరితూచవచ్చునా? బరువు సమానంగా తూచినా, వెలువ (విలువ) సమానమవుతుందా? అని అంటున్నారు. శ్రీహరిని గొలిచిన వారికి అన్ని సుఖములు అమరుతాయి. మహిమగల వారి భాగ్యమే భాగ్యము. తెరమరుగున యెన్నో అకృత్యాలు చేసే కర్మదేహులను వీరితో పురుడు (పోలిక) పెట్టబోతే పోలికలు రావు. భగవంతునే నమ్ముకొనిన భాగవతులు పట్టినదెల్లా నెరవేరుతుంది. అతిశయించి వారు చేసినదే సకర్మ. తీగెవలె సంసారంలో బంధింపబడి దాని మత్తులోనే మునిగిపోయినవారు, వీరివలె (భాగవతులవలె) తెల్లవారే లోపల అయిపోతామంటే వెరవులబడవు (బయటబడవు). శ్రీవేంకటేశ్వరుని దాసులు సృష్టిలో యేమి చేసినా అది ధ్రువపట్టమువలె నిశ్చలమూ సుస్థిరమూ అయివుంటాయి. కామక్రోధాది అరిషడ్వర్గ పీడితులైన మానవులు, వారి త్రోవలో నడువబోతే వాళ్లకు తూగదు.

**∗ వేగినంత = తెల్లవారేలోపల, ∗ తూగదు = సరిసమముకాదు**

48 సంఖ్య : 34 సంపుటము: 2 పుట: 23 రాగం: లలిత

**పల్లవి: కరుణించు మిఁకనైన కాఁపురమా**
**కరికరిఁ బెట్టకుమీ కాఁపురమా**

**చ. 1: కలలోని సుఖమైన కాఁపురమా**
**కలుషమే చవియైన కాఁపురమా**
**కలను బేహారపు కాఁపురమా**
**కలఁడు మా కిదే హరి కాఁపురమా**

**చ. 2: గంట వేఁటలో తగులు కాఁపురమా**
**కంట వత్తివెట్టి కాచే కాఁపురమా**
**గంటుగిందుగాఁ బొరలే కాఁపురమా**
**కంటిమి శ్రీపతికృప కాఁపురమా**

**చ. 3: కావిరి వెట్టి చేరాయి కాఁపురమా**
**కావలసినట్లయ్యే కాఁపురమా**
**శ్రీవేంకటేశ్వరుఁడు చేరి నిన్ను నన్ను నొక్క-**
**కైవశము సేసెఁగదో కాఁపురమా**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో కాపురమా అని సంసారాన్ని సంబోధిస్తున్నారు. "ఓ సంసారమా! ఇకనైనా నన్ను కరుణించుము. నను కరికరి (కరికరి అంటే నిర్బంధం) పెట్టవద్దు" అంటున్నారు. ఓ సంసారమా! నీవిచ్చే సుఖము కలలో పొందే సుఖం లాంటిది. నీకు రుచించేది కలుషమే (కాలుష్యమే) కదా! నిన్ను నమ్మటం కలనున్న వ్యాపారమువలె నిజమునకు నిలువదు. ఓ కాపురమా! మాకు రక్షకుడుగా శ్రీహరి వున్నాడు సుమా! గంట వేటలో (గంట కొడుతూ జంతువులను బెదరగొట్టి జరిపే వేట) తగులుకొనునట్లు జేసే కాపురమా! నిన్ను మేము కంటిలో వత్తివేసి జాగ్రత్తగా కాపాడుకొంటున్నాము. గాయపడినా దానితోనే పొరలే సంసారమా! నీవల్ల మాకే ఆపదాలేదు. ఎందుకంటే మేము శ్రీహరికృపను కలిగియున్నాము. వెట్టివాని చేతిలోని నల్లని రాయివంటి సంసారమా! నీ గమ్యం యేమిటో నీకే తెలియదు. నీకేముంది ఎవరు యెట్లా కావాలనుకొంటే అట్లా మారిపోతావు. ఆ శ్రీవేంకటేశ్వరుడు నిన్ను నన్నూ ఒక్కసారే కైవశము చేసికొన్నాడు కదా! కాపురమా!

*** కావిరి = నల్లని, * గంటు = గాయము**

49 సంఖ్య : 119 సంపుటము: 2 పుట: 81 రాగం: ఆహిరి

**పల్లవి:** **కలిదోషములాల కడు నేల మీరేరు**
**యిలధరుఁ డుండగాను యింకనేఁటి సుద్దులు**

**చ. 1:** **జగములేలెడువాఁడు సర్వాంతరాత్ముఁడు**
**జిగి నింక నీకీబుద్ధి చెప్పనోపఁడా**
**నిగిడి పుట్టించేటివాఁడు నిండుక వుండేటివాఁడు**
**తెగని కర్మములెల్ల తిద్దకేల మానును**

**చ. 2:** **దనుజులఁ గొట్టేవాఁడు ధర్మము నిలిపేవాఁడు**
**పనిగొన్న దురితాలు పాపనేరఁడా**
**కొనమొదలైనవాఁడు గురి దానైనవాడు**
**వునికి మనికి సేయకూరకుండీనా**

**చ. 3:** **స్వతంత్రుడైనవాఁడు స్వామియైనవాఁడు**
**గతియై దాసులనెల్లఁ గానకుండీనా**
**యితఁడే శ్రీవేంకటేశుఁ డిందిరాపతైనవాఁడు**
**సతతము మాకు నిట్టే సంపద లొసఁగఁడా**

**భావదీపిక:**

అన్నమయ్య మానవులను పట్టి పీడించే కలిదోషములతో యేమంటున్నారో వినండి. ఓ కలికాలపు దోషములారా! మీరు యెందుకు అతిగా మితిమీరుతున్నారు? ఇలధరుడు (భూకాంతుడు) అయిన శ్రీహరి మాకు రక్షకుడు. ఇంక మీ కథలు మా వద్ద చెల్లుబాటుగావు. ఇంకా మాగురించి వినండి. త్రిజగములనేలే జగన్నాథుడు, సర్వాత్మకుడు, అయినవాడు మీకు బుద్ధిచెప్పకుంటాడా? జీవులన్నింటినీ పుట్టించేవాడు, అణుమాత్రం సందులేకుండా అంతా నిండివుండేవాడు, తెగని మా కర్మఫలముల నన్నింటిని సరిదిద్దకుండా వూరకుంటాడా? అంతేకాదు దనుజ సంహారి, ధర్మస్థాపనకు అవతారాలెత్తేవాడు పనివేళా మమ్మాక్రమించిన మా పాపాలను నిర్మూలించ లేడా? ఆద్యంతములూ తానే అయినవాడు మా ఉనికికీ మనికికీ (ఉండటానికి, జీవిక కూ) రక్షించక వూరకనే మీ అకృత్యాలను చూస్తూ వుంటాడనుకోకండి. అందరికీ స్వామియైనవాడు, సర్వస్వతంత్రుడైనవాడు, అందరికీ గతియైనవాడు, తన దాసులను తను కాపాడుకోలేడు. ఇన్ని సుగుణములున్న ఈ శ్రీవేంకటేశ్వరుడే. ఇందిరాపతి మరి సంతతమా ఇతడు మాకు ఇట్టే సంపదలొసగడా?

*** కొనమొదలైనవాడు = ఆద్యంతములైనవాడు * నిగిడి = విజృంభించి**

50 సంఖ్య : 443 సంపుటము: 15 పుట: 298 రాగం: లలిత

**పల్లవి:** **కటకటా యీ యాత్మ లేగతి నీడేరఁ గలరు**
**యిటు నీకు శరణంటే యిట్టే రక్షింతువు**

**చ. 1:** **చేరి నీ మహిమ చిరజీవుల నడిగే మంటే**
**ఆ రీతి జీవులు బ్రహ్మాదిదేవత లింతే**
**వారఁ దమపుట్టిన యవ్వలగాని తొల్లింటి**
**నీ రూప మింతింతని నిశ్చయింప లేరు**

**చ. 2:** **అందరికి శ్రుతులే ఆధార మనాదినుండి**
**పొందుగా నడిగే మంటే పొడచూప వదియును**
**కందువ ఋషులపారంపర్యముల వచ్చె నింతే**
**అందరియర్థములు నిశ్చయము సేయ లేరు**

**చ. 3:** **అదిగాన యెంచి సనకాదులు శుకాదులును**
**మొదలనే నినుఁ గొల్చి ముక్త లనిపించుకొనిరి**
**అదనఁ దక్కిన వుపాయముల నింత వున్నదా**
**పదిల మలమేల్మంగపతి శ్రీవేంకటేశా**

**భావదీపిక:**

పెదతిరుమలయ్య ఒక చక్కటి అధ్యాత్మ కీర్తన వినిపిస్తున్నారు. అయ్యయ్యో! ఈ ఆత్మలు యేవిధముగా కడతేరి ముక్తిని పొందుతాయి? ఇటు ఆలోచిస్తే నీకు శరణంటే బహుతేలికగా రక్షిస్తావు కదా! ఘోర తపస్సులూ, ఘనమైన యజ్ఞయాగాలూ వేదాధ్యయనాలూ యెందుకు? ఈ సులభోపాయం చేపట్టరాదా! అంటున్నారు. పోనీ నీ మహిమ చిరంజీవులనడిగి తెలుసుకోవాలంటే, వారు బ్రహ్మాదిదేవతలని పేరేగాని, వారూ జీవులేకదా! వారుకూడా తమకొక దేహము లభించిన తరువాతగాని నీ తొల్లిటి రూపం యిట్టిదని గ్రహించలేకపోయారు. అనాదికాలంనుండి అందరికీ వేదములే జ్ఞానానికి ఆధారం పోనీ వాటి నడిగి ఈ ఆత్మలెలా వుద్ధరింపబడతాయో తెలిసికొందామంటే సృష్ట్యాదిలో వేదములెక్కడివి? అవన్నీ మహాఋషుల పారంపర్యములో నుండి వచ్చినవి. అంతేకదా! ఒక్కొక్కరు ఒక్కొక్క వేదము చెప్పారనుకొన్నా అందరి యర్థమూ వొకేలా వుండదు కదా! దేవా! అందువలననే సనకసనందనాది బ్రహ్మ మానసపుత్రులు, శుకుడు, శౌనికుడు మొదలైన ఋషులు మొదటినుండె నిన్ను కొలిచి ముక్తులైనారు. తపస్సు, యజ్ఞయాగాదులవంటి ఇతర వుపాయాలు తేలిక కావు. అలమేల్మంగపతివైన వోశ్రీవేంకటేశ్వరా! వాటన్నిటి కంటె నీ శరణాగతియే వుత్తమోత్తమము.

*** అదిగాన = అందువలన, * అదన = తగిన వేళలో**

51 సంఖ్య : 367 సంపుటము: 3 పుట: 247 రాగం: శుద్ధవసంతం

**పల్లవి: కడనుండే విజ్ఞానికిఁ గా దిటువలెను**
**వొడలి రోఁతలు చూచి వూరకైనా నవ్వును**

**చ. 1: ఆఱడిఁ బాము గరచినట్టివాఁడు దినఁబోతే**
**జాఱని వేఁప చేఁదైనాఁ జప్పనై తోఁచు**
**వీటిడై సంసారపువిష మెక్కినవానికి**
**చూఱలై హేయకాంతలు సుఖములై తోఁచును**

**చ. 2: చెంగట వెట్టివానికి చేసిన చేఁతలెల్ల**
**తొంగలించి వివేకాలై తోఁచినట్లు**
**మింగుచుఁ గర్మపు నాము మేసిన సంసారికి**
**అంగడి కర్మమే బ్రహ్మమై తోఁచును**

**చ. 3: జగమిది యొక్కటే చవులు వేరేవేరే**
**మొగి నెఱుకమఱపు ముడిచున్నది**
**పగటు శ్రీవేంకటేశుఁ బట్టి కొలువనివాఁడు**
**తెగని మాయలలోనఁ దేలాడవలసె**

**భావదీపిక:**

అన్నమాచార్యుల వారు వినిపిస్తున్న అధ్యాత్మిక కీర్తన నాస్వాదించండి. ఈ పల్లవిని ఇలా అర్థంచేసికోవాలి. జీవులందరికీ దేహాభిమానము సహజమే. వారికి తమ వొడలి (దేహము)పై రోత (యేవగింపు) యెన్నటికీ కలుగదు. కానీ మోక్షపు అంచులదాకా చేరుకున్న ఆత్మజ్ఞానికి ఇట్లా కాదు. ఆతడు ఈ రోతలు చూచి వూరకనే నవ్వుకొంటాడు. ఎలాగంటే పాము కఱచి విషం యెక్కిన వానికి వేప చేదు తెలియదు. అది వాడికి చప్పగానుంటుంది. అవివేకియై సంసారపు విషము తలకెక్కినవానికి జుగుప్సాకరమైన స్త్రీ సంభోగము కూడా సుఖముగా తోస్తుంది కదా! ఒక వెట్టివానికి తాను చేసిన వెట్టిపనులే వివేకవంతములైన పనులవలె తోస్తాయి కదా! ఎలాగంటే సంసారులు తాము చేసిన పురాకృత కర్మ అనే నాము (జొన్నకంకుల విషము) మేస్తూ కూడా తమ అంగడి కర్మలు (బాహ్య కర్మలు) బ్రహ్మజ్ఞాని చేసే కర్మల వలె తోస్తుంటాయి. వారు తామె జ్ఞానులమనుకుంటారు. ఈ జగత్తు యంత విచిత్రమైనదంటే... దీంట్లో రకరకాలైన రుచులు కనిపిస్తూ ఉంటాయి. ఒకప్పుడు అన్నీ తెలిసినట్లుంటుంది. మరొకప్పుడు యేమీ తెలియనట్టుంటుంది. పగటు (శోభలీను) శ్రీవేంకటేశ్వరుని పూని కొలువని వాడు అంతులేని "మాయ"లో తగులుకొని తేలియాడవలసి వస్తున్నది కదా!

*** వీటిడి = అవివేకము, * తొంగలించి = అతిశయించి**

52 సంఖ్య : 381 సంపుటము: 17 పుట: 221 రాగం: వరాళి

**పల్లవి:** **కలకలనవ్వుతోడ కలికిచూపులతోడ**
**అలబలములు చేసీ నలమేలుమంగ**

**చ. 1:** **బోన మింటిలోననుండి పొద్దు వొద్దు హరికిని**
**సేనగా వింతచవులు సేయించి**
**తానే వడ్డించేవంటా తగఁ గీలుగంటుతోడ**
**ఆనిపట్టి కాచుకున్న దలమేలుమంగ**

**చ. 2:** **పెక్కు సొమ్ములు నించుక పెద్ద పైఁడిపీఁటమీఁద**
**చక్కఁగఁ గూర్చుండి పరిచారకులతో**
**ఉక్కుమీఁరఁ బనులెల్లా వూడిగేలవారిచేత**
**నక్కరతోఁ జేయించీ నలమేలుమంగ**

**చ. 3:** **శ్రీవేంకటపతికి చేసురటి విసరుతా**
**వావిరిఁ దనచెలుల వడ్డించు మని**
**దేవుఁడు తన చేయి వట్టి తియ్యగాఁ బొత్తుననుండి**
**యావిదాన నారగించె నలమేలుమంగ**

**భావదీపిక:**

పెద తిరుమలయ్య అలమేలుమంగమ్మ పై వినిపించిన సరస కీర్తననాస్వాదిద్దాం. ఆ దేవి కలకలమని నవ్వుతుందట. మనోహరమైన చూపులతోడ (రూపముతో) వున్నదా దేవి. అట్టి అలమేలుమంగ అలబలములు చేసే (సందడి చేయుచున్నది). ఆమె బోనమింటిలోనుండి(వంట యింటిలోనికి వెళ్ళి) పొద్దుబోయినదాకా శ్రీహరి కోసం సేనగా (వరుసగా) అనేక వింత రుచులుగల పిండివంటలు చేయించినది. అయితే తన పతికి తానే వడ్డిస్తుందామె. అప్పుడు తన కేశపాశమును కీలుగంటుతో (జారుముడితో) బిగిస్తుంది. ఆ విధంగా సిద్ధమై దిటవుతో కాచుకొనివున్నదా దేవి. ఆమె అనేకమైన ఆభరణములను ధరించి పెద్ద బంగారపు పీట మీద కూర్చొనియున్నది. ఉక్కుమీర (అతిశయముతో) తన పరిచారికలకు, వూడిగముల వారికి అవసరాన్ని బట్టి పనులు పురమాయించుచున్నది దేవి అలమేలుమంగ. శ్రీవేంకటేశ్వరునికి సురటితో (వింజామరుతో) విసురుచూ, తనవెన్నంటి వుండే చెలికత్తెలను తనకు వడ్డించమని దేవదేవుడు తన చేయిపట్టి దగ్గర కూర్చొన బెట్టుకొంటే ఆయన పొత్తున ఆమె కూర్చున్నది. ఆ విధంగా దేవి అలమేల్మంగ ఆరగించినది.

*** ఆనిపట్టి = దిటువుతో, * వావిరి = వెన్నంటివుండే**

53 సంఖ్య : 304 సంపుటము: 15 పుట: 205 రాగం: సాళంగనాట

**పల్లవి:** **కాలమందే నీ దాసులై కడు ధీరులౌట గాక**
**యీలాగున మోసపోతి నేమిటా నే మున్నది**

**చ. 1:** **పొనిఁగి యింద్రునినై నాఁ బోనీదు కోపము**
**మునుకొని రుద్రునైనా ముంచుఁ గోపము**
**వెనుకొని బ్రహ్మనైనా విడువదు కోపము**
**మనికియైన దేవత్వమహిమ యే మున్నది**

**చ. 2:** **వడి విశ్వామిత్రునంతవానికి రేఁగెఁ గోపము**
**కెడపి దుర్వాసునిఁ జిక్కించెఁ గోపము**
**యెడనెడ మునులను యేమరించుఁ గోపము**
**బడిఁ దపసుల బల్మి పలుక నే మున్నది**

**చ. 3:** **కచ్చు పెట్టి ధర్మజునిఁ గనలించెఁ గోపము**
**కొచ్చి కార్తవీర్యుఁ బురికొల్పెఁ గోపము**
**నిచ్చలు శ్రీవేంకటేశ నీవే శాంత మిచ్చితి గా**
**కిచ్చల రాజ్యపదవి యెంచ నే మున్నది**

**భావదీపిక:**

పెదతిరుమలయ్య వినిపిస్తున్న ఈ అధ్యాత్మ కీర్తనలో యేమంటున్నారో ఆలకించండి. భగవంతుని సేవించాలనే బుద్ధి తరుణప్రాయంలో కలగాలి కాని ముసలితనంలో కాళ్లు చేతులు ఆడనప్పుడు వస్తే లాభమేమిటి? ప్రభూ! మంచి కాలమందు నీదాసులై గొప్ప ధీరులవ్వాలి గాని అప్పుడిలా మోసపోయి తరువాత విచారించి లాభమేమిటి? అంటున్నారు. కోపము మహా చెడ్డది. అది దేవేంద్రునైనా వదలిపెట్టదు. శివుని గూడా కోపము చెడగొట్టగలిగింది. సృష్టికర్త అయిన బ్రహ్మకూడా కోపానికి లొంగక తప్పదు. మరి అటువంటప్పుడు దైవత్వము సిద్ధించినా ప్రయోజనమేమిటి? విశ్వామిత్రుడు శ్రీరామచంద్రునికే గురువు. కానీ కోపాన్ని అణుచుకోలేక ఆయన యెన్నోసార్లు, తన తపశ్శక్తిని పోగొట్టుకొన్నాడు. దూర్వాసమహాముని కూడా కోపానికి వృధాగా తన తపశ్శక్తిని ధారపోశాడు. ఎంతటి మునులనైనా కోపము ఏమరింప చేస్తుంది. ద్రౌపది వస్త్రాపహరణం సమయంలో ధర్మరాజంతటి వానిని కోపము రగిలిస్తే ఆయన తనవలన నాశనం జరగరాదని కళ్లుమూసుకొనినాడు. కార్తవీర్యార్జునుడంతటి వాడిని చెడగొట్టి చావునిచ్చింది కోపము. ఓ శ్రీవేంకటేశ్వరా! నాకు కోపం పోగొట్టి శాంతమూర్తిని చేశావు. ఇదిచాలు రాజ్యపదవి యెందుకు దాంట్లో యేమున్నది?

*** పొనిగి = పూని, * కొచ్చి = కసితో**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

54 సంఖ్య : 63 సంపుటము: 1 పుట: 42 రాగం: సామంతం

**పల్లవి: కాలవిశేషమో లోకముగతియో సన్మార్గంబుల-**
**కీలు వదలె సౌజన్యము కిందయిపోయినది**

**చ. 1: ఇందెక్కడి సంసారం, బేదెసఁ జూచిన ధర్మము**
**కందయినది, విజ్ఞానము కడకుఁ దొలంగినది,**
**గొందులు దరిఁబడె, శాంతము కొంచెంబాయ, వివేకము**
**మందుకు వెదకినఁ గానము మంచితనంపుఁబనులు**

**చ. 2: మఱి యింక నేఁటివిచారము, మాలిన్యంబైపోయిన-**
**వెఱుకలు, సంతోషమునకు నెడమే లేదాయ,**
**కొఱమాలెను నిజమంతయు, కొండలకేఁగెను సత్యము,**
**మఱఁగైపోయను వినుకులు, మతిమాలెను తెలివి**

**చ. 3: తమకిఁక నెక్కడిబ్రదుకులు, తడఁబడె నాచారంబులు,**
**సమమైపోయిన వప్పుడె జాతివిడంబములు**
**తిమిరంబింతయుఁ బాపఁగఁ దిరువేంకటగిరి లక్ష్మీ-**
**రమణుఁడు గతిదప్పను కలరచనేమియు లేదు**

**భావదీపిక:**

అన్నమయ్య కాలమహిమ వలన కలిగే అపశృతులను పేర్కొంటూ, ఇది కాలవిశేషమో లేక లోకముల గతియే మారిపోయిందో లేక సన్మార్గము కదలికనే మార్చుకొన్నదో లేక సౌజన్యము (మంచితనము) కిందపడెనో (అడుగంటి పోయిందో!!) తెలియ వచ్చుటలేదు, అంటున్నారు. ఈ లోకంలో సంసారమెట్లా నడుస్తుంది? ఎక్కడ చూచినా ధర్మము కందిపోయింది. భగవంతునియొక్క జ్ఞానము అడుగంటింది. గొందులు (వక్రమార్గములు) దరిబడె (గట్టెక్కాయి). శాంతము కొంచెమైపోయింది. మంచితనము అనేది మందుకోసం గాలించినట్లు గాలించినా కనబడుటలేదు. ఇటువంటి పరిస్థితులలో ఇంకా ఆలోచనలు మాత్రం మంచిగా యెలా వుంటాయి? ఎఱుకలు మాలిన్యమౌతాయి (విచక్షణ మట్టిలో కలుస్తుంది) సంతోషము సవ్యంగా వుండదు. నిజమంతయు నిరుపయోగమైపోతుంది. సత్యము కొండలు, గుట్టలు బట్టి పోతుంది. మంచి వినేవాడు మరుగున పడిపోతాడు. ఇక తెలివి తెల్లవారక యేమవుతుంది? ఇక తమరి బ్రతుకులెక్కడికి పోతాయి? ఎందుకంటే తమరి ఆచారము తడబడి పోతుంది. జాతిలోఅనుకరించేవారు లేక జాతులు అడుగంటిపోతాయి. మరి ఈ కారుచీకట్లను పారదోలే వాడు యెవరయ్యా? శ్రీవేంకటేశ్వరుడే. ఆయన చేతిలో లేని రచనయేలేదు.

**గమనిక:** అన్నమయ్య కాలమే కలికాలం అవుతే, నేటికాలం కలకలం కాక మరేమవుతుంది?

55 సంఖ్య : 240 సంపుటము: 15 పుట: 162 రాగం: దేశళం

**పల్లవి:** **కొల్లవలపులు చల్లే గోవిందరాజ నిన్ను**
**గొల్లెతలు నవ్వేరు గోవిందరాజ**

**చ. 1:** **గొప్పలు మా చన్ను లివి గోవిందరాజ నిన్ను**
**కుప్పెలవలె నొత్తీని గోవిందరాజు**
**కుప్పించి బిగించకు వో గోవిందరాజ మేనఁ**
**గుప్పళించీ పెంజెమట గోవిందరాజ**

**చ. 2:** **కొనగోరి సతులము గోవిందరాజ పై**
**కొనిపాదాలు చాఁచేవు గోవిందరాజ**
**కొనబు మాట లేలోయి గోవిందరాజ నీతో**
**గునిసి మానే మింక గోవిందరాజ**

**చ. 3:** **కోడెమనసువారము గోవిందరాజ మాపై**
**గూడలఁ జల్లేవు సిగ్గు గోవిందరాజ**
**కూడితి శ్రీవేంకటాద్రి గోవిందరాజ యిట్టె**
**కోడి గూసెఁ దెల్లవారె గోవిందరాజ**

**భావదీపిక:**

పెదతిరుమలయ్య వినిపిస్తున్న ఈ కీర్తన, అధ్యాత్మ కీర్తనల సంపుటిలో నున్న శృంగార కీర్తన. తన తండ్రి ఒరవడి ప్రస్ఫుటంగా ప్రతిబింబించేటట్లు దీనిని చెప్పారు పెదతిరుమల. కొల్లవలపు (దోపిడి చేసే ప్రేమ మత్తు) చల్లె వో గోవిందరాజా! నిన్ను చూచి గోపికలంతా నవ్వు చున్నారయ్యా!! గోవిందరాజా! ఓగోవిందరాజా! మా కుచగిరులు కడు వున్నతములు. నిన్ను వాటితో మూకుమ్మడిగా వొత్తెదము. నిన్ను యెగసి బిగింతుము. మేనిపై పెనుచెమటలు మిక్కుటముగా కమ్మిన వో గోవిందరాజా! నిన్ను జూచి గొల్లెతలు నవ్వేరయ్యా! ఓ గోవిందరాజా! మేము వాడియైన గోళ్ళున్న సతులము. ఎంత ధైర్యంతో మా వొడిలోనికి నీ పాదాలను జాచుచున్నావు? గోవిందరాజా! నీకు ఈ కొనబు మాటలు (సొగసైన పలుకులు) యెట్లా వచ్చాయయ్యా? మేము కూడా ఇకపై నీతో ఆందోళన కలిగించేటట్లు మాట్లాడము. ఓ గోవిందరాజా! కోడెమనసు (చెలరేగేచిత్తము) గల కొమ్మలమయ్యా మేము. మాపై సిగ్గులను వెదజల్లుచున్నావు. ఓ శ్రీ వేంకటాద్రి గోవింద రాజా! తెల్లవారి కోడికూసేదాకా నన్ను (పెదతిరుమలయ్య ఊహాసుందరి) కూడినావు. ధన్యురాలను స్వామీ!

**కుప్పళించు = అధికముగా కమ్మిన, * గునిసి =** ఆందోళన కలిగించి

56 సంఖ్య : 118 సంపుటము: 2 పుట: 79 రాగం: కులహరి

**పల్లవి:** **కొనమొద లేదో గుఱిగాన రొరులు**
**మునుకొను సంసారమోహాంధమందు**

**చ. 1:** **తలఁచను బ్రహ్మాండతతులకు నవ్వల**
**తలఁచేటి జీవుఁడు తా నణువు**
**అలరిన యాసల ననలునుఁ గొనలును**
**వెలసీ సంసారవృక్షములోన**

**చ. 2:** **పుట్టునుఁ బొదలును భువి బహురూపుల**
**పుట్టేటి యాతఁడు పొరి నొకఁడే**
**వొట్టుక యీఁదును వుభయకర్మముల**
**చట్టెడు సంసారసాగరములను**

**చ. 3:** **తగులు నన్నిటా తనుభోగంబుల**
**తగిలేటి పురుషుఁడు తా ఘనుఁడు**
**నిగిడి శ్రీవేంకటనిలయుఁడు గతైతే**
**అగపడ సంసారానందమందు**

**భావదీపిక:**

అన్నమయ్య బహుసుగమమైన వేదాంతం బోధిస్తున్నారు. మునుముందే సంసార మోహములో గుడ్డివారైన బడుగులు మొదలేదో తుదియేదో లక్ష్యం తెలియక అల్లాడుతుంటారు. అనంతమైన బ్రహ్మాండాల ఆవల యేమున్నదో ఆలోచించే జీవుడు ఆ బ్రహ్మాండముతో పోల్చి చూచిన తాను అణుమాత్రుడని గ్రహించాలి. మరి వాడుండే ఈ సంసారవృక్షము యెట్లా వర్ధిల్లుతుందో తెలుసా? ఇది ఆశలు అనే అగ్నికీలల్లో వర్ధిల్లుతున్నది. ఈభూమి మీద ఇంతమంది పుట్టి పెరుగుతున్నట్లు కనిపిస్తున్నా వీళ్ళంతా వివిధ రూపాలలో తిరిగే బహువేషధారులు. కాని ఆలోచిస్తే వీరందరిలోని చైతన్యమూర్తి వొక్కడే. వాడే అంతరాత్ముడు. వాడు యేదో వొక దేహం ధరించి తనవెంట కొనితెచ్చుకున్న ఉభయకర్మలను (సంచిత కర్మలు, ప్రారబ్ధకర్మలు) అనుభవిస్తుంటాడు. చట్టెడు సంసారసాగరములో మునిగి తేలుతుంటాడు. అన్ని భోగాలు తనకే కావాలని తగులుకొను పురుషుడు (ఆత్మ) నిజానికి ఘనుడెప్పుడవుతాడంటే తనకు శ్రీవేంకటేశుడే గతియని తెలుసుకొన్ననాడు. ఆనాడు ఆయనే అగపడి బ్రహ్మానందప్రాప్తి కలుగుతుంది.

*** చట్టి = వెడల్పు మూతిగల మట్టిపాత్ర * నిగిడి = వ్యాపించిన**

57 సంఖ్య : 101 సంపుటము:2 పుట: 68 రాగం: మలహరి

**పల్లవి:** **కోరి మాభుజముల డాగులు మోచుకున్నారము**
**ధారుణిలోపల మమ్ము దయఁజూచుఁ గాక**

**చ. 1:** **సతతము హరిచేతి శంఖచక్రములే**
**గతియై మాపాలనుండి కాచుఁ గాక**
**అతిరయమైనట్టిఅచ్యుతుని ఆయుధాలే**
**హితవుగ మమ్ము నిట్టె యేలుఁ గాక**

**చ. 2:** **కమలాపతిచేతుల గదాపద్మములు**
**మమకారముతో మము మన్నించుఁ గాక**
**సమరవిజయమైన శార్ఙ్గాదిశరములు**
**తమితోడ మాకు దాపుదండై వుండుఁ గాక**

**చ. 3:** **ముంచి శ్రీవేంకటేశుఁడు మొలఁగట్టిన కతారు**
**అంచెల మాకెల్ల రక్షై అమరుఁ గాక**
**అంచ నీతని కైదువులమరిన హస్తములు**
**పంచల మాకిట్టే వజ్రపంజరా లవుఁ గాక**

**భావదీపిక:**

భక్తి జాలువారే కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. మేము కోర్కెతో మా భుజములపై శంఖు చక్రముల డాగులను (గుర్తులను) మోచుకున్నారము (ధరించి యున్నాము) ధారుణి లోపలగల జీవులమైన మమ్ము అవి దయజూచుగాక! సతతము హరిచేతుల నలంకరించు శంఖ చక్రములే గతియై మాపట్ల నుండి కాపాడుగాక! ఈ శంఖచక్రముల గుర్తులు అచ్యుతుని అతివేగముగల ఆయుధములై హితవుగా మమ్ము పరిపాలించి రక్షించుగాక! కమలాపతియైన శ్రీహరి చేతిలోని కౌమోదకి అను గద మరియు పద్మములు మమకారముతో మమ్ము మన్నించుగాక! సమరములందు విజయ కారకమైన "శార్ఙ్గము" అను విల్లునంబులు ప్రీతితో మాకు దాపుదండై (అండదండవలె) వుండుగాక! అతిశయించిన శ్రీవేంకటేశ్వరుడు తన మొలకు కట్టుకొనిన నందకము అను ఖడ్గము మాకందరికీ క్రమముగా రక్షయై అమరియుండుగాక! ఆవిధముగా ఇతని చేతులలో అమరిన సకలాయుధములు మాకు చేరువయై వజ్ర పంజరాలవుగాక! (వజ్రముతో చేసిన పంజరములై మమ్ము రక్షించు గాక!)

*** ముంచి = అతిశయించి, * కతారు = ఖడ్గము**

58 సంఖ్య : 176 సంపుటము: 1 పుట: 118 రాగం: శ్రీరాగం

**పల్లవి:** **కోరికె దీరుట యెన్నఁడు గుణమును నవగుణమునుఁ జెడి**
**వూరక యీమది నీపై నుండుట యెన్నఁడొకో**

**చ. 1:** **చిత్తం బాఁకలి దీరదు, చింత దలంపునఁ బాయదు**
**యెత్తిన పరితాపమునకు నేదీ మితిమేర**
**హత్తిన పుణ్యము బాపము నప్పటి సుఖముల కొరకే**
**వత్తికి నూనెఁకు గొలఁదై వడిఁ జనె దివసములు**

**చ. 2:** **జీవుఁడె పరతంత్రుఁడుగన చింతింపఁడు నిన్నెప్పుడు**
**చావునుఁ బుట్టుగు సహజము శరీరధారులకు**
**శ్రీవనితాహృదయేశ్వర శ్రీవేంకటగిరివల్లభ**
**పావనమతిమై ప్రాణులు బ్రదుకుట యెన్నఁడొకో**

**భావదీపిక:**

అన్నమయ్య ఆవేదనతో యేమంటున్నారో వినండి. దేవదేవా! ఈ జీవునికి అంతులేని కోరికలు దీరుట యెన్నడు? నిష్కామ సిద్ధి కలుగుట యెన్నడు? సద్గుణములు గాని దుర్గుణములు గాని నన్ను మభ్యపెట్టక గుణాతీతుడనై వూరకనే యీ మనస్సును నీపై లగ్నం చేయగల స్థితి యెన్నడు కలుగుతుందో కదా! ఈ చిత్తమునకు కోరికల "ఆకలి" తీరనే తీరదు. తలంపుల యందు చింత (విచారము) పోనేపోదు. ఉత్తుంగ తరంగమైన ఆవేదనకు మితిగాని హద్దుగాని లేదు. పోనీ పాప పుణ్యాల ఫలాన్ని నీకు అర్పణ చేస్తానా అంటే అదీ చేయను. అవి మరల మరల సుఖాపేక్షతోనే చేస్తున్నాను. వత్తికి నూనెకు కొలదై (పాప పుణ్యాలు రెండూ, ఒకదానికొకటి సరిపోయాయి) పాప ఫలమూ లేదు పుణ్యఫలమూ లేదు. రోజులు దొర్లిపోతున్నాయి. నా జీవుడు పరతంత్రుడు (అస్వతంత్రుడు). వాడు నిన్నుయెన్నడూ చింతించడు. శరీరధారులకు చావు పుట్టుకలు తప్పవని నీవే భగవద్గీతలో చెప్పావు. శ్రీవనితావల్లభుడవైన శ్రీవేంకటేశ్వరా! నీవు సృష్టించిన ఈ ప్రాణులు పుణ్యాత్ములై బ్రతుకుట యెన్నడు తండ్రీ?

*** హత్తిన = పొందిన * శరీరధారులు = ప్రాణులు**

59 సంఖ్య : 26 సంపుటము: 2 పుట: 18 రాగం: సాళంగం

**పల్లవి:** **జ్ఞానులాల యోగులాల సకలవిరక్తులాల**
**నానావిధాల నివి నమ్మేరు సుండి**

**చ. 1:** **అలరి యింతుల యధరామృతము లివియెల్ల**
**కాలకూటవిషముల కరణి సుండి**
**శీలముతో వీరల చెట్టలు వట్టుటలెల్లా**
**బాలనాగాలఁ దొడికి పట్టుట సుండి**

**చ. 2:** **కాంతలు నవ్వుచునైనాఁ గన్నులఁ జూచిన చూపు**
**పంతమున నలుగుల పాఁతర సుండి**
**బంతుల నెదుటనున్న పడఁతుల చన్ను లివి**
**కంతల నొడ్డిన బడిగండ్లు సుండి**

**చ. 3:** **జవ్వనపుఁ గామినుల సరసపు మాటలెల్లా**
**మవ్వమైనయట్టి చొక్కు మంత్రాలు సుండి**
**యివ్వలను శ్రీవేంకటేశ్వరుదాసుల కివి**
**చివ్వనఁ జెప్పినట్టు చేసేవి సుండి**

**భావదీపిక:**

ఈ వైరాగ్య కీర్తనలో అన్నమయ్య వనితల వ్యామోహంలో తల్లిదండ్రులను, గురువును, దైవాన్ని మఱచిపోయే మానవులను జ్ఞానులారా! యోగులారా! సర్వ విరక్తులారా! అని సంబోధిస్తూనే, నేను చెప్పబోయే వీటిని నమ్మేరు సుమా! అనేకవిధాలుగా చెడిపోతారు. జాగ్రత్త అని హెచ్చరిస్తున్నారు. సుండి అంటే సుమా! అని అర్థం. ఇంతుల అధరామృతం తియ్యగా వుంటుందని మురిసిపోకండి. అది కాలకూట విషము వంటిది సుమా! అదేపనిగా వాళ్ల చేతులతో మీ చేతులు కలపటం బాల నాగాలను (పాము పిల్లలను) ఒడిసి పట్టుకోవటం వంటిదే సుమా! కాంతలు నవ్వుతూనే సోగ కన్నులతో మిమ్మల్ని చూశారంటే అది వాళ్లు పంతముతో మిమ్మల్ని పీడించటానికి వేసే పాతరవంటిది సుమా! బంతుల (వరుసలో) మీ యెదుటనున్న పడతుల స్తనయుగ్మము మిమ్మల్ని అడ్డగించే బండరాళ్లు సుమా! యౌవనములోనున్న కామినుల (స్త్రీల) సరసోక్తులు వశీకరణ మంత్రాలుసుమా! ఇదంతా సుఖలాలసులైన పురుషులకే చెల్లును. కాని శ్రీవేంకటేశ్వరుని దాసులైన వారికి వీరంతా చెప్పినట్లు చేసే భయ భక్తులున్న అబలలు మాత్రమే సుమా!

*** నలుగు = పీడించు, * బడిగండ్లు = బండరాళ్లు**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

60 సంఖ్య : 389 సంపుటము: 3 పుట: 262 రాగం: లలిత

**పల్లవి:** **చంకగుదియ యిదే శరణార్తి నే నిదే**
**తెంకి నా భావము దేవుఁడే యెరుఁగు**

**చ. 1:** **కోరెడి చిత్తము కోరక మానదు**
**వైరాగ్యము నే వదలను**
**యీరీతి దినములు యిట్లనే కడచీ**
**తేరిన పను లిఁక దేవుఁడే యెరుఁగు**

**చ. 2:** **తగు సంసారము తనువునఁ బెనఁగీ**
**వెగటై మోక్షము వెదకేను**
**పగటున రెంటాఁ బరగిన జీవుఁడు**
**తెగువలుఁ దగులమి దేవుఁడే యెరుఁగు**

**చ. 3:** **పంచేంద్రియములు పారీ నిక్కడ**
**పెంచఁ బెద్దనై పెరిగేను**
**అంచెల శ్రీవేంకటాధిపుఁ గొలిచితి**
**దించని యీమాయ దేవుఁడే యెరుఁగు**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన అధ్యాత్మిక కీర్తన నర్థం చేసికొనే ప్రయత్నం చేద్దాము. చంకగుదియ అంటే చంకలో పెట్టుకొని మనవెంట కొనిపోయే దుడ్డుకఱ్ఱ (నేటి కాలంలో లాఠీ లాంటిది). ఇదే (ఈ శ్రీవేంకటేశుని శరణాగతి) చంకగుదియే, నేను మాత్రం చంకగుదియ శరణార్తిని (నమ్మదగనివాడిని). స్థిరమైన నా భావమేమిటో ఆ దేవుడే యెరుగును. ఎందుకంటే, నేనెంత వైరాగ్యం కావాలనుకొన్నా నా మనస్సు మాత్రం యేవేవో కోరికలను కోరుతూనే వుంటుంది. అయినా నేను వైరాగ్యాన్ని వదలను. ఒకటొక్కటిగా రోజులు గడచిపోతూనే వున్నాయి. తేరిన పనులు (శ్రమలేని పనులైన శరణాగతి, సన్నుతి) ఆ దేవుడే యెరుగును. ఈ సంసారముతో నా తనువు పెనగీ పెనగీ ఇదంటే వెగటు పుట్టి, ఇక మోక్షం కావాలని వెదకులాడుతున్నాను. మురిపెముగా, ఆ రెండూ కావాలనుకొనే జీవుడి యొక్క తెగువలు (విడిపోగల సాహసము) యెంతో, తగులమి (విపరీతమైన ఆసక్తి) యెంతో ఆ దేవుడే యెఱుగును. పంచేంద్రియములు కలిగించే ఉద్ధతితోనే పెరిగి పెద్దవాడినైనాను. నేడు, మరీ ఈ మధ్య శ్రీవేంకటేశ్వరుని కొలుచుట నారంభించాను. తగ్గించలేని ఈ దేవదేవుని మాయను యెరిగినది ఈ దేవుడొక్కడే.

*** పగటున = మురిపెముతో, * తెంకి = స్థిరమైన**

61 సంఖ్య : 110 సంపుటము: 1 పుట: 76 రాగం: సామంతం

**పల్లవి:** **చాలదా మా జన్మము నీ-**
**పాలింటివారమై బ్రతుకఁగఁ గలిగె**

**చ. 1:** **కమలాసనాదులు గానని నీపై**
**మమకారము సేయ మార్గము గలిగె**
**అమరేంద్రాదుల కందరాని నీ-**
**కొమరైన నామము కొనియాడఁ గలిగె**

**చ. 2:** **సనకాదులును గానఁజాలని నిన్నుఁ**
**తనివోవ మతిలోనఁ దలపోయఁ గలిగె**
**ఘనమునీంద్రులకు నగమ్యమైవున్న-**
**నిను సంతతమును వర్ణింపఁగలిగె**

**చ. 3:** **పరమమై భవ్యమై పరిగిననీ-**
**యిరవిట్టిదని మాకు నెఱుఁగంగఁ గలిగె**
**తిరువేంకటాచలాధిప నిన్ను యీ-**
**ధరమీఁదఁ బలుమారు దరిసింపఁ గలిగె**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ పల్లవినే ఈనాటి తెలుగులో చెప్పాలంటే తండ్రీ! నీపాలింటివారమై (సంబంధించిన పాలివారము) బ్రతుక గలిగితే, మాకు ఈ జన్మకు ఆ భాగ్యము చాలదా? ఇంకా యేమి కావాలి మాకు? మా భాగ్యము నేమని వర్ణించగలను ప్రభూ? కమలాసనుడైన బ్రహ్మ వంటి వారికి కూడా నీ నిజదర్శనము దుర్లభమే. అట్టి నీపై మా మమకారము వెల్లడించే అపురూపమైన కీర్తనలు చెప్పగలుగుట సాధ్యపడింది. దేవేంద్రాదులకే అసాధ్యమైన నీ నామస్మరణతో నిన్ను కొనియాడుచున్నవారము. సనకసనందనాది ఋషులకు కూడా నిన్ను సులభముగా కానజాలరు. (చూడలేరు). కాని నేను తనివిదీరునట్లు నామదిలో నిన్ను స్మరించగలుగుతున్నాను. ఘనులైన మునీంద్రులకు సైతము నీవు అగమ్యమైనవాడవు. కాని నేను నిన్ను మనసారా వర్ణించగలుగుతున్నాను. నీవు సర్వశ్రేష్టుడవు. నీవు శుభప్రదమైన వాడవు. నీ వునికి ఇట్టిదని గ్రహించగలిగాను. ఓ తిరువేంకటాచలపతీ! నిన్ను ఈ ధరాతలముననే వున్న తిరుమలలో పలుమార్లు దర్శించే భాగ్యము కలిగింది. ఈ జన్మకిది చాలును తండ్రీ!

* **కొమరైన = మనోజ్ఞమైన,** * **భవ్యము** = శుభప్రదము

62 సంఖ్య : 96 సంపుటము: 1 పుట: 66 రాగం: బౌళి

**పల్లవి:** **చూడరెవ్వరు దీనిసోద్యంబు**
**చూడఁజూడఁగ గాని సుఖ మెఱఁగరాదు**

**చ. 1:** **ఎడతెగని మమత వేయఁగరాని పెనుమోపు**
**కడలేనియాస చీఁకటిదవ్వుకొనుట**
**విడివై నకనుచూపు నీడనుండిన ౧యెండ**
**వడిచెడనితమకఁబు వట్టితాపంబు**

**చ. 2:** **బుద్ధి మానినచింత పోనియూరికిఁ దెరువు**
**పొద్దుపోవనివలపు పొట్టపొంకంబు**
**యెద్దుఁబట్టినసివం బెఱుకమాలినప్రియము-**
**లొద్దికవిహారంబు లుబ్బుఁగవణంలు**

**చ. 3:** **తీపులోపలితీపు తిరువేంకటేశ్వరుని-**
**చూపు, దనుఁబొడగననిచూపు లోచూపు,**
**ఆపదలువాయునెయ్యపుఁదలఁపు లీ(లో?) తలఁపు**
**రూపైనరుచిలోనిరుచి వివేకంబు**

**భావదీపిక:**

గొప్ప క్లిష్టమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. మనిషి జీవితంలో సుఖమనుకొన్నది సుఖం కాదు, మమతలు నిజమైనవి కావు, వలపు నిజమైనది కాదు, చింతి కూడా శాశ్వతం కాదు. ఇదంతా చోద్యమే. మరి దారేమిటి? ఈ ప్రపంచపు తీరుతెన్నులే ఒక గొప్ప చోద్యము. దీనినెవ్వరూ కనుగొనలేరు. దీంట్లో సుఖమనుకొన్నది నిజమైన సుఖం కాదు. జాగ్రత్తగా వివేకించి చూడగా చూడగా ఆ సుఖం తెలుస్తుంది. ఈ ప్రపంచంలో అంతులేని మమతను పెంచుకోవటం బరువు మోయలేని మోపును మోయటం వంటిది. అంతులేని ఆశపడటం కటిక చీకటిలో నేలను తవ్వడం లాంటిది. శ్రమేగాని ఫలితం వుండదు. ఇవి వున్నంతకాలం జ్ఞానదృష్టి రాదు. అది "నీడ నుండిన యెండ" (అసంభవమైన అనుభవమే).

విచక్షణలేని తన్మయత్వము వట్టి తాపమునే మిగులుస్తుంది. ఆలోచనలేని దుఃఖము "పోని ఊరికి తెరువు" (యెన్నడూ వెళ్లని వూరికి గల దారి) ఏమి చేయాలో తెలియదు. పొద్దెరగని వలపు గొప్ప కుదిరిక గలదానిలా వుంటుంది. కాని విచక్షణలేని వలపు మాత్రం "ఎద్దును బట్టిన సింహంలా" చంపేదాకా వదలదు. అందుచేత ఆ ప్రేమ విహారములన్నీ ఉప్పుమయమైన అన్నం ముద్దలాంటివి. మరేమిటయ్యా దారి? నామాట వినండి. తీపిగల వాటన్నింటిలో తీపి ఈ శ్రీవేంకటేశ్వరుని చూపు. అంతఃదృష్టితో ఈయనను చూడగలగటవే నిజమైన చూపు. ఈయన ధ్యానం ఆపదల రూపుమాపుతుంది. ఈయన వివేకము అంతులేని రుచి.

(గమనిక: రవ్వా శ్రీహరిగారి నిఘంటువే లేకపోతే, రవ్వంతైనా ఇది సాగదు)

* **వడిచెడని = తీవ్రత తగ్గని,** * **తీపులోపలితీపు** = మధురాతి మధురం

63 సంఖ్య : 132 సంపుటము: 15 పుట: 68 రాగం: నాట

**పల్లవి:** **చేరి మొక్కరో నరులు శ్రీమంతుఁడీతఁడు**
**కోరి వరము లిచ్చు కొండవంటి సింహము**

**చ. 1:** **గద్దెమీఁదఁ గూరుచుండి కనకకసిపుఁ జెండీ**
**గద్దరి ప్రహ్లాదునిపై కరుణనిండీ**
**వొద్దనె మారుగొండల వువిదయుఁ దాను నుండీ**
**తిద్దుకొనె మీసాలు దివ్యనారసింహుఁడు**

**చ. 2:** **భవనాశిదరి దొక్కి బ్రహ్మాదులలోన నిక్కి**
**తివిరి ప్రతాపమున దిక్కుల కెక్కి**
**రవళి నారదాదుల రంగుపాటలకుఁ జొక్కి**
**చెవు లాలించీ నుతులు శ్రీనారసింహుఁడు**

**చ. 3:** **అదె కంబములోఁ బుట్టి ఆయుధాలు చేతఁ బట్టి**
**వెదకి అహోబలాన వేడుకఁ బుట్టి**
**కదిసి శ్రీ వేంకటాద్రికాంతలలో గుంపుగట్టి**
**వెదచల్లు మహిమల వీరనారసింహుఁడు**

**భావదీపిక:**

పెదతిరుమలయ్య అహోబల నారసింహునిపై భక్తి ముప్పిరిగొన్న సంకీర్తన చెబుతున్నారు. విని తరించండి. నరులారా! ఈ లక్ష్మీ నృసింహుడు శ్రీమంతుడైనందున, కొండవంటి సింహమైనందున, కోరినవరములన్నీ యిచ్చును. కావున నేడే ఇతనిని చేరి మొక్కరయ్యా. సింహాసనమున కూర్చున్న ఈ దివ్య నరసింహుడు కనకకసిపుని (హిరణ్యకసిపుని) చెండీ (సంహరించాడు). గద్దరి (ఎదురు తిరిగి తండ్రిని కాదన్న) ప్రహ్లాదుని కరుణించినాడు. సమీపముననే యెదురుగా నున్న కొండపై వెలసి శ్రీలక్ష్మి తానూ ఆసీనులై తన మీసాలను దువ్వుకొంటున్నాడు. వీరిరువురూ భవనాసి నదీతీరమున త్రొక్కి (వెలసినవారై) బ్రహ్మాదులు కొలుచుచుండగా నొక్కి (ఉద్ధతితో) ఉన్నారు. ఇతగాని క్రోధముతో కూడిన ప్రతాపము దిక్కుల వ్యాపించినది. రమ్యమైన కీర్తనలను నారదుడు మొదలైనవారు ఆలపించగా ఈ స్వామి పరవశించియున్నాడు. ఈ నారసింహుడు చెవులను నిక్కబొడుచుకొని వాటిని వింటున్నాడు. అదిగో చూడండి. కంభంలో పుట్టి (స్తంభంనుండి వెలువడి) అనేక దివ్యాయుధములను ధరించి ఈ అహోబలమున వేడుకతో వెలసిన ఈ నారసింహుడే శ్రీ వేంకటాద్రి మీద కాంతలతో గుంపుగట్టి (శ్రీదేవి భూదేవి సమేతుడై) మహిమలను వెదజల్లుచున్నాడు.

*** కదిసి = దగ్గరనే ఉన్న, * తివిరి = క్రోధముతో కూడిన**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

64 సంఖ్య : 453 సంపుటము: 15 పుట: 305 రాగం: గుండక్రియ

**పల్లవి: జీవాత్ముని దీమముగాఁ జేసుక యిందరిఁ గూడుక**
**కావలి దిరిగెద రిందుకుఁ గర్తలి దెవ్వరొకో**

**చ. 1: పంచేంద్రియము లిదెవ్వరు పంచభూతము లెవ్వరు**
**పంచప్రాణములనియెడు ప్రభువు లి దెవ్వరొకో**
**పంచమహాపాతకములఁ బాట్లఁబడువా రెవ్వరు**
**పంచత్వంబునఁ బొందఁగ భారకు లెవ్వరొకో**

**చ. 2: తప్పక తిరువేంకటపతిఁ దలఁచెడివా రది యెవ్వరు**
**వొప్పగు సౌఖ్యము వొదగవ యోగ్యు లి దెవ్వరొకో**
**వొప్పుల తప్పుల చేఁతల నొడఁబడ నొల్లక సకలముఁ**
**దప్పించుక పుణ్యులు గాఁదగు వా రెవ్వరొకో**

**భావదీపిక:**

అన్నమాచార్యులవారు వినిపిస్తున్న చక్కటి అధ్యాత్మ కీర్తన నాస్వాదించండి. శ్రీరంగంలో నిక్షిప్తపరిచిన రాగిరేకుల నుంచి గ్రహింపబడిన కీర్తనలలో ఇదొకటి. కీర్తన చిన్నదే అయినా భావం మాత్రం సాటిలేనిదిగా వున్నది. పల్లవినిలా భావించవచ్చును. దీమము అంటే "ఇల్లు" అని అర్థం. జీవాత్మని తన ఇల్లుగా జేసికొని ఇంతమంది జీవులలో గూడుకొని, కావలి వానివలె తిరుగుతున్న "కర్త" యెవ్వరొకో (యెవ్వరై వుంటారబ్బా!!) ఈ దేహి యొక్క పంచేంద్రియములకు అధికారి ఎవ్వరు? పంచభూతములైన అగ్ని, నీరు, భూమి, తేజస్సు, ఆకాశములకు అధిపతి యెవ్వరు? పంచప్రాణములకు ప్రభువు యెవ్వడు? పంచమహాపాతకములు చేసి దానివల్ల పాట్లు పడునది యెవ్వరు? జీవి పంచత్వమునకు (చావుకు) భారకుడెవ్వరు (బాధ్యుడై భారమువహించునదెవ్వరు?) ఆ తిరువేంకటపతిని ధ్యానిస్తున్నది నాలో వున్నవాడైతే వాడెవ్వడు? అందరూ ముక్తి అని ప్రశంసించే ఒప్పగు సౌఖ్యము (మోక్షము) సిద్ధించుటకు యోగ్యుడెవ్వరు? ఒప్పు (మంచి) గాని, తప్పు (చెడు) గానియైన చేతలకు అంగీకరించక.. అందరినీ, అన్నిటినీ తప్పించుకొని పుణ్యులు కాదగినవారెవ్వరో కదా? వాడే పరమాత్మ సాయుజ్యం పొందిన జీవాత్మ.

*** ఒడగిన = సిద్ధించుట, పంచమహాపాతకములు = బంగారం దొంగతనం, కల్లు త్రాగుట, బ్రహ్మహత్య, గురుపత్ని సంగమము, పై నాలుగు పాపములు చేయువారి మిత్రుడైయుండుట.**

65 సంఖ్య : 103 సంపుటము: 2 పుట: 69 రాగం: దేసాళం

**పల్లవి:** **జీవునికి నిటు బుద్ధి చెప్పవయ్యా హరి నీవు**
**కావక పోరాదు మాకుఁ గల యంతర్యామివి**

**చ. 1:** **పైపై నెదురుకట్లఁ బంచదార వుండఁగాను**
**చేపట్టి యడిగి తెచ్చి చేఁదు దిన్నట్లు**
**పూపలైన చేతిలోనే పుణ్యములు వుండఁగాను**
**పాపములు చవియంటాఁ బట్టబొయ్యీ జీవుఁడు**

**చ. 2:** **యింటిలోనే నవరత్నా లెన్నియైనా నుండఁగాను**
**కంటగించి గాజుఁబూస గట్టుకొన్నట్లు**
**వెంటనే హరినామాలు వేయివేలై వుండఁగా**
**జంట నితరమంత్రాలు జపియించీ జీవుఁడు**

**చ. 3:** **చేసుకొన్న యిల్లాలు చేరువనే వుండఁగాను**
**వేసరక వెలయాలి వెతకినట్లు**
**మేసుల శ్రీవేంకటేశ మీదాస్యమే వుండఁగా**
**వాసిఁ బరులఁ గొలువనే వడిఁ గోరీ జీవుఁడు**

**భావదీపిక:**

శరణాగతుడైన జీవుడు దేవునితో యేమని మనవి చేసికొంటున్నాడో అన్నమయ్య కీర్తనలో వినండి. ఓ శ్రీహరి! నీవే మాలోవున్న అంతర్యామివి. నీవే నాలోని జీవునికి బుద్ధి చెప్పవయ్యా! నీకిది తప్పదు. మమ్మ్మ కావకపోరాదు (రక్షించకుండా పోకూడదు). మాలోనే వున్న నిన్ను తెలియకపోవటం యెంత మూర్ఖత్వం? అది మన యెట్టయెదుట కావలసినంత పంచదార వుండగా యెవడన్నా చేతులతో పట్టి తెచ్చుకొని చేదుని తిన్నట్లు కాదా? పూపిందెల వంటి తన చేతుల్లో గొప్ప పుణ్యములు వుండగా పాపములే మాకు రుచిస్తాయని జీవుడు వాటిని పట్టుకోబోతున్నాడు. ఇంటిలో నవరత్నాలు కోకొల్లలుగా వున్నా, కంటగింపుగా వున్నదని యెవడైనా గాజుపూస కట్టుకొంటాడా? తనకు తోడుగా హరి సహస్రనామాలు వుండగా చంకలో పెట్టుకొని యేవేవో మంత్రాలు జపియిస్తుంటాడు జీవుడు. అగ్ని సాక్షిగా పెండ్లాడిన ఇల్లాలు చేరువలోనే వున్నా విసుగులేక వారకాంతల ఇళ్లెక్కడా అని అయోగ్యుడు వెదకినట్లు, పెంకివాడవైన వో శ్రీవేంకటేశ్వరా! నీ దాస్యము వుండగా బుద్ధిమాలిన జీవుడు పేరుకోసం పరులను కొలుస్తుంటాడు.

*** యేసుల = పెంకివాడవైన, * కంటగించు = విరుద్ధముగా**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

66 సంఖ్య : 213 సంపుటము: 1 పుట: 142 రాగం: సాళంగం

**పల్లవి:** **తనకర్మమెంత చేఁతయు నంతే**
**గొనకొన్న పని యంత కూలీ నంతే**
**చ. 1:** **తలఁపులో హరి నెంత దలఁచె నేఁడే వాని-**
**కలిమియు సుఖమును గల దంతే**
**తులఁదూఁచఁ బైఁడెంత తూఁకము నంతే**
**నెలకొన్న పిండెంత నిప్పటీ నంతే**
**చ. 2:** **సిరివరుపూజెంత నేనె నేఁడే వాని-**
**దరియును దాపు నెంతయు నంతే**
**పురిగొన్న యీవెంత పొగడూ నంతే**
**నరపతిచనవెంత నగవూ నంతే**
**చ. 3:** **శ్రీవేంకటపతి చింత యంతగా నేఁడే**
**భావపరవశము పలుకూ నంతే**
**దైవము కృప యంత తానూ నంతే**
**యేవంక జయమెంత యిరవూ నంతే**

**భావదీపిక:**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ అధ్యాత్మ కీర్తనలో ఒక గొప్ప సత్యం చెబుతున్నారు. ఈ ఐహిక జీవితంలో మనిషి కూలికి యేదైనా పనిచేస్తే యజమాని వీడెంతపని చేస్తే అంత కూలీ ఇస్తాడు. ఆ దేవుడు కూడా వీడెంత "కర్మ" నాచరించాడో వాడికి చేతయు (ఫలితము కూడా) నంతే (అంతమాత్రమే) ఇస్తాడు. మనిషి తన తలపులలో హరిని యెంత వుంచుకోగలడో వాడికి నేడు అంతే కలిమి అంతే సుఖమూ దక్కుతాయి. ఎంత బంగారాన్ని తూయించుకొంటే అంతే బంగారం తూగుతుంది. రొట్టెకోసం ఎంత పిండి కలుపుకుంటే అంతే నిప్పటి (నిప్పులమీద కాల్చిన రొట్టె) వస్తుంది. అవునా? శ్రీపతినెంత పూజిస్తే మానవుడికి ఆయన కూడా అంతే ఆశ్రయం కలిగిస్తాడు. ఇదెంతో అదీ అంతే. మనిషికి ఈవి (దాతృత్వం) యెంత వుంటుందో వాడికి లభించే పొగడ్తయూ అంతే వుంటుంది. నరపతి చనవు (రాజు ఇచ్చే ఆదరణ) యెంత వుంటుందో పరిహాసమూ అంతే వుంటుంది. అందుకే మన హద్దులో మనము వుండాలి. ఎవరికైన శ్రీవేంకటపతిమీద యెంత భావపరవశత్వం వుంటుందో వాడి మాటలు కూడా అంత మధురంగానే వుంటాయి. దైవకృప యెవరికెంత వుంటే వాని వైభవమూ అంతే వుంటుంది. ఎక్కడైనా జయమెంత వుంటుందో స్థిరత్వమూ అంతే వుంటుంది.

*** దరియు దాపు = ఆశ్రయము; * ఇరవూ = స్థిరత్వమూ**

67 సంఖ్య : 41 సంపుటము: 1 పుట: 27 రాగం: శంకరాభరణం

**పల్లవి:** **తలపోఁత బాఁతె తలఁపులకుఁ దమ**
**కొలఁ దెఱంగనిమతి గోడాడఁగా**

**చ. 1:** **ఆపదలు బాఁతె అందరికినిఁ దమ-**
**చాపలపు సంపదలు సడిఁబెట్టఁగా**
**పాపములు బాఁతె ప్రాణులకును మతిఁ**
**బాపరానియాస దమ్ముఁ బాధించఁగా**

**చ. 2:** **జగడాలు బాఁతె జనులకునుఁ దమ-**
**పగలైనకోపాలు పై కొనఁగా**
**వగలు బాఁతె వలలఁ బెట్టెడి తమ్ముఁ**
**దగిలించు మమత వేదనము సేయఁగా**

**చ. 3:** **భయములు బాఁతె పరులకును తమ-**
**దయలేక అలయించు ధనముండగా**
**జయములు బాఁతె సతతమును యింత-**
**నయగారివేంకటనాథుఁ డుండగాను**

**భావదీపిక:**

ఈ కీర్తనలో అన్నమయ్య బాఁతి అనే పదమును "అధికం" అనే అర్థంలో వుపయోగించారు. పల్లవిని నేనిలా భావిస్తున్నాను. ఆలోచనలతో సతమతమై తమ కొలది (పరిమితి) నెరుగని మనస్సులు గోడాడగ (వ్యథచెందగా) తలపోతలు (ఆలోచనలు) బాఁతె (అధికంగానే వుంటాయి). మానవులందరికీ తమతమ సంపదలు చాపల్యం కలిగిస్తుంటే ఆపదలు 'బాతె' (అధికమే). ప్రాణులందరి మతిని, వదలలేని ఆశలు తమనే బాధిస్తుంటే వారు చేసే పాపకార్యములు కూడా 'బాఁతె' (అధికమే) తమని తగిలించు (బంధనపాలుజేయు) మమకారములు వేదన కలిగిస్తుంటే కలిగే వగలు (దుఃఖములు) కూడా 'బాఁతె' (అధికమే). ఇతరులపై దయజూపక విసుగు ప్రదర్శించునట్లు జేసే ధనమున్నది చూశారా, దానివలన భయముకూడా 'బాఁతె' (అధికమే). మరి ఈ పీడయెందుకు అని ఆలోచించండి. ఎల్లప్పుడూ మృదు స్వభావముగల శ్రీవేంకటేశ్వరుడు అండగావుంటే జయములు కూడా 'బాఁతె' (అధికమే).

*** అలయించు = విసుగు ప్రదర్శించు, * నయగారి = మృదుత్వంకలవాడు**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

68 సంఖ్య : 140 సంపుటము: 3 పుట: 94 రాగం: దేసాక్షి

**పల్లవి:** **తలఁచినప్పుడు వచ్చు దయ యెప్పుడూఁ దలఁచు**
**కలసిన బంధువుడు కమలారమణుఁడే**

**చ. 1:** **ఆతుమలోననే వుండు అన్నిటాఁ బాయనివాఁడు**
**యీతల నాతలఁ దానే యేమైనా నిచ్చు**
**చేతిలోఁ జేసే కర్మాలు చెడనియ్యఁ డెన్నఁడును**
**ఆతుర బంధువుఁడు హరి యొక్కఁడే**

**చ. 2:** **నిచ్చలు విందులు వెట్టు నెలఁతల నొడఁగూర్చు**
**యిచ్చెరిఁగి కప్పు గోకలెందైనాఁ దెచ్చు**
**మెచ్చు నేమిటికినైనా యిచ్చినవి గైకొను**
**ముచ్చటైన బంధువుఁడు ముకుందుఁడే**

**చ. 3:** **తోడునీడై వచ్చు మరి దొరతనము సేయించు**
**పాడితోఁ బంచేంద్రియాలఁ బంపు సేయించు**
**మేడెపు సంసారములో మించిన నిద్ర దెలుపు**
**వేడుక బంధువుఁడు శ్రీవేంకటేశుఁడే**

**భావదీపిక:**

అన్నమయ్య ఈ భక్తి ప్రచోదనమయ్యే కీర్తనలో యేమంటున్నారో వినండి. ఈ కమలారమణుడు యెంత దయా మయుడో తెలుసా? మీరు ఆర్తితో యెప్పుడు ఆయనను తలచుకొంటే తక్షణం వచ్చి తాను వచ్చినంతనే దయదలచే కలసిన బంధువు (మైత్రిని చూపే బంధువు). ఆయన విశిష్టతలను వినండి. ఆయన యెక్కడో వైకుంఠంలో వుండడు. మన ఆత్మలోనే వుంటాడు. ఎట్టి పరిస్థితిలోనూ మనని వదలడు. ఈతల (ఇహమందున) ఆతల (పరమునందునా) తానే మనకు యేది కావాలంటే అది ఇస్తాడు. మన చేతులారా చేసినకర్మలను చెడనివ్వక సకర్మలను చేయగలడు. ఈ శ్రీహరి వొక్కడే రోగార్తులకు బంధువు. నిచ్చలు విందులుగూర్చు (ప్రతిదినము మనకి కావలసిన తిండినిస్తాడు). మనకు “తగిన” స్త్రీని భార్యను చేస్తాడు. భోగాసక్తులకైనా, సన్యాసులకైనా వారికి “తగిన” వస్త్రాల నిచ్చేది ఆ ద్రౌపదీమాన సంరక్షకుడే. మనం భక్తితో యేమిచ్చినా స్వీకరించటమే కాదు మెచ్చుకొని గొప్ప ప్రతిఫలం ఇస్తాడు. కుచేలోపాఖ్యానం గుర్తు చేసికొనండి. ఈయనే ముకుందుడు. ఈయన కడు ముచ్చటైన బంధువు. ఆనాడు గోపబాలురను రక్షించినట్లు, మన తోడునీడై వుంటాడు. అతి సామాన్యుడిచేత దొరతనం చేయిస్తాడు. (ఏలికను చేస్తాడు... ఆలోచించండి మీకే తెలుసుంది). మనిషి పంచేంద్రియాలూ పనిచేయాలంటే ఆయన అనుగ్రహించాల్సిందే. సంసారమనే యుద్ధరంగంలో అలసిన జీవులకి నిద్రద్వారా అలసట తీర్చేది యెవరో గ్రహించలేరా? వేడుకబంధువైన ఈ శ్రీవేంకటేశ్వరుడే.

*** ఆతురబంధువు = రోగార్తులకు బంధువు; * మేడెము = యుద్ధము**

69 సంఖ్య : 124 సంపుటము: 1 పుట: 85 రాగం: సామంతం

**పల్లవి:** **తనదీఁగాక యిందరిదీఁగాక**
**తనువెల్ల బయలై దరిచేరదు**

**చ. 1:** **కడుపూ నిండదు కన్నూఁ దనియదు**
**కడఁగి లోనియాఁకలియుఁ బోదు**
**సడిఁబడి కుడిచినకుడుపెల్ల నినుము**
**గుడిచిన నీరై కొల్లఁబోయె**

**చ. 2:** **చవియూఁ దీరదు చలమూఁ బాయదు**
**లవలేశమైన నొల్లకపోదు**
**చివచివ నోటికడవలోనినీరై**
**కవకవ నవియుచుఁ గారీని**

**చ. 3:** **అలపూఁ దోఁపదు అడవీ నెండదు**
**యెలయించు భంగమయునఁ బోదు**
**తెలసి వేంకటగిరిదేవునిఁ దలఁపించు**
**తలఁపైనఁ దనకు ముందర నబ్బదు**

**భావదీపిక:**

అన్నమయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో సోదాహరణంగా బాహ్యేంద్రియ సుఖాలకి తృప్తి అనేది వుండదు. స్వామి కరుణ లేకపోతే అనిత్యాలను నిత్యాలనుకొనే బలహీనతనుంచి జీవుడు బయటపడలేడంటున్నారు. దేవా! ఈ జీవుని దేహము వీడిది కాదు. ఎందుకంటే వాడు దాన్ని సృష్టించలేదు. పోనీ వాడికి చెందిన అందరిదీ కూడా కాదు. ఈ బాహ్యప్రపంచంలో యెన్ని విధాల బయటపడినా ఇది నిన్ను (స్వామిని) చేరలేదు. ప్రభూ! కడుపూ నిండదు (శాశ్వతంగా తృప్తి చెందదు). తనకిష్టమైన దాన్ని చూసిన కన్నూ తృప్తి చెందదు. లోని ఆకలి (జిజ్ఞాస) కూడా పోనేపోదు. తినకూడని కలుషితమెంత తిన్నా వేడెక్కిన ఇనుముపై బడ్డ నీరు యెలా ఆవిరవుతుందో అలా అశుద్ధమైపోతూనే వుంటుంది. స్వామీ! రుచిపై వ్యామోహమూ తీరదు. జీవులకున్న చలము (పట్టుదల) కూడా పోదు. కొంచెము కూడా అంగీకారానికి రాలేదు. చివచివ (తొందరగా) కారిపోదా నీరు, అందులోనూ పగులుబారిన కడవలోనుంచి? నలుగురూ నవ్వుకొనే విధంగా తప్పక కారిపోతుంది. దేవదేవా! ఇంత జరిగినా, ఈ జీవుడికి శ్రమా అనిపించదు. తృప్తి అనే అడవి యెండిపోనే పోదు. ఎలయింపు(ఆసక్తి) భంగపడదు. ఇంతెందుకు ఎన్నిసార్లు చూచినా ఈశ్రీవేంకటేశ్వరుని శరణాగతి పొందాలనే తలపైనా, మునుముందుగా నబ్బదు. దానికీ ఆయన దయ కలుగవలసిందే.. మరి అదంతే.

**సడిబడి = కలుషితమై * అవలేశమైన** = కొంచెమైనా

70 సంఖ్య: 39 సంపుటము: 1 పుట: 26 రాగం: బౌళి

**పల్లవి:** **తీపనుచు చేఁదు తెగఁదిని వెనకఁ బడరాని**
**ఆపదలచేతఁ బొరలాడేముగాక**

**చ. 1:** **అప్పుదీరినదాఁకా నలవోకకైనవా-**
**రెప్పుడునుఁ దమవార లేలౌదురు**
**అప్పటప్పటికిఁ బ్రియ మనుభంపుచు మమత**
**చెప్పినటువలెఁ దాము సేయవలెఁ గాక**

**చ. 2:** **పొందైనవారమని పొద్దు వోకకుఁ దిరుగు-**
**యిందరునుఁ దమవార లేలౌదురు**
**కందువగు తమకార్యగతులు దీరినదాఁక**
**సందడింపుచుఁ బ్రియము జరపవలెఁ గాక**

**చ. 3:** **తెగని కర్మము దమ్ముఁ దిప్పుకొని తిరిగాడ**
**ఆగడుకోరిచి పెక్కులాడ నేమిటికి**
**తగవేంకటేశ్వరునిఁ దలఁచి యిన్నిటాఁ దాము**
**విగతభయులయి భ్రాంతి విడువవలెఁ గాక**

**భావదీపిక:**

ఈ అధ్యాత్మ కీర్తనలో అన్నమయ్య యేమంటున్నారో ఆలకించండి. మేమెంత మందమతులము!! చేదుని తింటూ ఇన్నాళ్లూ అదే తీపి అని మురిసిపోయి తెగతిన్నాము. మేమే ఆపదల వెనకపడి, పడరాని పాట్లలో దొర్లాము. మనం ఋణం తీర్చుకోటానికో, తీర్పించుకోటానికో పుట్టాము. అప్పు తీరేదాకానే ఈ బంధాలన్నీ వాళ్లెప్పుడూ నావాళ్లే అనుకుంటే యెలా కుదురుతుంది? అప్పటికంతేనని వారి (సంబంధంకలవారి) ప్రియము ననుభవించుచూ మమతానుబంధం యెట్లా చెబుతే అట్లా చేయాలి. అంతగాక మరేమిటి? పొందు కలిగేదాకా పొద్దుపోక యెవరెవరితోనో తిరిగి అందరూ నావాళ్లే ననుకొనే వెఱ్ఱివాళ్లల్లారా! అందరూ నీవాళ్లెట్లా అవుతారయ్యా? సామర్థ్యముగా తమ పని నెరవేరే దాకా సందడి చేస్తూ మీ వెంట తిరుగుతారు. వారితో కూడా ప్రియము జరుపక తప్పదు గాక! అదంతే మరి తెగని కర్మబంధమువలన అవి తమను తిప్పుకొంటుంటే తిరుగాడుతున్నాము. కర్మ కాకపోతే యెందరి తిట్లనో భరించి అనేక మాటలనటం దేనికి? శ్రీవేంకటేశ్వరుని ధ్యానిస్తూ భయ వివర్జితులై భ్రాంతిని విడనాడరాదా?

*** అగడు కోరిచి = తిట్లు భరించి, * కందువగు = సామర్థ్యముగా**

71 సంఖ్య: 398 సంపుటము: 3 పుట: 268 రాగం: భూపాళం

**పల్లవి:** తెలిసియుఁ దెలియను తెగదీ చిక్కేమిటాను
కలకాల మిందుననే గరివడె బ్రదుకు

**చ. 1:** దేహముపై రోఁత తెలుసుకొనేటి వేళ
ఆహా యిదే హేయమై తోఁచును
మోహించి విషయాల మునిఁగిన వేళ నిదే
యీహల నంతటిలోనే ఇతవులై వుండును

**చ. 2:** చదివి నేఁ బురాణాలు సారెకు వినేటి వేళ
అదివో విరతి ఘనమై వుండును
కదిసి సంసార సుఖకాంక్షలఁ బొందేటి వేళ
మది నన్నియు మరచి మద మెక్కి వుండును

**చ. 3:** యెక్కడిది వివేక మెవ్వరు గెలిచినారు
చక్కఁ బొడవెక్కించు చరిఁ దోసును
దిక్కు నీవే శ్రీవేంకటదేవుఁడ నీ శరణంటే
యెక్కువ బ్రదుకుఁదోవ యిదియే కలది

**భావదీపిక:**

"గరివడుట" అంటే చిక్కుబడుట అని అర్థం. అన్నమయ్య చెప్పిన ఈ వైరాగ్య కీర్తనలో ఏమంటున్నారో వినండి. నా బ్రతుకంతా చిక్కులపాలైపోయింది. ఒకప్పుడు అంతా తెలిసినట్టే ఉంటుంది. మరొకప్పుడు ఏమీ తెలియనట్టుంటుంది. ఎంతకీ ఈ చిక్కు తెగకుండా ఉన్నది. కలకాలము ఇది ఇట్లాగే ఉంటుంది కాబోలు. మన దేహం వల్ల బాధ కలిగినప్పుడు, ఇదంటే రోత (జుగుప్స) పుడుతుంటుంది. ఆహా! అప్పుడిదంటే ఎంతో అసహ్యం కూడా పుడుతుంది. కానీ మోహం వలన విషయవాంఛలలో మునిగిపోతే ఇదే దేహము అంతటిలోనే హితవైనదిగా అనిపిస్తుంది. నేను చాలా పురాణాలు చదివాను. అనేక మార్లు పురాణాలు విన్నాను. అవి విన్నంతసేపు గొప్ప విరక్తి కలుగుతుంటుంది. నేను సంసార సుఖం పొందుతూ ఆనందిస్తున్న వేళ నా మనస్సు ఆ పురాణాలన్నింటినీ మఱచి మదమెక్కి ఉంటుంది. ఈ బ్రతుకులో వివేకమెక్కడిది? దీనిని ఎవ్వరు గెలవగలరు? ఈ బ్రతుకు ఎంతటిదంటే, ఒక్కొక్కసారి నిన్ను ఉన్నత శిఖరాలనెక్కిస్తుంది. ఒక్కొక్కసారి పాతాళానికి పడవేస్తుంది. ఓ వేంకటేశ్వరా! నీ శరణాగతి ఒక్కటే మమ్మల్ని బతుకుబాటలో కడతేర్చగలదు.

*** కదిసి = సమీపించి, * ఈహల = కోరికలలో**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

72 సంఖ్య : 111 సంపుటము: 1 పుట: 76 రాగం: ఆహిరి

**పల్లవి: దిక్కిందరికినైన దేవుఁడు కడుఁ**
**దెక్కలికాఁడైన దేవుఁడు**

**చ. 1: కొత్తపెండ్లికూఁతుఁ గోరి చూడఁబోయు**
**యెత్తి తేరిమీఁద నిడుకొని**
**నెత్తికన్ను మానినవాని పెండ్లికి**
**దెత్తిగొన్న యట్టి దేవుఁడు**

**చ. 2: గొప్పయునపెద్దకొండమీఁద నుండి**
**దెప్పరమ్ముగా దిగఁబడి**
**కప్పి రెండుదునుకలు గూడినవాని**
**తిప్పుఁదీరులాడే దేవుఁడు**

**చ. 3: బెరసి మేనమామబిడ్డకునై పోయు**
**నిరతఁపుబీరాలు నెరపుచు**
**యిరవైనమాయపుటెద్దులఁ బొరిగొన్న-**
**తిరువేంకటగిరి దేవుఁడు**

**భావదీపిక:**

పురాణ వాఙ్మయముతో గొప్పపరిచయముంటేగాని వివరించలేని కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. డా॥పతంజలిగారి సహాయం వల్లనే ఈ వివరణనిచ్చే అదృష్టం నాకు దక్కింది. ఈ వేంకటపతి అందరికీ దిక్కు అని కీర్తించబడే దేవుడు. ఈయన కడున్ తెక్కలి వాడైన (గొప్ప అపహరణ నిపుణుడైన) దేవుడు. ఎలాగో వివరిస్తాను వినండి. కృష్ణావతారంలో ఈ వెన్నదొంగ కన్నెలదొంగ అయ్యాడు. కొత్త పెండ్లి కూతురైన రుక్మిణి కోరగా పెళ్లి చూడటానికి బోయి, యెత్తుకొని తన రథమునెక్కించుకొని అపహరించుకుపోయాడు. ఇంతా చేసి పెండ్లికొడుకు పరాయివాడు కాదు. తన మేనత్త కొడుకు శిశుపాలుడే. వాడి నెత్తిన వున్న కన్ను చిన్నప్పుడు తనెత్తుకుంటే మాయమైంది. పిశాచం లాంటి వాడిని అందంగా ఈ దేవుడు చేస్తే, వాడు పెండ్లి కొడుకై కూడా పెండ్లాన్ని పోగొట్టుకున్నాడు. జరాసంధుడు ఈ కృష్ణుడి మేనమామ కంసుడికి పిల్లనిచ్చిన మామ. ఆయన పెద్ద కొండ మీద అక్షౌహిణి సైన్యంతో సురక్షితంగా వుంటే వాడు తనకి, దెప్పరము (ఆపద) అని గ్రహించి భీముడితో పాటు బిలం చేయించి వాడి రాజధానికి వెళ్లి, వాడి రెండు తునకలుగా విరగగొట్టించి చంపించాడు. ఇట్లా వంచనతోనైనా తీర్చిదిద్దే దేవుడు వీడే. కృష్ణుని ఇంకొక మేనమామ కూతురు తననే వలచింది. అది తెలిసి అదిష్టం లేని మేనమామ తనవద్దనున్న పొగరుబోతు పోట్లగిత్తలకు ఒకేసారి ఒంటరిగా ఒడిసిపట్టి కట్టివేయగల వానికి తన కూతురునిచ్చి పెండ్లి చేస్తానని ప్రకటించాడు. అది కృష్ణుడివల్ల కాదని బీరాలు పలికాడు. ఆ మాయపుటెద్దుల మదమణచి అతిశయించిన ఆ శ్రీకృష్ణుడు యెవరనుకొన్నారు? మన తిరువేంకటగిరిదేవుడే.

* **తిప్పదీరు** = **తీర్చిదిద్దు**, * **బీరాలు** = దంభములు (గొప్పలు)

73 సంఖ్య : 63 సంపుటము: 27 పుట: 43 రాగం: బౌళి

**పల్లవి:** నవ్వేవారి నెఱఁగఁడు నలువంకఁ దన్నుఁ జూచి
దివ్వెలెత్తుఁబొద్దుకాడ తివిరీ నిదేఁటికే

**చ. 1:** చెక్కులవెంటాను పెంజెమటలు గారఁగాను
యెక్కడనుండి వచ్చెనే ఇప్పుడితఁడు
పుక్కిటిబంటియైన బుసకొట్ల తోడుత
మక్కళించి యెటువంటి మాట లాడీనే

**చ. 2:** విరులు కొప్పుననుండి విడి విడి రాలఁగాను
బిరుదుతో తా నెంత పెనఁగాడీనే
గరిమతో నిద్దురలు కన్నులనే తేరఁగాను
పరగ పాన్పుపై నెట్టు పవళించీనే

**చ. 3:** అలపులు తనమేన నటు తొ్రటు కొనఁగాను
పిలిచి కాఁగిట నెంత బిగియించీనే
యెలిమి శ్రీవేంకటేశుఁడీతఁడే తా నన్నుఁ గూడె
కొలువులోపల నెంత కొనియాడీనే

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో తన చెలియకు దేవి తన నాథునితో తనకు కలుగుతున్న ఇబ్బందులను వివరిస్తున్నది. ఇదేమిటే నలుగురు తనను చూచి నవ్వుతున్నారనైనా యెఱగడు? దివ్వెలెత్తే వేళకి (చీకటి పడ్డాక) యెంత వేగిరపాటు చూపిస్తాడు!! మరింకెందుకో తెలియటం లేదు. ఇప్పుడిక్కడికి వచ్చాడా ఆయనగారి ఒంటినిండా ఇంత పెంజెమటలు దేనికో అర్థం కాదు. ఇప్పుడిక్కడకు తానెక్కడినుండి వచ్చాడో అదన్నా చెప్తాడా? చెప్పడు. ఆయాసముతో నోరారా బుసకొడుతున్నాడు. మక్కళించి (ప్రతిదానికీ అతికినట్లు) సమాధానమిస్తాడు. వీనినేమనవలెనే? ఇది చూచినావా? వానికొప్పులోనుండి పువ్వులెలా రాలిపోతున్నాయో! అదేమిటంటే "ఒట్లతో" యెంత అవస్థపడుతున్నాడో చూడవే. పాపం రాత్రంతా నిద్రలేదేమో కన్నులపై నిద్ర తేరగానూ (ముంచుకొస్తుంటే) పాన్పుపై యెట్లా ఆదమఱచి పడుకొన్నాడో చూడవే! తన శరీరంపై అలసట వ్యాపిస్తుంటే తానంతటా తానే నన్ను పిలిచి యెంతగా బిగి కౌగిలించినాడే! శ్రీవేంకటేశ్వరుడైన ఇతగాడు నన్ను కూడినాడు. అటుపైన తన నిండు సభలో నన్నెంత కొనియాడినాడో తెలుసా?

*** తొ్రటుకొను = వ్యాపిస్తుంటే, * పుక్కిట బంటి = నోరారా**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

74 సంఖ్య : 384 సంపుటము: 3 పుట: 259 రాగం: లలిత

**పల్లవి:** **నాకేల విచారము నాకేల యాచారము**
**సాకిరైనవాఁడ నింతే సర్వేశుఁడే దిక్కు**

**చ. 1:** **ప్రపంచ మధీనము పాలుపడ్డ దేహమిది**
**ప్రపంచముతోడి పాటు పరగీని**
**యెపుడూ నీయాతుమ యీశ్వరాధీనము**
**అపు డాతఁ డెట్టునిచె నట్టె అయ్యీని**

**చ. 2:** **కర్మాన కధీనము కలిములు లేములు**
**కర్మమెట్టు గల్పించెఁ గలిగీని**
**అర్మిలి నాయాచార్యు నధీనము మోక్షము**
**ధర్మ మతని కృపను తానే వచ్చీని**

**చ. 3:** **చిత్తమున కధీనము చిల్లరయింద్రియములు**
**చిత్తము చిక్కినప్పుడు చిక్కీనవి**
**హత్తి శ్రీవేంకటేశుదాస్య మధీనము జన్మము**
**పొత్తుల నందుకు నది పూఁచినట్టయ్యీని**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన అధ్యాత్మ కీర్తన నాస్వాదించండి. సర్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వరుడు జీవులందరి రక్షకుడు. ఆయన సాకిరైనవాడు (సాక్షీ భూతుడు) అంతే, ఆయనే నాకు దిక్కయివుండగా నాకేల విచారము? నాకు ఆచారనియమములతో కూడా పనిలేదు. ఇదొక్క సారి ఆలోచించండి. ఈ దేహమున్నదే, ఇది ప్రపంచము యొక్క అధీనములోనున్నది. ఇది ప్రపంచము వలెనే అతిశయించును. అదే విధముగా ఈ దేహములోనున్న ఆత్మ ఈశ్వరుని యొక్క అధీనములో వున్నది. అప్పుడు అది ఆయనెట్లావుంచితే అట్లా వుంటుంది. ఈ జీవియొక్క కలిమిలేములు(సంపదలు, దరిద్రములు) వాని పురాకృత కర్మకధీనములై వున్నవి. ఆ కర్మమెట్లా కల్పిస్తుందో అవీ అట్లాగే వుంటాయి. ఇక మోక్షము అపేక్ష గలిగిన మా ఆచార్యుని అధీనములోనున్నది. నాకు ధర్మచింతన ఆయన కృపవలన తనకు తానే వచ్చింది చిల్లర (అల్పమైన) ఇంద్రియములు నా చిత్తము యొక్క ఆధీనములో నున్నవి. నా చిత్తము నా స్వాధీనములో నున్నప్పుడు, ఇంద్రియములూ నా స్వాధీనములో వుంటాయి. నన్ను కూడిన శ్రీ వేంకటేశ్వరుని దాస్యపు అధీనములో నా జన్మమున్నది. అందుకని నా జన్మము కూడా ఆయనకై నేను చేసే దాస్యము వలెనే అతిశయిస్తుంది.

* **అర్మిలి** = **అపేక్ష** , * **హత్తి** = కూడి

75 సంఖ్య : 153 సంపుటము: 3 పుట: 103 రాగం: నాట

**పల్లవి:** **నానాటికిఁ బెరిగీని నరసింహము**
**ఆనుక వరములిచ్చీ నౌభళపుసింహము**

**చ. 1:** **వేఁడి ప్రతాపముతోడ విభవాలు మెరయుచు**
**మూఁడుమూర్తు లొక్కటైన ముఖ్యసింహము**
**వాఁడివాఁడి కోరలతో వడి నసురఁ జక్కాడి**
**తీఁడేటి మీసాలతోడి దేవదేవసింహము**

**చ. 2:** **సరుస శంఖచక్రాది సకలాయుధాలు వట్టి**
**పరబ్రహ్మమే తానైన పటుసింహము**
**వరుసఁ గొలువులు దేవతలెల్లాఁ జేయఁగాను**
**తిరమైన కృపతోడి దివ్యసింహము**

**చ. 3:** **కేలి సింహాసనముపై కిరీటము ధరియించి**
**చాలు వేయిచేతుల కాంచనసింహము**
**పాలించి ప్రహ్లాదుని భక్తుల పాలిటి కిలు-**
**వేలుపై శ్రీసతితో శ్రీవేంకటాద్రి సింహము**

**భావదీపిక:**

శ్రీ నరసింహుని “వేడి” వాడియైన ప్రతాపమును వర్ణిస్తూ ఈ కీర్తన వినిపించారు అన్నమయ్య. అహోబలం పేరు వుటంకించినందువలన ఈ వేంకటాద్రి సింహము ఆ నరసింహ దేవుడని నేను భావిస్తున్నాను. ఈ నరసింహము నానాటికిన్ పెరిగీని (అతిశయించుచున్నాడు) ఆనుక (తరువాత) వరాలిచ్చీ నౌభళపు సింహము (అహోబల నృసింహుడు). ఈయన వాడిగల ప్రతాపముతో వెలుగొందుచున్నాడు. ఈ నరసింహము త్రిమూర్తులుగా ఖ్యాతిగడించిన బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరులు వొక్కటైన మూలరూపము. మిక్కిలి వాడిగల కోరలతో వేగముగా అసురుని (హిరణ్యకశిపుని) చక్కాడి (చీల్చి), తీడెటి (మెలిపెట్టినట్టి) మీసాలతో దేవదేవుడై అతిశయించుచున్న సింహమిదే. చేతులలో ఆయన తన ఆయుధములైన శంఖచక్రములు మొదలైనవి ధరించియున్నాడు. పటుత్వముగల ఈ సింహము స్వయముగా పరబ్రహ్మ స్వరూపము. దేవతలందరూ వరుసగా కొలుచుచుండగా తిరుమైన (స్థిరమైన) తన కృపను ప్రదర్శించుచున్నది, ఇదిగో ఈ దివ్య నరసింహము. తన సింహాసనముపై విలాసముగ కూర్చొని ఈయన రత్నకిరీటమును ధరించి యున్నాడు. వేయి చేతులు గల ఈ బంగారు సింహము, ప్రియభక్తుడైన ప్రహ్లాదుని పాలించిన నరసింహము. ఈయన తన భక్తుల పాలిటి కీలువేలుపు. తిరుమలలో వెలసిన ఆయన శ్రీసతితో కూడియున్న శ్రీవేంకటాద్రి సింహము.

*** కీలువేలుపు = కీలకమైన దేవుడు; * సరుస = సమీపమున**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

76 సంఖ్య : 54 సంపుటము: 2 పుట: 37 రాగం: గుండక్రియ

**పల్లవి:** **నారాయణాచ్యుతానంత గోవిందా**
**నేరరాదు విజ్ఞానము నీ వియ్యక లేదు**

**చ. 1:** **నిగమాంతవిదులై తే నిన్నెఱుఁగుదురు గాక**
**మృగసమానులకేల మీమీఁది భక్తి**
**వెగటుగాఁ గృపతోడ విశ్వరూపు చూపినాను**
**పగటు దుర్యోధనుఁడు బహురూప మనఁడా**

**చ. 2:** **చిరపుణ్యులైతే మీ సేవలు సేతురు గాక**
**దురితచిత్తులకు మీత్రోవ యేఁటికి**
**గరిమఁ బ్రత్యక్షమై కంబములోఁ గలిగినా**
**హిరణ్యకశిపుఁడు మిమ్మెంచి శరణనెనా**

**చ. 3:** **దేవతలయితే మిమ్ముఁ దెలియనేర్తురు గాక**
**యేవల నసురులు మిమ్మెఱిఁగేరా**
**శ్రీవేంకటాద్రిమీఁద సిరితో నీ వుండఁగాను**
**కేవల సంసారు లెఱిఁగియును మఱవరా**

**భావదీపిక:**

అన్నమయ్య ఈ భక్తి జాలువారే కీర్తనలో గోవిందుని స్తుతిస్తూ ఆయనే మోక్షదాత అనే జ్ఞానం ఆయన కలిగించకపోతే ఆయనను చూస్తున్నా నమస్కరించలేరని సోదాహరణంగా వివరిస్తున్నారు. అచ్యుతడవు, అనంతుడవు, నారాయణుడవు అయిన వో గోవిందా! నీవు అనుగ్రహించక జీవులు విజ్ఞానము నేర్పలేరు. ఒక్కనాటికీ వారికి నీవే దేవదేవుడవనే జ్ఞానము రాదు, అంటున్నారు. దేవా! వేదాంత నిష్ణాతులైతే నిన్నెఱుగ గలరా? భీకరమైన నీ విశ్వరూపం చూపించినా దుర్యోధనాది దుష్ట చతుష్టయం అది బహురూపము (ఇంద్రజాలము) అన్నారు కదా! ప్రభూ పూర్వజన్మ పుణ్యము వున్నవారే భక్తి కలిగి నీ సేవకులు కాగలరు. పాపాత్ములు నీ త్రోవనెందుకు తొక్కుతారు? కంభము (స్తంభము) లోనుండి నారసింహుడివై నీవు వెలువడినా హిరణ్యకశిపుడు నీవు విష్ణువవని గ్రహించి నీకు శరణాగతుడు కాక మరణించాడు. దేవాసురులొక తండ్రి బిడ్డలే. స్వామీ! దేవతలైతే నిన్ను తెలియగలిగారు కానీ అసురులు నిన్ను తెలుసుకోగలిగారా? అంతదాకా యెందుకు నేటి కాలంలో శ్రీవేంకటాద్రిమీద నిన్ను దర్శించే క్షణకాలం తప్పించి మిగిలిన కాలమంతా తిండి, డబ్బు, పెళ్లాం పిల్లలూ అనే "యేడుస్తుంటారు" కదా!

*** దురితచిత్తులు = పాపాత్ములు * ఏవల = యెలాగైనా**

77 సంఖ్య:268 సంపుటము:27 పుట:181 రాగం: కన్నడగౌళ

**పల్లవి:** **నిక్కమైన మాబతుకు నీ చేతిదే**
**యెక్కడి కెక్కడ మమ్మునేల కొసరేవు**

**చ. 1:యిందు రమ్మని పిలువ యేలుకొన్న దాననా**
**మందటలాడి పెనఁగ మంకుదాననా**
**విందులు చెప్పఁగ నీకు వియ్యాల దాననా**
**యెందుదాన మమ్ము నీవు యేలకొసరేవు**

**చ. 2:** **అండఁ గాచుకుండేనంటే అద్దికపుదాననా**
**దుండగానఁ బట్టి తియ్య దొమ్మిదాననా**
**బండుగా నవ్వులు నవ్వ పల్లదపుదాననా**
**యెండలెల్లాఁ బాపితివి యేల కొసరేవు**

**చ. 3:** **సారె నీకు బుద్ది చెప్ప చదివించే దాననా**
**మేరలు మీరఁగ నీతో మేనదాననా**
**ఆరితేరి శ్రీవేంకటాధిప నన్నుఁ గూడితే**
**యీరీతి మొక్కితి నన్ను యేల కొసరేవు**

**భావదీపిక:**

అన్నమయ్య ఈ సరస శృంగార కీర్తనలో తానొక వలపు కత్తెయై స్వామితో నేను నీ మేనవావిదానిని కానుకదా! మమ్మేల వలపు కొరకు కొసరేవు (ఇంకా కావాలని కోరెదవు?) ఇంతా చేసి మా బతుకంతా నీ చేతిలోనిదే. ఏది పడితే అది కావాలని కొసరెదవు. అసలు నాగురించి యేమనుకొంటున్నావు? ఈ నీ రహస్య స్థలానికి రమ్మంటున్నావే, నేనేమైనా నీవు యేలుకొనే పెండ్లామునా? మందటలాడి (దగ్గరకు తీసికొని) పెనవేసికొంటావే, నేను మంకుతనమున్న ప్రేయసినా? విందు భోజనం (పప్పన్నం) పెట్టమని ఆదేశిస్తున్నావే, నేనేమైనా నీ వియ్యపురాలినా? యెందుదానను (నీకేవౌతానని) నన్ను కొనరెదవు? ఏమయ్యా? నన్ను నీ అండలో ఉంచుకొంటానంటున్నావు, నేనేమైనా నీరక్షణలో ఉన్నదానినా? నన్ను బలవంతాన దౌర్జన్యం చేస్తున్నావు. నేను దొమ్మిదాననా (చిల్లరిదాననా?) బండుగ (ఆకతాయివలె) నీతో నవ్వటానికి నేనేమన్నా ధూర్తురాలినా? అవును గానీ నాయెండబాపుతున్నావు (శ్రమ తొలగిస్తున్నావు) కదా! నేడు ఇంకా నన్నేల కొసరెదవు? స్వామీ! నీకు ప్రతిసారీ నీతిబోధలు చేయటానికి నేనేమైనా నీకు చదువు చెప్పే గురువునా? పోనీ హద్దుమీరి సరసాలాడుటకు నీమేనమరదలినా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఆరితేరినవాడవై నన్ను కూడినావు. ఈ రీతిగా నీకు మొక్కితిని కదా! ఇంకా కొసరుటెందులకు?

*** అద్దికపుది = రక్షణలోవున్న స్త్రీ, * పల్లపుదానసా = ధూర్తురాలన**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

78 సంఖ్య : 55 సంపుటము: 9 పుట: 32 రాగం: భూపాళం

**పల్లవి:** **నిండు సోబనము నేఁడు నెయ్యపు దంపతులకు**
**మెండుగ నారతులెత్తి మీఁద సేసచల్లరే**

**చ. 1:** **కట్టుఁడు కలువడాలు ఘనమైన తోరణాలు**
**గట్టిగాఁ బట్టణము సింగారించరే**
**కిట్టి రుక్మిణిదేవిఁ గృష్ణుఁడు పెండ్లాడి వచ్చె**
**పెట్టుఁ డిందరికి నేఁడు పెండ్లి విడేలు**

**చ. 2:** **పాడరె సోబనాలు పై పై నె పేరఁటాండ్లు**
**యీ డా దనక వీధు లేఁగించరే**
**జాడతో వాయించరె పంచమహావాయిద్యాలు**
**యీడనె పెండ్లికట్నా లియ్యరె యిద్దరికి**

**చ. 3:** **పొత్తుల విందులు దెచ్చి బువ్వమున నిడరే**
**హత్తి గంధాక్షత లీరె అందరు నేఁడు**
**నిత్తెమై శ్రీ వెంకటాద్రి నిలయుఁ డీ కృష్ణుఁడు**
**తత్తరాన నీకెఁ గూడె దగ్గరి సేవించరే**

**భావదీపిక:**

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు- అని పిలువబడే వీడు, పూర్వజన్మ సుకృతంవలన, శ్రీవేంకటేశ్వరుడు కలిగించిన స్ఫురణ వలన, అన్నమయ్య ఆరాధకుడై, అన్నమయ్య సంకీర్తనల విశ్లేషణా దీక్షాబద్ధుడై, దినమునకు కనీసం ఒక కీర్తన వివరిస్తున్నాడు. ఇది నా "2,222"వ కీర్తన. ఇదిగాక సుకృతంబింకొకటి కలదే. అన్నమయ్య, వేంకటకృష్ణయ్య పెండ్లిలో మంగళగీతములు పాడుతున్నారు. మీరూ గొంతు కలిపి ముక్తిబాటలో ముందడుగు వేయండి. నెయ్యపు దంపతులకు (అనురాగబద్ధులైన ఈ ఆలుమగలకు) నేడు మంగళప్రదమైన శోభనము. గొప్పగా హారతులనిచ్చి మంగళాక్షతలు చల్లండి. మీ జన్మ చరితార్థం చేసుకొనండి. బంగారు కలువపూదండ కట్టండి. పెద్ద పెద్ద తోరణాలు కట్టండి. తిరుమల పట్టణాన్ని దిట్టంగా అలంకరించండి. ఎందుకో తెలుసా? నేడు రుక్మిణీదేవిని, శ్రీకృష్ణుడు పెండ్లాడబోతున్నాడు. అందరికీ తాంబూలాలివ్వండి. దేవుడి పెండ్లికి అందరూ పెద్దలే. ఓ పేరంటాండ్లూ! మీరు మంగళహారతి పాటలు పాడండమ్మా! ఇక్కడా, అక్కడా అనే తేడా లేకుండా అన్ని పురవీధులలోనూ ఈ వధూవరులను ఊరేగించండి. డోలు, సన్నాయివంటి "పంచమహావాయిద్యాలను" వాయించండి. మరి పెండ్లి కట్నాలు చదివించే భక్తులు ఇక్కడే చదివించండి. అక్కడ రద్దీ ఎక్కువ వుంటుంది. బంతి భోజనాలకు రంగం సిద్ధమైంది. కొత్త దంపతులను బువ్వానకు (భోజనానికి) పిలవండి. ఆహ్వానితులందరికీ గంధము, అక్షతలు ఇవ్వండి. శ్రీవేంకటాద్రి నిలయుడైన ఈ వేంకటకృష్ణయ్య నిత్య పెండ్లికొడుకు. ఎంత తత్తరపాటుతో ఈమెకు చేరువవుతున్నాడో చూడండి. ఓ పుణ్యాత్ములారా! మీరు వీరికి చేరువయై సేవించండి, తరించండి.

*** కిట్టి = సమీపించు; * హత్తి = పొందికతో**

79 సంఖ్య : 114 సంపుటము: 2 పుట: 77 రాగం: శ్రీరాగం

**పల్లవి:** **నిర్మలులు వీరు నిత్యసుఖులు**
**కర్మదూరులు విష్ణుకైంకర్యపరులు**

**చ. 1:** **పరమజ్ఞానసంపన్నులగువారికిని**
**అరుదుగా దిచటి మహదైశ్వర్యము**
**హరికృపాధనము చేనబ్బిన మహాత్ములకు**
**సరకుగాకుండు పంచల నిధానములు**

**చ. 2:** **బలిమిని వేదాంతపట్టభద్రులకు నిల**
**బలురాజ్యపదవు లిరుగడబంట్లు**
**లలిమీరి హరిచక్రలాంఛనపు శూరులకు**
**యెలమి విజయములెల్ల నింటిలో నుండు**

**చ. 3:** **యీవలను శ్రీవేంకటేశు శరణాగతుల-**
**కావటించిన పుణ్య మడువుగాదు**
**దైవజ్ఞులయిన యాధర్మస్వరూపులకు**
**వేవేలు భోగములు వెనుతగులుచుండు**

**భావదీపిక:**

వైష్ణవజియ్యరులపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. వీరు నిర్మలమైనవారు అంతే కాదు నిత్యానందసుఖోపేతులు. వీరు కర్మలను పరిత్యజించినవారు, విష్ణుకైంకర్య దీక్షాదక్షులు. వీరు పరమును యెరిగిన జ్ఞాన సంపన్నులు కావున అల్పమైన ఇలలోని మహాదైశ్వర్యములు అరుదుకాదు. వీరు హరికృపయనెడి ధనమును హస్తగతము చేసికొనిన మహాత్ములు. అట్టివారికి అత్యధికమైన విధానములు కూడా సరకుగాకుండును (లక్ష్యపెట్టనివిగా వుంటాయి). వీరు బలోపేతమైన వేదాంత శాస్త్ర పట్టభద్రులు. వీరికి అసంఖ్యాకమైన రాజ్యపదవులు కూడా ఇరువైపులా నిలబడే బంట్లు. హరిశంఖచక్రములను శరీరంపై లాంఛనములుగా ధరించిన శూరులకు విజయపరంపరలు ఇంటనే కొలువుండకపోతాయా? ఇటు శ్రీవేంకటేశ్వరుని శరణాగతులకు వారు పొందిన పుణ్యములు ప్రశ్నయే కాదు. దైవజ్ఞులైన (భవిష్యద్దర్శకులైన) వారికి అనేకములైన భోగములు వెంటబడి వస్తాయి.

*** ఆవటించు = పొందిన * అడువుగాదు = ప్రశ్నయే కాదు**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

80 సంఖ్య : 309 సంపుటము: 15 పుట: 208 రాగం: సామంతం

**పల్లవి:** **నీయంతవాఁడనా నేను నేరము లే మెంచేవు**
**యీయెడ నిరుహేతుకకృపఁ జూడు నన్నును**

**చ. 1:** **నిరతి నిన్నెఱుఁగను నీవు నన్నెఱుఁగుదువు**
**ధర యాచకుఁడ నేను దాతవు నీవు**
**వరుస నీచుఁడ నేను వైకుంఠపతివి నీవ**
**నరుఁడ నేను నీవు నారాయణుఁడవు**

**చ. 2:** **సారె నలసుఁడ నేను సర్వశక్తివి నీవు**
**ధీరుఁడవు నీవతి దీనుఁడ నేను**
**కారుణ్యమూర్తివి నీవు కఠినచిత్తుఁడ నేను**
**మేరతో నీ వేలికవు మీ దాసుఁడ నేను**

**చ. 3:** **జననశీలుఁడ నేను జనకుఁడవు నీవు**
**ఘనవేదాంతనిధివి కర్మిని నేను**
**అనిశము శ్రీవేంకటాచలేంద్రుఁడవు నీవు**
**పనుల నీ సంకీర్తనపరుఁడ నేను**

**భావదీపిక:**

పెదతిరుమలయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో స్వామితో ఇలా విన్నవించుకొంటున్నారు. ఓ దేవదేవా! నా నేరముల నేల యెంచెదవు? నేను నీయంతటివాడను కాదే! ఈ సమయమున, నిర్హేతుకముగా (ఏమిటి ఎందుకని ఆలోచించకుండా) నన్ను కృపతో జూడుము స్వామీ! నీపై ఆసక్తిజూపి నిన్నెఱుగుటకు నేను ప్రయత్నించనైతిని. కాని నీవు నన్ను పూర్తిగా యెఱుగుదువు. ఈ భూలోకములో, నేనొక యాచకుడను. మరి నీవో గొప్పదాతవు. నేను చెప్పనలవికాని నీచుడను. మరినీవో వైకుంఠపతివి. నేను మానవమాత్రుడను. నీవు నారాయణుడవు. అలసిపోవుటయే అలవాటైన వాడను నేను. మరి నీవు సర్వశక్తిమంతుడవు. నీవు అతి ధీరుడవు. నేనేమో దీనుడను. నీవు కారుణ్యమూర్తివి మరి నేనో కఠినాత్ముడను. నీవు మర్యాద తెలిసిన ఏలికవు. నేను నీ దాసుడను. పుట్టుకలతో అలసిపోయే వాడను నేను. పుట్టుకనిచ్చే జనకుడవు నీవు, ప్రభూ! నీవు గొప్ప వేదాంత నిధివి, నేను కర్మబద్ధుడను. అనవరతమూ నీవు, వేంకటాచలపతివి. అదేపనిగా నేను నీ సంకీర్తనపరుడను.

*** మేరతో = మర్యాదతో; * అనిశము = నిరంతరము**

81 సంఖ్య : 50 సంపుటము: 27 పుట: 34 రాగం: గౌళ

**పల్లవి:** **నీ వాపెకు మగఁడవు నేరుపరివి**
**సేవ లాపె చేసినవి చేకొనఁగరాదా**

**చ. 1:** **సరసమాడఁగఁబోతే చన్నులపై కొంగు జారె**
**కరముల మొక్కితే కంకణాలు జారె**
**శిరసు వంచి యందుకు సిగ్గువడి వున్న దిదె**
**తరుణి నుపచరించ దండకు రారాదా**

**చ. 2:** **పొంచి కానుకియ్యఁగాను పోఁక ముడి వదలెను**
**కొంచక పాదాలొత్తఁగా కొప్పు గదలె**
**అంచెల నంతలోననే అలసి నివ్వెరగొందె**
**చెంచెలాక్షి సేదదేర్చి చనవియ్యరాదా**

**చ. 3:** **గందము నీకుఁ బూయఁగా కాఁగిటిలోనఁ దగిలె**
**సందడిఁ బల్కఁగా మోవిచవులు రేఁగె**
**అంది శ్రీవేంకటేశుఁడ ఆనందించుకొన్నది**
**ఇందుముఖిబాలఁ జిక్కి ఇంపు చూపరాదా**

**భావదీపిక:**

అన్నమయ్య ఈ మధుర కీర్తనలో తాను శ్రీహరి చెలికత్తె వలె యేమంటున్నారో వినండి. స్వామీ! నీవామెకు పరాయివాడవా? సాక్షాత్తు తాళికట్టిన మగనివి, పైగా చతురుడవు. ఆమెకు హృదయంలో స్థానమిచ్చిన ప్రియుడవు. మరికనేమి? ఆమె చేసిన సేవలు చేకొనరాదటయ్యా! స్వామీ! ఆమె యెంత కంగారుపడుతున్నదో చూడు. నీతో కొంటెగా సరసమాడబోతే ఆమె కుచద్వయము పైనుండి పైట తొలగుచున్నది. ఒంగి నీ పాదాలకు మొక్కబోతే చేతి కంకణాలు జారిపోతున్నాయి. తన తత్తరపాటుకు సిగ్గుపడి ఆమె తలవంచుకొని యున్నది. ఆ తరుణికి వుపశమనము కలుగునట్లు దగ్గరకు రారాదా స్వామీ? నీకోసం ఆమె యేదో కానుక తెచ్చింది. అది నీకివ్వాలని ప్రయత్నిస్తుంటే ఆమె చీర పోకముడి సడలినది. నీకు సేవ చేద్దామని పాదములొత్తబోతే ఆమె కొప్పు కదలిపోయింది. అంతదానికే ఆ సుకుమారి అలసిపోయి నిశ్చేష్ట అయినది. మరి ఇకనైనా ఆ చంచలాక్షి సేదదీర్చి ప్రేమగా వశుడవౌట తగును కదా! స్వామీ! నీవూ తక్కువ వాడవా? ఆమె నీకు గంధములద్దబోతే సందిట జేర్చినావు. సందడి చేస్తూ మాటలాడబోతే మోవి చవులాస్వాదించావు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఆమెనీకు జిక్కి నిన్నానందపరచినది. నీవు ఆ ఇందుముఖికి ఇంపుసేయరాదా?

*** దండకు = వద్దకు, * నివ్వెరగు = నిశ్చేష్ట**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

82 సంఖ్య : 441 సంపుటము: 17 పుట: 254 రాగం: సామంతం

**పల్లవి: నేటనే తెలునో నీచందము మాకు**
**నాటివారు గాన రైరి నవ్వుల నీచందము**

**చ. 1: సరుగ నావులఁ గాచేచంద మేఁటిచందము నీవు**
**తిరిగి గోవర్ధన మెత్తిన దేఁటిచందము**
**సరి రోల గట్టువడ్డచంద మేఁటిచందము అట్టె**
**తొరలి మద్దులు గూలదొబ్బిన దేచందము**

**చ. 2: జాతిగొల్లవాఁడవైనచంద మేఁటిచందము ని**
**న్నీతల బ్రహ్మ నుతియించి దేటిచందము**
**జాతకపు పసిబాలచంద మేఁటిచందము అట్టే**
**బూతకిఁ జంపిన నీపొందు లేటిచందము**

**చ. 3: తచ్చన గోపికలన్న తగులు నీ చందము**
**మెచ్చుల శ్రీవేంకటేశ మెఱసె నీ చందము**
**రచ్చల ద్వారకలోన రాజవైనచందమూ నేఁడు**
**యిచ్చల దేవుఁడవయిన యెక్కుడు నీ చందమూ**

**భావదీపిక:**

పెదతిరుమలయ్య వేంకట కృష్ణయ్యతో యేమని అంటున్నారో ఆలకించండి. స్వామీ! నీవిధానములను మేము ప్రకాశముగా నెరుగగలమా!! ముదము నందించు నీ విధానములను ఆనాటివారే తెలియర్రైరి. ఇక మేమెంత? అతి సరసముగా నీవు ఆవులను కాచిన విధానమెట్టి అద్భుతమైనది!! ఆనాడు గోవర్ధనగిరి నెత్తావే అదెట్టి చందము (విధానము)!! అకుంఠిత భక్తికి తప్ప మరిదేనికీ కట్టుబడని నీవు రోటికి కట్టబడిన చందము విచిత్రమే కదా! నీవు మద్దిచెట్లను కూలదొబ్బినదెంత అబ్బురము!! భరద్వాజ గోత్రీకుడవైన వేంకటనాథా! నీవు గొల్లజాతివాడవైనదదెట్టి విచిత్రమైన చందము!! మరి ఇవతల బ్రహ్మదేవుడు నీకాళ్లు కడిగాడా!! దాన్నేమనవలెను? పసిబాలుడవైన నీ జాతకము వ్రాయించుట అదెంతటి విచిత్రము!! అట్లే పూతకిని (పూతనని) చంపినదదెంత విచిత్రము!! కపటివైన నీ అనురాగమును గొల్లభామలపై చూపి వారిని తగులుకొన్న విధానమదెంత విచిత్రము!! మెప్పుదల పొందిన వో శ్రీవేంకటేశ్వరా! ద్వారకలో రాజ్యసభలో రాజ్యమునేలిన చందమదెంత విచిత్రము!! నేడు మా అందరి కాధారమైన దేవుడవుట యెట్టి చందము!!

*** తచ్చన = కపటము, * తొరలి = యెదుర్కొని**

83 సంఖ్య : 150 సంపుటము: 3 పుట: 000 రాగం: దేసాళం

**పల్లవి: పచ్చిదేరుచు నుట్ల పండుగాయను**
**గచ్చులకు గొల్లెతలు కాఁగిలించి పట్టగా**

**చ. 1: పీతాంబరముమీఁద పెద్ద కిరీటముమీఁద**
**నేతిపాలచార లెల్ల నిండె నదివో**
**జాతి గొల్లెతల వుట్లు సారెఁ గోలలెత్తి కొట్టి**
**చేతులు చాఁచారగించి చిమ్మి రేఁగఁగాను**

**చ. 2: సొరిది సొమ్ములమీఁద సోయగపుచెక్కులపై**
**పెరుగులు మీఁగడలు పేరుకొనెను**
**అరుదుగ వీధులను అందరి వుట్లు గొట్టి**
**దొరతనములతోడ దొమ్మి సేయఁగాను**

**చ. 3: పూని శ్రీవేంకటేశుపై పొందె(దియ?) లమేలుమంగపై**
**తేనెలునుఁ జక్కెరలుఁ దెట్టెగట్టెను**
**నానావిధములను నడుమ నుట్లు గొట్టి**
**ఆనందాన నారగించి అలరుచుండఁగను**

**భావదీపిక:**

"పచ్చిదేరు" (పచ్చిగా ఆరడి పనులు చేసే) వుట్ల పండుగను వర్ణిస్తున్నారు అన్నమయ్య. గచ్చులకు (కపటంతో మాయచేసి కృష్ణుడు గొల్లెతలను అల్లరి చేస్తుంటే వారు వీడెక్కడ పారిపోతాడోనని కౌగలించుకొని మరీ పట్టుకొన్న వుట్ల పండుగ వచ్చింది దాని శోభనాలకించండి. వీడు పీతాంబరము గట్టి పెద్ద కిరీటమును ధరించినాడు. కాని అదిగో వాటిమీద నేతి మరకలు పాలచారలు కనుపిస్తూనే వున్నాయి. గొల్లజాతి స్త్రీలు వుట్లలో దాచికొనిన నేయి, పాలు, పొడుగాటి కొలలెత్తి (కఱ్ఱలను చాచి) పగులగొట్టి అరచేతులుచాచి ఆ కారిపోయే ధారలను పట్టి త్రాగి చిమ్మిరేగి (విజృంభించి) యున్నాడు. ఇంకొక ఋజువు చూపిస్తాము. బాగా చూడండి. ఈ కృష్ణుడు వరుసగా వేసికొనిన సొమ్ములమీద (ఆభరణములపై) సొంపైన వాడి చెక్కిళ్ల మీద వాడు తినిన పెరుగు మీగడలు పేరుకుపోయి, మనకు కనిపిస్తున్నాయి చూడండి. అప్పుడప్పుడు వీధులలో మక్కు ముఖము తెలియనివాళ్ల వుట్లనన్నీ కూడ కొట్టి తానే "దొర" నన్నట్లు దొమ్మి సేయగాను (దోపిడీ చేస్తుంటే) కళ్లారా చూడండి. అంతెందుకు, పూనికతో చూచినారంటే ఈ కలియుగపు శ్రీవేంకటేశ్వరునిపైన, ఆయన దేవేరి అలమేల్మంగపైన తేనెలు చక్కెరలు ఆనాటివే పేరికొని అవి అతి మధురంగా తయారైనాయి. రకరకాలైన వుట్లను ఈ పండుగనాడు కొట్టి ఈ దంపతులు ఆరగించి అతిశయించుచున్నారు.

*** సొరిది = వరుసగా వేసికొనిన; * దొరతనముతో = రాచఠీవితో**

84 సంఖ్య : 58 సంపుటము: 1 పుట: 39 రాగం: భైరవి

**పల్లవి:** **పట్టవసముగాని బాలుఁడా పెనుఁ**
**బట్టపుబలువుఁడ బాలుఁడా**

**చ. 1:** **ఇరుగడ బ్రహ్మయు నీశ్వరుఁడును నిన్ను**
**సరుస నుతింప జఠరమున**
**అరుదుగ నుండి ప్రియంబున వెడలిన-**
**పరమమూర్తివా బాలుఁడా**

**చ. 2:** **తల్లియుఁ దండ్రియుఁ దనియనిముదమున**
**వెల్లిగ లోలో వెఱవఁగను**
**కల్లనిదురతోఁ గనుమూసుక రే-**
**పల్లెలోఁబెరిగినబాలుఁడా**

**చ. 3:** **యేదెసఁ జూచిన నిందరిభయముల-**
**సేదలు దేఱఁగఁ జెలఁగుచును**
**వేదపల్లవపువేంకటగిరిపై**
**పాదము మోపినబాలుఁడా**

**భావదీపిక:**

బాలకృష్ణునిపై చక్కని కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఈ బాలుడు పట్టుటకు సాధ్యముకానివాడు. ఇతగాడు పెను బట్టపు బలువుడు (గొప్ప బిరుదు సంపాదించిన బలశాలి) ఇతనిని బాలుడనతగునా? పరమమూర్తి (విశ్వరూపుడైన) అయిన వాని జఠరము (పొట్టలో) పదునాలుగు భువనములతో పాటు రెండు పార్శ్వములయందు బ్రహ్మ, మహేశ్వరుడు నిలిచి భక్తితో నుతిస్తుంటే ప్రేమగా వెలువడి వారి స్తుతిని వింటుంటాడు. వీడు బాలుడా!! ఈ బాలుడు పుట్టినప్పుడు తానే పరబ్రహ్మనని చూపగా వాని తల్లిదండ్రులైన దేవకీ వసుదేవులు పైకి ఒక పక్క ఆనందంతోనూ,ఒక పక్క భయంతోనూ చేతులు జోడించి మ్రొక్కారు. దొంగ నిద్రపోతున్న శిశువును మూసిన కనులను రేపల్లెలో యశోదాదేవి పాన్పుపై తెరిచి, పెరిగాడు. ఆ బాలుడా వీడు (శ్రీవేంకటేశ్వరుడు). ఆ కృష్ణయు దిక్కులందుగల దీనుల వెతలను బాపినాడు. అందరి శ్రమలను తొలగించినాడు. వేదమంత్రములే తరువులై వెలసిల్లే వేంకటగిరిపై పాదము మోపి ఇంటింటి దైవమైన ఈ నిత్యపెండ్లికొడుకు బాలుడా!!!

*** పట్టపు బలువుడు = బిరుదు గొనినబలశాలి; * ఇరుగడల = రెండు పార్శ్వములలో**

85 సంఖ్య: 61 సంపుటము:1 పుట:41 రాగం: శంకరాభరణం

**పల్లవి:** **పదిలము కోట పగవారు**
**అదనఁ గాచుకొందు రాఱుగురు**

**చ. 1:** **ఇమ్మెఁ జెప్ప యిందరిచేత**
**తొమ్మిదినెల్లఁ దోఁగినది**
**కొమ్మతీరునఁ గుదురైనకోట**
**దొమ్మికాండ్లె దుగు రుందురు**

**చ. 2:** **వొంటికాఁడె రాజు వుడుగక తమలోన**
**వొంటనీనిమంత్రు లొక యిద్దరు**
**దంటతనంబునఁ దమయిచ్చఁ దిరిగాడు-**
**బంటు లేడుగురు బలవంతులు**

**చ. 3:** **కలవు తొమ్మిది కనుమల తంత్రము**
**నిలుపఁగలిగినట్టినెరవాదులు**
**తెలిసి కొనేటితిమ్మనాయఁడు చొచ్చె**
**బలిసె యీకోట భయమేల**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ అధ్యాత్మ కీర్తన బుఱ్ఱకెక్కాలంటే గట్టిగా ఆలోచించాలి. దైవకృప అధ్యాత్మ చింతన వుండాలి. ఎందుకంటే ఇందులో పైకి వినిపించే మాటలు వేరు. లోపలి గూడార్థం వేరు. జాగ్రత్తగా చదవండి మరి. అయ్యలారా! దేహము అని పిలువబడే మీ"కోట" పదిలము (జాగ్రత్త) సుమా! ఈ కోటలో చాలామంది పగవారు వున్నారయ్యా! ఇందరిచేత ఇంపైనదిగా పేర్కొనబడిన ఈ కోట ఒకప్పుడు తొమ్మిది నెలలు చీకట్లో దోగినది (బిక్కుబిక్కుమంటూ చీకట్లో తల్లిగర్భంలో పాకులాడింది). లేత కొమ్మమాదిరి కుదురైన ఈ కోటను ఆరుగురు గజదొంగలు ఆక్రమించుకున్నారు. (కామము, క్రోధము, మోహము, లోభము, మదము, మత్సరములే ఆ గజదొంగలు). వారు దానిని చెడగొడుతున్నారు. ఈ కోటలో ఒంటరివాడై రాజు (జీవుడు) ఉడుగక (విచారము లేకుండా) వుంటాడు. ఆయనకు తోడు తనవెంట తెచ్చుకొన్న ఇద్దరు మంత్రులు (గత జన్మల పాపము మరియు పుణ్యము). వారి ఇష్టానుసారం సుఖదుఃఖాలనుభవిస్తుంటాడు. ఆయనకు మొండితనముగల బంట్లు యేడుగురు (వాళ్లే పంచేంద్రియములు, మనస్సు, అహంకారము) తోడుంటారు. ఆ కోటకు తొమ్మిది కనుమలు రహస్య దారులున్నాయి. వాటిని కప్పుతూ అనేక తీగెలున్నాయి. (అవే నవరంధ్రాలూ, ధమనులు, సిరలు అని పిలువబడే నరాలు). వాళ్లు గొప్ప సమర్థులు. కోనేటి తిమ్మ నాయుడైన శ్రీవేంకటేశ్వరుడు ఈ కోటలో చొచ్చి వున్నంత వరకూ యేమీ భయంలేదు. ఆ శ్రీహరి దయలేకపోతే వాడూ "హరీ" అంటూ పోతాడు.

*** దంటతనము = మొండితనము; * కనుమలు = దారులు**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

86 సంఖ్య: 327 సంపుటము: 3 పుట:221 రాగం: లలిత

**పల్లవి:** **పుట్టినమొదలు నేను పుణ్యమేమీఁ గాననైతి**
**యెట్టు గాచేవయ్య నన్ను యిందిరానాథా**

**చ. 1:** **కామినులఁ జూచిచూచి కన్నులఁ గొంతపాపము**
**వేమరు నిందలు విని వీనులఁ గొంతపాపము**
**నామువారఁ గల్లలాడి నాలికఁ గొంతపాపము**
**గోమునఁ బాపము మేనఁ గుప్పలాయ నివిగో**

**చ. 2:** **కానిచోట్లకు నేఁగి కాఁగిళ్ళఁ గొంతపాపము**
**సేన దానాలందుకొని చేతులఁ గొంతపాపము**
**మానని కోపమే పెంచి మతిఁ గొంతపాపము**
**పూని పాపములే నాలోఁ బోగులాయ నివిగో**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ చక్కని అధ్యాత్మ కీర్తనలో అనుక్షణం తన పంచేంద్రియాలూ, మనస్సూ అరిషడ్వర్గాల పీడ తట్టుకోలేకపోతున్నాయి. కావున దయదలచమని స్వామిని వేడుకొంటున్నారు. ప్రభూ! పుట్టినది మొదలు ఏ పుణ్యమూ చేయలేదు. ఇందిరానాథా! నన్నిక యెట్లు రక్షిస్తావయ్యా? అంటున్నారు. కామ భావనతో స్త్రీలను చూచి చూచీ నా కన్నులు కొంత పాపము మూటగట్టుకున్నాయి. పరుల మీద నిందలు విని వినీ నా చెవులు కొంత పాపము మూటగట్టుకొన్నాయి. నాముువార (పిడచకట్టు కొన్నా) అబద్ధములాడి ఆడీ నా నాలుక కొంత పాపము చేసింది. ఇదిగో యీ విధంగానే నా పాపము కుప్పలా పేరుకుపోయింది. దేవా! వెళ్లకూడని చోట్లకు వెళ్లి వెళ్లి నా కాళ్లు కొంత పాపము పోగుచేసికొనినవి. పట్టకూడని దానములను పట్టి పట్టీ నా చేతులు కొంత పాపము అంట కట్టుకొన్నాయి. మానుకోలేని కోపమును పెంచి పోషించి నా మనస్సు కొంత పాపము చేసింది. ఇదిగో యీవిధంగా పూని పనిలేక చేసిన పాపాలు నాలో పోగులాయ (రాశివలె అయినవి) తండ్రీ! ఇదీ అదీ అని లేకుండా అనేక పాపాలను చేశాను కాబట్టి నీకు చెప్పే చోటు కూడా లేదు. అందుకే నిన్ను శరణు జొచ్చి నీ దాసుడనయ్యాను. నన్ను దయదలచవయ్యా! నా యీ పద్ధతులు తెలిసి కూడా నిన్నేమని ప్రార్థించగలను? ఓ శ్రీవేంకటేశ్వరా! ఆయబోయ (అయిందేదో అయింది) ఇక నీవే దిక్కు.

*** సరవులు = పద్ధతులు, * సేనదానాలు = చాలాదానములు**

87 సంఖ్య:62 సంపుటము:27 పుట:42 రాగం: పాడి

**పల్లవి: పొద్దువోక నే నూరకే పొదిగేఁగాక**
**తిద్దరాని గుణములు తీరువడీనా**

**చ. 1: పొరలింపు మాట లాడి పొద్దుగడపేవాని**
**కరకరిఁబెట్టఁగాను కలిగేదేమీ**
**గొరబైన వలపులు కుప్పచేసి రమణుని**
**దరవులు వెట్టఁగాను తనివయ్యీనా**

**చ. 2: చుట్టరికములే చూపి చొక్కులఁబెట్టేవాని**
**నెట్టుకొని సొలయఁగా నిలిచేదేమి**
**బట్టబయలు నవ్వులు పచరించి రమణుని**
**జట్టిగొని పెనఁగఁగా సవులయ్యీనా**

**చ. 3: ఆయము లూరకే యంటి ఆసలఁబెట్టేవాని**
**చేయిచాఁచి చెనకఁగా చేరేదేమి**
**యియ్యెడ శ్రీ వేంకటేశుఁ డీతఁడే నన్నుఁగూడె**
**వేయైనాఁ దనకు నిఁక వేసటయ్యీనా**

**భావదీపిక:**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ సరస శృంగార కీర్తన పల్లవినే ఈనాటి తెలుగులో చెప్పాలంటే “ఏదో పొద్దుపోక ఊరకనే, నేను కమ్ముకొని ఓ కంట కనిపెడుతుంటాను గాని, మార్చలేని బుద్ధులను చక్కబెట్టగలమా? నేనెంత తాపత్రయపడినా, ఆయన మారిపోతాడా?” అనాలి. పొరలింపు మాటలు (పొంగిపోయే తీపి మాటలు) చెప్పి పొద్దుబుచ్చేవాడిని, యెంత కరకరలు బెట్టినా (కోపము చూపించినా) కలిగే ప్రయోజనమేమిటి? మిక్కిలి గొరబైన వలపులను (కపట ప్రేమలు) కుమ్మరించే మగవానిని తరువులుబెడితే (బాధిస్తే) నాకేమన్నా తృప్తి కలుగుతుందా? కనబడిన ఆడుదానితో తనకూ ఆమెకు చుట్టరికము వున్నదని పరవశింపజేసే వానితో నేను పట్టుబట్టి శ్రమపడినా నిలిచే కాపురం యెంతకని నిలుస్తుంది? అందరూ చూస్తుండగా నేను నవ్వులొలకబోసి నా రమణుని జట్టిగొని (వశపరచుకొని) పెనవేసుకొనిన బాగుంటుందా? వనితల కళాస్థానములను తాకుతూ ఆసలబెట్టు (కోర్కెలను పెంచు) వానిని చేబూని చెనకినా (ఎదిరించినా) వచ్చేదేమిటి? ఈవేళ పైవిధంగా నన్ను కలవరబెట్టిన శ్రీవేంకటేశ్వరుడే తానంతట తాను వచ్చి నన్ను గూడినాడు. ఆయన శృంగార రాయడు. నాలాంటి వలపు కత్తెలు వేయైన (వెయ్యిమందైనా) ఆయనకి వేసట (అలసట) ఉండదు.

*** సవులయ్యీనా = బాగుంటుందా, * ఆయములో = కళాస్థానములు**

88 సంఖ్య : 442 సంపుటము: 17 పుట: 255 రాగం: దేసాళం

**పల్లవి:** **పోయినాఁ బోనీడమ్మాఁ పోయినా బోసి డమ్మా**
**పాయక కొంగువట్టీ వీఁడు**

**చ. 1:** **యెదురైతే మొక్కేఁ నెవ్వాఁడమ్మా**
**అదనెఱుఁగఁడు అవునే వీఁడు**

**చ. 2:** **మగనాలి నన్నా మావా డమ్మాఁ**
**నగీ నేడనైనా నాతో వీఁడు**

**చ. 3:** **యింతలో శ్రీవేంకటేశుఁడమ్మాఁ**
**యెంత సేసి కూడె నేమే వీఁడు**

**భావదీపిక:**

పెదతిరుమలాచార్యులవారు చెప్పిన సరస శృంగార కీర్తన నాస్వాదించండి. కీర్తనను బట్టి ఇది రేపల్లెలోని గొల్లెత వేరొక చెలికి దీనిని చెబుతున్నది. తాను భర్త చాటు ఇల్లాలని కూడా చూడక ఆ కృష్ణయ్య ఎక్కడ పడితే అక్కడ తనతో నవ్వుతూ మాట్లాడతాడట. సరసత్వంలో పెదతిరుమలయ్య తన తండ్రికి యెందులోనూ తీసిపోడు. ఈ కీర్తనలో గోపిక యేమంటున్నదో వినండి. నన్ను ఒడిసిపట్టుకొని యెందునా పోనీడమ్మా (యెక్కడికి పోనీయుడమ్మా) పోతానన్నా పోనీయడు. వీడు పాయక (వదలక) కొంగుపట్టుకొంటాడమ్మా! వీడెవడమ్మా? నేను యెదురైతెచాలు మొక్కుతూనేవుంటాడు. సమయం, సందర్భం చూచుకొనడు. అవునే వీడు చేసేదంతా నటన అనిపిస్తుంది. అక్కడికీ నేను, మగనాలినిరా (మగనిచాటు భార్యనురా) అని చెప్పాను. ఆ మాటన్న తరువాత మాధవుడు, నేను యెక్కడ కనపడినా ముసిముసి నవ్వులొలకబోస్తాడు. ఇంతలో తానే శ్రీవేంకటేశ్వరుడై చేయాల్సిందంతా చేసి కూడినాడమ్మా. ఇంకేమి చెప్పమంటారు?

*** అదను = తగిన సమయము, * నగీ = నవ్వీ**

89 సంఖ్య : 383 సంపుటము: 3 పుట: 258 రాగం: లలిత

**పల్లవి:** **పెద్ద తెరువుండఁగాను పెడగంతలు దీసుక**
**పొద్దువోక యడవులఁ బుంగుడయ్యేరు**

**చ. 1:** **తొల్లిటి పెద్దలెంచిరి దొడ్డవాఁడు హరియంటా**
**అల్లదె భారత రామాయణ భాగవతములు**
**ఇల్లిదె నేఁటి పెద్దలు యెవ్వరో దైవములంటా**
**వెల్లవిరిగా నింకా వెదకేరు**

**చ. 2:** **దేవలోకమువారు దేవుఁడు శ్రీపతియని**
**భావించి మొరవెట్టి బ్రదికిరి**
**యీవల నిప్పటివారు ఇందరికి మొరవెట్టి**
**కావిరి నెవ్వరివారుఁ గాక వున్నారు**

**చ. 3:** **నానాభూములవారు నమ్మి శ్రీవేంకటపతిఁ**
**గానవచ్చి యేఁటనేఁట ఘనులయ్యేరు**
**యీనిజ మిక్కడివారు యిన్నియుఁ దెలిశుండియు**
**మానక చలాలఁబోయి మాయలఁ బొందేరు**

**భావదీపిక:**

ఈ కీర్తనలో అన్నమయ్య ఉపయోగించిన పదములు ఆనాటి జన బాహుళ్యం, నిజ జీవితంలో తఱచూ వాడే మాటలు. కొంతమంది తెలివితక్కువ మనుషులు పెద్ద తెరువుండగా (ముఖ్యమైన రాజమార్గమున్ననూ) పెడ గంతలు తీసుక (సందులు గొందులు బట్టి) పొద్దుపోక అడవులలో, బుంగుడయ్యేరు (మునిగిపోతారు.. అంటే.. దారితప్పుతుంటారు). అనాదికాలము నాటి జ్ఞానులు సర్వశ్రేష్టుడు శ్రీహరి అని నుతించారు. అదిగో భారత, రామాయణ, భాగవతములు అనాది ఋషిప్రోక్తములై అదే చెప్పినవి కదా! ఇదిగో నేటి పిదప కాలం పెద్దలు యెవ్వరెవ్వరినో దైవము అని భావిస్తూ అతిశయంతో పలుకుతూ యింకో దేముడెక్కడైనా ఉన్నాడేమోనని వెదుకులాడుతున్నారు. దేవలోకములో ఉండే దేవుళ్లే తమ రక్షకుడు శ్రీపతి అని కీర్తిస్తుంటే, ఆయననే ధ్యానించి మొరపెట్టుకొని బ్రతుకుతుంటే ఈ మధ్య ఈనాటి వారు ఇంతమంది "దేవుళ్ళకు" మొక్కుతున్నారు, మొరపెట్టుకుంటున్నారు. అందుకే వారెవ్వరి కృపకూ నోచుకోవటం లేదు. అనేక దేశాలకు చెందిన అనేకమంది శ్రీవేంకటపతి తమ దేవుడని ప్రతియేడు ఆయనను దర్శించి ఘనులవుతుంటే.. ఇక్కడి వారు, ఈ నిజము తెలిసివుండీ మొండితనం మానక మాయలోపడిపోతున్నారు.

*** కావిరి = పొగచూరి నల్లనై, * వెల్లవిరిగా = ప్రకటితమగునట్లు**

90 సంఖ్య:446 సంపుటము:7 పుట:274 రాగం: పాడి

**పల్లవి:** **భావము దెలియరే పడఁతులాల**
**యీవలనావలాను యెన్నఁగొత్తలాయను**

**చ. 1:** **తొలుతనే కలువలు తుమ్మిదలనంపితేను**
**మొలచి తామెర వురుములనంపెను**
**అల చంద్రుఁడు కానరానట్టె కప్రమంపితేను**
**తొలఁకి చిగురాకులు దుర్గాలు చేకొనెను**

**చ. 2:** **గక్కన మొగలిరేకు కస్తూరి రేఁచితేను**
**మక్కువ మొల్లమొగ్గలు మణులానించె**
**యెక్కువ మరుని పుట్టినింటఁ దేరులు గూడితే**
**చక్కని కరితుండాలు చక్రముతోనమరె**

**చ. 3:** **ముగ్గని మెరుఁగుఁదీగె ముత్తేల పంట పండితే**
**వెగ్గళించి తేనెపండు వెన్నెలగాసె**
**అగ్గమై పువ్వులకొమ్మ ఆకులఁగాయలునిచ్చె**
**సిగ్గుల రాజ్యమేలె శ్రీ వెంకటేశుఁడు**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ పచ్చి శృంగార కీర్తన నింతకంటె వివరించడం భావ్యం కాదని నా మనవి. పైగా అన్నమయ్య తన భార్యలకీ కీర్తన వినిపించారేమోనని నా వూహ. సాధ్యమైనంత గోప్యం పాటిస్తున్నాను. ఈ పల్లవినే వినండి. ఓ భామలారా! భావమును తెలియుడు (నేను) ఇటు చెప్పినది, అటు చెప్పినది యెంచి చూస్తే నూతనమైన భావములు అనిపించక మానవు సుమా! అసలు మొట్టమొదటే కలువలవంటి ఆయన కన్నులను తుమ్మెదల గుంపు వంటి ఆమె కేశపాశము కప్పివేసినది. తామరపువ్వుల వంటి ఆయన పాదములను తటిల్లత వంటి ఆమె చూపులు తదేకంగా, ఆరాధనగా చూస్తున్నాయి. చంద్రునివంటి ఆతని మోము కర్పూర సుగంధభరితమైన ఆమె మేనినాక్రమించినది. చిగురాకుల వంటి స్వామి చేతులు దుర్గములవంటి పయోధరములనాక్రమించినవి. మొగలిరేకుల వాడి గోళ్లు ఆమె మేనిపై అలదిన కస్తూరిని నఖక్షతములతో రేపినవి. మొల్ల మొగ్గలవంటి ఆయన దంతములు కెంపులవంటి గాట్లను తేల్చినవి. మన్మథుని పుట్టినింట రమణుని కేతనమెగిరినది. ఏనుగు తొండములను బోలిన స్వామి చేతులు దేవి చక్రముతో నమరినది (జక్కువ పిట్టలను పట్టినవి). ముదరని మెరుపుతీగ వంటి దేవి ముత్యములవంటి పలువరుస కనబడునట్లు నవ్వినది. తేనెపండువంటి స్వామి పెదవులు వెన్నెలవంటి చిరునవ్వును కాసినవి. ఆమె పువ్వువంటి దేహం ఆకులను, పువ్వులను ఇచ్చింది. శ్రీ వేంకటేశ్వరుడు ఆమె సిగ్గుల రాజ్యమేలినాడు.

*** తొలకి = అతిశయించి, * ముగ్గని = ముదరని**

91 సంఖ్య : 165 సంపుటము: 3 పుట: 111 రాగం: శ్రీరాగం

**పల్లవి:** **భావించరే చెలులాల పరమాత్ముని**
**చేవదేరి చిగురులో చేఁగయై యుండెను**

**చ. 1:** **మలసి పన్నీట హరి మజ్జనమాడేవేళ**
**కలశాబ్ధిఁ దేలే మాణికమువలె నుండెను**
**అలరి కప్పుర కాపు అవధరించేటి వేళ**
**మొలచిన వెన్నెల మొలకయై యుండెను**

**చ. 2:** **అంచలఁ దట్టుపుణుఁగు అవధరించేటి వేళ**
**యెంచ నంజనాద్రిపై యేనుగై వుండెను**
**మించిన హారములెల్ల మేన నించుకొన్న వేళ**
**మంచిమంచి నక్షత్ర మండలమై యుండెను**

**చ. 3:** **వున్నతి నలమేల్మంగ నురమున నుంచు వేళ**
**పెన్నిధై పూచినట్టి సంపెంగవలె నుండెను**
**వన్నె శ్రీవేంకటేశుఁడు వరములిచ్చేటి వేళ**
**తిన్ననై యందరి భాగ్యదేవతయై యుండెను**

**భావదీపిక:**

తన చెలియలకు అన్నమయ్య ఈ కీర్తన పాడి శ్రీవేంకటపతి యొక్క పన్నీటి అభిషేకాన్ని వర్ణిస్తున్నారు. ఓ చెలులారా! పరమాత్ముని భావించండి. ఆయన యెట్లా వుంటాడో తెలియునా? “చిగురులో చేఁగ” (లేత చిగురులో కఠినమైన పదార్థం) వలె వుంటాడు. స్వామిని పన్నీటిలో మజ్జనం చేయిస్తుంటే పాలసముద్రం నుండి వెలువడిన మాణిక్యంలా వున్నాడు. మజ్జనము తరువాత కర్పూరపుధూళిమెత్తి కాపువేస్తారు కదా! అదెట్లా వున్నదంటే అప్పుడే మొలచిన వెన్నెల మొలకవలెనున్నది. ఆ తరువాత తట్టు పుణుగు అనునట్టి సుగంధద్రవ్యాన్ని ఆయనకు మెత్తినారు. అప్పుడాయన యేవిధంగా వున్నాడో తెలియునా? అంజనాద్రిపై నివసించే గజరాజవలె నున్నాడు. నవరత్నహారములను ధరించిన వేళ ఈస్వామి యెలావున్నాడో తెలియునా, నల్లని ఆకాశంలోని నక్షత్రమండలం వలెనే వున్నాడు. ఉన్నతముగా దేవి అలమేల్మంగకు తన వురముపై చోటిచ్చి హృదయరాజ్ఞిగా నెలకొల్పిన వేళ శ్రీపతివలె భాసించి పూచిన సంపెంగ వలెనున్నాడు. అందాల శ్రీవేంకటేశ్వరుడు భక్తులకు ఈప్సిత వరములనిచ్చువేళ, వారందరి భాగ్యదేవతలవలె నున్నాడు.

*** కలశాబ్ధి = పాలసముద్రము, * అవధరించు = బాగుగా ధరించు**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

92 సంఖ్య : 345 సంపుటము: 15 పుట: 232 రాగం: మాళవిగౌళ

**పల్లవి:** **భావింప నీ వొక్కఁడవే బహురూపాల నుండుదువు**
**దేవదేవ నీ మహిమ దెలియఁగ వశమా**

**చ. 1:** **నిన్నుఁ దలఁచేవారిలో నిజరూపుతో నుండుదువు**
**అన్ని జంతువులలోన నంతరాత్మవై వుండుదువు**
**పన్ని పంచభూతములలోపల నాధారమై వుండుదువు**
**వున్న మూఢులలో మాయ నొనగూడి వుండుదువు**

**చ. 2:** **సరుస తరువులలో చైతన్యమవై వుండుదువు**
**గరిమె రాక్షసులలోన కానరాక వుండుదువు**
**సురలందు యీశ్వరసూచనతో నుండుదువు**
**అరయ ముక్తులలోన ఆనందమవై వుండుదువు**

**చ. 3:** **జగము లన్నిటిలోన సాక్షివై వుండుదువు**
**తగిలి వేదములలోన అర్థమై వుండుదు**
**జిగి మించ సర్వదాను శ్రీవేంకటగిరి నుండుదు**
**సగుణమై దాసులకు సాకారమవై వుండుదువు**

**భావదీపిక:**

పెదతిరుమలయ్య వినిపించిన అతి చక్కని అధ్యాత్మకీర్తననాలకించండి. పల్లవి ఇలా సాగుతుంది. స్వామీ! భావించినచో నీవు వొక్కడివే గాని నీ రూపములు మాత్రం అనంతం. ఓ దేవాది దేవా! నీ మహిమను దెలియగ మాకు సాధ్యమా! నిన్ను యెవ్వరు, యే రూపమును తలచి ధ్యానిస్తే వారికారూపముతోనే నీవుందువు. జంతువులన్నిటిలోనూ అంతరాత్మరూపుడవై యుందువు. పంచభూతములన్నిటికీ ఆధారమై యుందువు. మూఢులకు మాయవలె యుందువు. చెట్లలో చైతన్యమువలె నుందువు. రాక్షసులలో కూడా నీవుంటావు కానీ, కానరావు. దేవతలయందు ఈశ్వరతత్వముతో ఉందువు. ముక్తులైనవారిలో ఆనందస్వరూపుడవై యుందువు. జగములన్నిటిలోనూ సాక్షీభూతుడవై యుందువు. వేదములన్నిటిలోను వాటి అర్థమువలె వుందువు. మించిన శోభలతో యెల్లవేళలా శ్రీవేంకటేశ్వరుడవై తిరుమల గిరులపై వుందువు. కానీ సుగుణముల దేవుడవై సాకారముతో నీ దాసులకు సదా వుందువు.

*** జిగిమించి = అతిశయించిన శోభతో, * చైతన్యము = కదలిక**

93 సంఖ్య : 164 సంపుటము: 3 పుట: 110 రాగం: సాళంగనాట

**పల్లవి:** **భీకరపు చక్రమదె పిడుగులు రాలీనదె**
**పైకొని నిలువరాదు పారరో దిక్కులకు**

**చ. 1:** **బండికండ్లరవమదే బంగారుమెఱుఁగులవే**
**కొండవంటి రథమదె గొడగులవే**
**మెండుగ దేవుఁడు వీధి మెరసి యేతెంచీ వాఁడే**
**బందుబందై యసురలు పారరో దిక్కులకు**

**చ. 2:** **గరుడధ్వజమదే ఘంటారవములవే**
**సొరిది ముత్యాలకుచ్చులు నవే**
**బిరుదుశంఖము(మ్రోంత బెరయించీ దేవుఁడదే**
**పరగ దానవులెల్లఁ బారరో దిక్కులకు**

**చ. 3:** **ముంగిట బలములవే మొరసీ భేరులవే**
**సంగతిఁ బ్రతాపమదే సాకారమదే**
**కుంగ కలమేలుమంగఁ గూడి శ్రీవేంకటేశుఁడు**
**భంగపెట్టీ దైతేయులు పారరో దిక్కులకు**

**భావదీపిక:**

రథోత్సవపు వైభవాన్ని వర్ణిస్తున్నారు అన్నమయ్య. అల్లదేమన యెదుటనున్నదే భయంకరమైన సుదర్శనచక్రము. పిడుగురాలి పడుతున్న ఆ భీకర దృశ్యాన్ని చూడండి. దాన్ని యెదిరించి నిలువరించడం అసాధ్యం. మీకు తోచిన దిక్కుకు పారిపోయి బ్రతికే ప్రయత్నం చేయండి. గొప్పరథం వేగంగా పోతుంటే ఆ బండిచక్రాలు చేసే ధ్వని వలె వుంది ఈ చక్రపు ధ్వని. అది వస్తుంటే బంగారు రంగులో మెఱుపులు మెఱుస్తున్నాయి.ఆ చక్రం ధరించి స్వామివారు వస్తుంటే ఆయన రథం కొండవలె వున్నది. ఆ దేవదేవుడు వీధులగుండా మెరుస్తూ వస్తున్నాడు దైత్యులు బందుబందై (పటాపంచలై) పారిపోండిరా! మీ ఇష్టం వచ్చిన దిక్కుకి పారిపోండి. అదిగో గరుడధ్వజము రెపరెపలాడుతూ కనబడుతున్నది. దానికి కట్టిన గంటలు గొప్ప ధ్వని చేస్తున్నాయి. వ్రేలాడుతున్న ముత్యాల కుచ్చులు యెలా వూగుతున్నాయో చూడండి. సమర్థవంతమైన ఆ పాంచజన్య శంఖధ్వని విన్నారా? దానితో ఆ దేవోత్తముడు అందరినీ చలింపజేస్తున్నాడు. ఓరి దానవులారా! పారిపోండిరా! అదిగోయెదురుగా వస్తున్నదే బలమైన ఆయన సైన్యం. వారు మ్రోగిస్తున్న భేరువుల ధ్వని వినిపిస్తున్నదా? వారి సంగతి (కూటమి) ప్రతాపము మూర్తీభవించినట్లున్నది. సాకారముగా స్వామి దర్శనమిస్తున్నాడు. వెనుదీయక తన దేవేరి అలమేల్మంగను వెంటబెట్టుకొని శ్రీవేంకటేశ్వరుడు దైతేయులను (రాక్షసులను) భంగపరచుటకు వస్తున్నాడు. చూస్తారేం.. పారిపోండిరా! తోచిన దిక్కుకు పోండి.

*** బెరయించు = చలింపజేయు, మొరసీ = ధ్వనించే**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

94 సంఖ్య : 99 సంపుటము: 2 పుట: 67 రాగం: పాడి

**పల్లవి:** **భోగసహాయులె పొరుగెల్లా**
**ఆగమవిదు(ధు) లును ననంతములు**

**చ. 1:** **కులమునఁ జుట్టాలు కోటాఁనగోట్లు**
**కలిమిలేమి కొక్కఁడనే గుఱి**
**పలులంపటముల ప్రజలే యిందరు**
**నిలిచిన చోటికి నే నొక్కఁడనే**

**చ. 2:** **చెట్టడిచిన నిదె చేటఁడు పండ్లు**
**గుట్టు దెలుసుకొన గురి నేను**
**వొట్టుక సంసార మూరల్లా నిదె**
**పుట్టినప్పటికి భువి నొక్కఁడనే**

**చ. 3:** **చనవుమనవులకు జగమెల్లా నిదె**
**కొనకు మొదలికిని గురి నేను**
**యెనయుచు శ్రీవేంకటేశుఁ డేలెఁ గన**
**నినుపుగమికాఁడ నే నొక్కఁడనే**

**భావదీపిక:**

అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో యేమంటున్నారో వినండి. మన పొరుగున వున్న అందరూ భోగ సహాయులే (మనము భోగములనుభవిస్తున్నప్పుడు తోడుండే వారే). అనంతములైన వేదోక్త విధులను నిర్వర్తించటానికి, ఒక్కడు కూడా తోడుండడు. నా కులములో నాకు యెంతోమంది చుట్టాలున్నారు. కాని నా కలిమిపోయిన నాడు వొక్కడంటే వొక్కడు కూడా కానరాడు. ఇందరును (అందరు) ప్రజలూ అనేక లంపటాలలో చిక్కుకొన్నవారే. కాని ఈరోజున నేనున్న చోటున ఒంటరిగా మిగిలిపోయాను. చెట్టును విదిల్చితే చేటనిండా పండ్లు దొరుకుతాయి అంటే యెంత కష్టపడితే అంత ఫలము దక్కుతుంది. నేను ఈ గుట్టు తెలిసినాక నా లక్ష్యమేమిటో తెలిసింది. ఊరినిండా సంసారములో వొట్టుకొన్నవారే (తగులుకొన్నవారే). కాని నేను పుట్టినదీ వొంటరిగానే, పోయేదీ వొంటరిగానే సుమా! జగత్తులో అంతా చనువుతో కూడిన మనువులే కోరుకుంటారు. దీనిలో ఆద్యంతాలలో నేనే లక్ష్యముగా వున్నాను. నన్ను అతిశయించిన శ్రీవేంకటేశ్వరుడు యేలినందు వలన నేనొక్కడినే సమృద్ధమైన జీవుడను.

గమనిక: ఇది స్వామి నాకు స్ఫురింపజేసిన భావము.

*** నినుపు = సమృద్ధమైన, * చెట్టడచిన = చెట్టును విదిలించిన**

95 సంఖ్య : 454 సంపుటము: 15 పుట: 305 రాగం: కాంబోది

**పల్లవి:** మక్కు వలర జేరులైన మంచిపండు చూచి నోరు
గుక్కిళ్ళు మింగఁ జొచ్చె కొమ్మ యేమి సేతమే

**చ. 1:** పేరులేని రూపులేని పెద్దగురువు నొకనిఁ దలఁచి
వూరులేని యింటిలోన నుండఁ దలఁపఁగా
కూరలేని కూడు మిగులఁ గుడువఁ దలచి యాసపడెడు
నీరజాక్షి యొకతె దీని నెలఁత యేమి సేతమే

**చ. 2:** అడుగులేని కడువలోన నధికమైన నీట నగ్గి
కడఁగి రవులుకొలిపి లోన గాలి చేతఁ గాఁగఁగా
వుడుకుదెరఁగ కందులోన నుడుకకుండు టెఱుఁగ రాచు
వెడలిపోవు టెఱుఁగరాదు వెలది యేమి సేతమే

**చ. 3:** మాఁకులేని పువ్వులందు మంచిమంచి రేకు లెల్ల
వేఁక పడక చేకొనియ వేంకటాద్రినాథుఁడు
తోఁకవంక పెద్దతెరువు తోవ గానరాక వోయె
కాఁకదేర దీ తలఁపు కాఁత యేమి సేతమే

**భావదీపిక:**

అన్నమయ్య వినిపించిన ఈ కీర్తన శృంగార ఛాయల మిక్కుటముగానున్న అధ్యాత్మ కీర్తన. పెద్దల సహకారంతో దీనిని ఈ క్రింది విధంగా అర్థం చేసికొనగలిగాను. దేవి తన చెలికత్తెతో ఇలా అంటున్నది. ఓ చెలియా! అతగాడు మక్కువతో నాచేరువయై దొండపండువంటి నాపెదవిని చూశాడే. అంతే అతని నోరూరింది. నన్ను జూచి గుక్కిళ్ళు మింగసాగాడు. ఓ కొమ్మా! (భామా!) నేనేమి సేతును జెప్పవే. చెలీ! అందరికీ పెద్దగురువైన ఇతగాడు ఒకపేరు, రూపమూ లేనివాడు. ఊరులేని ఇంటిలో (జీవుల మనస్సులో) వుంటాడు. కనుక ఇతడు కూరలేని కూడు లాంటి ప్రేమలేని వలపు నాపై కుమ్మరిస్తున్నాడు. నీరజాక్షియొకతె (దానిపేరు పద్మావతి) దీనినంతా భరిస్తోంది. నెలతా (చెలియా) ఏమిచేద్దామే? “మనస్సు” అనే కుండకు అడుగు లేదు. నీరు నింపలేము కానీ, నీటిలో ఉండే అగ్గి (బడబాగ్ని) రగులుకొని లోపల ఉండే విరహాగ్నితో నేను కాగిపోతున్నాను. ఈ తాపము తెలుస్తున్నట్లుంటోంది. కానీ తెలియుటలేదు. నిర్మలమైన మనస్సుగల వెలదీ! ఇప్పుడు మనముయేమిచేయుదమే? ఓ చెలీ! ఈ వేంకటాద్రినాథుడు, మాకులేని పూవులు (నిక్కబొడుచుకున్న పులకలు) మంచి మంచి రేకులు (మంచి రేకుల వలె విస్తరించగా) నన్ను చేకొనినాడు. పెద్ద తోకచుక్క కనబడితే కనులు చెదిరి త్రోవకానరానట్లయినది. కాంతివంతమైన ఆ త్రోవలో ఆయనను చేరగలమా? బాధించినా ఆ తలపును మానలేము. ఓ కాంతా! యేమి సేతును చెప్పవే.

* **కాఁకదేరు** = **బాధించు,** * **తోకవంక** = తోకవంటి దారి

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

96 సంఖ్య : 59 సంపుటము: 1 పుట: 39 రాగం: ఆహిరి

**పల్లవి:** **మదమత్సరము లేక మనసు పేదై పో**
**పదరినయాసలవాఁడువో వైష్ణవుఁడు**
**చ. 1:** **ఇట్టునట్టుఁ దిరిగాడి యేమైనాఁ జెడనాడి**
**పెట్టరంటాఁ బోయరంటాఁ బెక్కులాడి**
**యెట్టివారినైనా దూరి యెవ్వరినైనఁ జేరి**
**వట్టియాసలఁబడవాఁడువో వైష్ణవుఁడు**
**చ. 2:** **గడనకొరకుఁ జిక్కి కాముకవిద్యలఁ జొక్కి**
**నిడివి నేమైనాఁ గని నిక్కినిక్కి**
**వొడలిగుణముతోడ వుదుటవిద్యలఁజాల**
**వడదాఁకి బడలనివాఁడువో వైష్ణవుఁడు**
**చ. 3:** **ఆవల వొరులఁ జెడనాడఁగ వినివిని**
**చేవమీరి యెవ్వరినిఁ జెడనాడక**
**గోవిదు శ్రీవేంకటేశుఁ గొలిచి పెద్దల కృప**
**వావివర్తనగలవాఁడునో వైష్ణవుఁడు**

**భావదీపిక:**

వైష్ణవుడని పిలువదగిన వాడెటువంటి వాడో వివరిస్తున్నారు అన్నమయ్య. మదమత్సరములు లేని పేదవాని మనస్సు వలె మనస్సు, పదరిన (క్షోభించిన) ఆశలు గలవాడేనయ్యా! వైష్ణవుడు అనదగినవాడు. అతడింకా యెట్టివాడో వినండి. పనిలేకుండా అటూ ఇటూ తిరిగి, నోటికివచ్చిన చెడు మాట్లాడి, తనకెటువంటి పెట్టి పోతలు చేయుటలేదని యెటువంటి వారినైనా నిందించి, యెవ్వడు పడితే వాడితో చేరిపోయినవాడి గతేమిటి? వ్యర్ధమైన ఆశాబద్ధుడై జీవిస్తాడు. అట్లా కానివాడేపో వైష్ణవుడంటే. గడన కొరకు జిక్కి (సంపాదనే వ్యసనంగా మారి) కోరికలు తీర్చే కాముక విద్యలతో అతిశయించి, తెగ గర్వించి వుంటారు కొందరు. శరీరపు అలవాట్లకు అనుగుణముగా పరాక్రమం చూపించే విద్యలలో ఆరితేరిపోతారు కొందరు. కానీ కొందరికి పైనచెప్పిన విద్యలంటే వడదెబ్బ తగిలినట్లు బడలిపోతారు. వారేపో వైష్ణవులంటే. అవతలివారు పరులను నిందిస్తుంటే తెగ విని వినీ సత్యమేదో వితర్కించుకొని వాటిపై కుతూహలం లేక సర్వోత్తముడైన శ్రీవేంకటేశ్వరుని కొలిచి పెద్దల యొక్క కృప పొంది, వావివర్తన (సరియైన నడవడి) కలవాడేపో వైష్ణవుడంటే.

*** ఉదుట విద్యలు = పరాక్రమం చూపించే ప్రావీణ్యాలు; * చెడనాడు = నిందించు**

97 సంఖ్య:438 సంపుటము:17 పుట:252 రాగం: సామంతం

**పల్లవి:** **మద్దకాసిన్నెకా మనకు నేమి బాఁతి యింక**
**తిద్దుతీరు లేని దేవరటవే వీఁడు**

**చ. 1:** **గొల్లనందగోపుఁగారికొడుకు నేఁడు మనము చూడ**
**బొల్లి మోరగద్ద నెక్కి పోవునాఁ డదే**
**గుల్లసేతఁ బట్టి సుట్టికుదురువంటికత్తి వట్టి**
**తెల్లనల్లసూపువాఁడు దేవరటవే వీఁడు**

**చ. 2:** **పచ్చఁబూస అరతఁ గట్టి పసపువన్నె చీర గట్టి**
**పచ్చనలము నెత్తిఁ బెట్టి వచ్చువాఁ డదే**
**పచ్చిపాలు దాగ మరిగి పసుల గాసె నిన్నాళ్లు**
**దిచ్చరీఁడు వీడు మంచి దేవరటవే వీఁడూ**

**చ. 3:** **బిరుదు లెక్కి లక్కిమమ్మఁ బెండ్లి యాడి యేకతాన**
**వొరిమ శ్రీవేంకటాద్రి నుండువాడఁదే**
**వరము లెల్ల సారెఁ గన్నవారి కెల్ల నిచ్చి యిచ్చి**
**తిరముకొనెను బలిమితోడ దేవరటవె వీఁడు**

**భావదీపిక:**

జానపద కీర్తనలెంత బుఱ్ఱబద్ధలు కొట్టుకున్నా వొక్కొక్కప్పుడు అర్థంకావు. పెదతిరుమలయ్య చెప్పిన ఈ సరస కీర్తన నాకర్ణించండి. మద్దకాసిన్నెకా అంటే ఏమిటి. నలుగురు అక్కా చెల్లెళ్ళుంటే మొదటిది పెద్దక, రెండవది మద్దకా (మధ్య అక్క), మూడవది సిన్నెకా (చిన్నక్క) నాలుగవది చెల్లి. ఈ పల్లవి అర్థం తెలుగులో "మధ్య అక్క, చిన్న అక్క, మనకిదేమి భ్రాంతి? తనతీరుతెన్ను అనుకరింపలేని మంచిదైవమే ఇతగాడు" అని. ఆనాటి గొల్లనందుడి కొడుకైన వీడు మనము చూస్తుండగానే బొల్లిమోర గద్ద (తెల్లని దేహమున్న గరుడపక్షి) నెక్కి పోవుచున్నాడె. ఒక చేతిలో గుల్ల (శంఖము), వేరొక చేత సుట్టికుదురు వంటి కత్తి (గుండ్రంగా తిరిగే చక్రాయుధం) ధరించే వీడు తెల్లని కనులతో నల్లని కనుపాపలు గలవాడు. వీడు గొల్లడు కాదట. దేవరటవే (దేవుడటే)!! ఈ దేవుడు అరతన్ (కంఠమున) పచ్చపూస (కౌస్తుభమణి) కట్టినాడు. పసుపు వన్నె చీరగట్టినాడు. (పీతాంబరమును ధరిస్తాడు) నెత్తిన (తలపై) పచ్చనలము (బంగారు కిరీటాన్ని తలపై ధరిస్తాడు). ఇన్నాళ్ళూ పసులనుగాచిన ఈ చిన్నవాడు, ఆవులనుంచి పితికిన పచ్చిపాలనే త్రాగేస్తాడు. వీడు దిచ్చరీడు (మాయగాడు). అయినా వీడు మంచి దేవుడటనే. ఇతగాడు బిరుదులెక్కి (ప్రఖ్యాతిగాంచి) లక్కిమమ్మను బెండ్లాడి (లక్ష్మీదేవిని పరిణయమాడి) ఏకాంతమున వైకుంఠంలో ఉంటాడు. కలియుగంలో ఓర్మిగల శ్రీవేంకటేశ్వరుడై వుండేవాడీయనే. తనను దర్శించిన వారికి కోరిన వరాలిచ్చి యిచ్చీ బలంగా స్థిరపడిన దేవదేవుడితడే.

* **తిరముకొను** = **స్థిరపడిన,** * **తిద్దుతీరు** = అనుకరించు

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

98 సంఖ్య : 455 సంపుటము: 15 పుట: 306 రాగం: సామంతం

**పల్లవి:** **మంచం బెక్కినపిమ్మట మరి వావియు లేదు**
**చంచల ముడిగినపిమ్మట శంకకుఁ బనిలేదు**

**చ. 1:** **పదిలంబుగ సర్వాత్మకభావము దెలిసిన పిమ్మట**
**ముదమున నెవ్వరిఁ జూచిన మొక్కక పోరాదు**
**హృదయము పరమేశ్వరునకు నిరవైపోయిన పిమ్మట**
**యెదిరిని కెలఁకులఁ జూడను ఇతరము పనిలేదు**

**చ. 2:** **సకలేంద్రియములు హరిపై చయ్యనఁ బెట్టిన పిమ్మట**
**వొకటియు నోరికిఁ జవియను వొద్దిక పనిలేదు**
**వికసించిన పరిణామము వెల్లువ ముంచిన పిమ్మట**
**చికురము ముడువనుఁ గట్టను చీరకుఁ బనిలేదు**

**చ. 3:** **పరమాత్ముఁడు తిరువేంకటపతి యని తెలిసిన పిమ్మట**
**పరిపరి చదువుల లంపటములఁ బడఁ బనిలేదు**
**హరియే చైతన్యాత్మకుఁ డని తెలిసినపిమ్మట**
**దురితములకుఁ బుణ్యములకు త్రోవే బనిలేదు**

**భావదీపిక:**

పెదతిరుమలయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో యేమంటారో ఆలోచించండి. మనుజుడు భోగాసక్తుడైనంతకాలం తనతో మంచమునెక్కిన వనితతో తన వావి(చుట్టరికము) యేమిటో ఆలోచించడు. ఒక్కసారి ఆ వాంఛ కలిగించిన పొంగు తగ్గిపోయాక శంకకు తావే లేదు. పరమాత్ముని కృపతో వానికి సర్వాత్మత్వక భావము కలిగేదాకా వాడి బ్రతుకంతే. కాని హరికృప కలుగగానే యెవ్వరిని జూచినా కామక్రోధాదుల ప్రభావము లేక యెల్లరకు మ్రొక్కగలుగుతాడు. తన హృదయం పరమాత్మునికి ఆవాసమైనప్పుడు, యెదుటి వారిని కెలక వలసిన పనిలేదు కదా! తన సర్వేంద్రియములను శీఘ్రముగా హరిపై మగ్నము చేసిన పిమ్మట నోటికి ఒక పదార్థము వొద్దిక (అనుకూలము). ఇంకొకటి రుచి లేనిది అనే ప్రశ్నయే పుట్టదు. ఎవ్వడైనా భావాతీతుడై పరిణామము (మార్పు) కలిగాక వానికి అలంకరణతో పనిలేదు. పూలను ముడుచుట దేనికి, విలువైన వస్త్రములను ధరించుట దేనికి? తిరువేంకటేశ్వరుడే పరమాత్ముడని తెలిసిన పిమ్మట అనేక రకములైన చదువుల ఝంఝాటముతో పనిలేదు. చైతన్య స్వరూపుడై హరియే తనలో ఉన్నాడని తెలిసిన 'అద్వైతికి' పుణ్యముతో గాని, పాపములతో కాని నిమిత్తమే లేదు.

*** చికురము = లేతపూలదండ, * దురితము = పాపము**

99 సంఖ్య : 363 సంపుటము:3 పుట: 245 రాగం: పాడి

**పల్లవి:** **మించిన తలపోఁతలే మీఁద మిక్కిలి**
**కొంచెము(మొ?) దొడ్డో సరికోరి ఇందుకందుకు**

**చ. 1:** **చేసేటి పుణ్యములకు చెందేటి పాపములకు**
**యీసుల సరికి సరి ఇందుకిందుకు**
**వాసులఁ బుట్టుగులకు వడి మరణాలకును**
**ఆసల సరికి సరి అందుకందుకు**

**చ. 2:** **దినదిన సుఖాలకు తీదీపు దుఃఖములకు**
**యెనసి సరికి సరి ఇందుకిందుకు**
**అనుఁగుఁ బున్నమలకు అమాస చీఁకట్లకు**
**అనయము సరికి సరందుకందుకు**

**చ. 3:** **శ్రీవేంకటేశ యిట్టే జీవులకు నేది గతి**
**యేవి చూచిన సరికి సరిందుకిందుకు**
**వేవేగ నీ శరణని వెలసి బ్రతికితిమి**
**యే వల్లలేదు సరి యెందుకం (కెం?)దుకు**

**భావదీపిక:**

అన్నమాచార్యులవారు చెప్పిన ఈ కీర్తనను చక్కగా ఆలోచిస్తేనే గాని అర్థంకాదు. నేను ఇలా భావిస్తున్నాను. ఈ ప్రపంచంలో అన్నీ సరికి సరిగా వుంటాయి. కొంచెమో, అధికమో యేదైనా అంతే. ఇది పరమాత్మ సృష్టివైచిత్రి. మీదు మిక్కిలి తలపోతలవలన ఏమీ ప్రయోజనం వుండదు. జీవులు ఎంత పుణ్యం చేస్తున్నారో, అంత పాపమూ వారి వెన్నంటే వున్నది. ఈసులెన్నున్నాయో వాసులూ అన్నేవున్నాయి. (నిందలెన్నో పొగడ్తలూ అన్నే). ఇందుకిందుకు సరిపోతాయి. ఎంత పుట్టుకల సంతోషం వున్నదో అంత మరణపు దుఃఖంతో ఆసలన్నీ సరికిసరియై అందుకందుకు సరిపోతాయి. దినదినమూ యెంత సుఖమున్నదో అంతటి బాధకూడా వున్నది. దేనికది సరిపోతుంది. ఎన్ని పున్నమి వెన్నెలలున్నాయో, అన్ని అమావాస్య చీకట్లూ వున్నాయి. దేనికది సరిపోతుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ సృష్టిలో యేదైనా సరికి సరిగా వున్నాయి. ఇందుకిందుకు సరిపోతాయి. ఇది తెలిసి మేము చాలా శీఘ్రముగా నీ శరణార్థులమై బ్రతికితిమి. యెట్టి వల్ల (నైపుణ్యము) మాయందు లేదు. ఎందుకంటే నీసృష్టిలో అన్నీ సరికి సరి.

*** తీదీపులు = మిక్కిలిబాధ, * వేవేగ = చాలశీఘ్రముగా**

100 సంఖ్య : 184 సంపుటము:27 పుట: 124 రాగం : సామంతం

పల్లవి: రవ్వలైనా నాయఁగాని రాఁపైనా నైతిఁగాని
రివ్వల నీమోవితేనె రేఁచవద్దా ఇందుకు

చ. 1: చివ్వన నెందుండో వచ్చి చేముట్టి తీసి నీవు
నవ్వఁగా నీతో నేను నవ్వవద్దా
దువ్వటపుఁ బయ్యెదను తుడిచేవు నీచెమట
జవ్వనమదము నీ పైఁ జల్లవద్దా ఇందుకు

చ. 2: వొల్లనే వద్దఁ గూచుండి వొడివట్టి రమ్మంటా
గిల్లఁగా నేనూ నందుకు గిల్లవద్దా
మొల్లలు నీ కొప్పువెల్లా ముడిచేవు నా కొప్పున
పెల్లున నాతమ్ములము పెట్టవద్దా ఇందుకు

చ. 3: గక్కునను నీవు నన్నుఁ గాఁగిలించుకొనఁగానే
వుక్కువంటి నా చన్నుల నొత్తవద్దా
ఇక్కువ శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁగూడితివి
మొక్కలములెల్లా మాని మొక్కవద్దా యిందుకు

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో నాయిక చిత్తినీజాతిప్రేమిక. రవ్వలైనా నాయ (అపకీర్తి అయితే అయింది) కానీ రాపైనా నైతి (నింద బొందితే పొందాను) కానీ, రివ్వల (అధికముగా) నీ మోవితేనె (అధరామృతము) గ్రోలి, రేఁచవద్దా ఇందుకు (దీనికైనా రెచ్చిపోవద్దా?) అంటున్నదామె. నీవు చివాలున యెక్కడ నుండియో వచ్చి నా చేయి పట్టుకొని నవ్వగా నీతోనేను కూడా నవ్వవద్దా! నా సన్నటి పైట చెంగుతో నీకు పట్టిన చెమటను అద్దుకొనినావు కదా! మరి ఇందుకు నేను నా యవ్వన మదమును నీపై జల్లితే నేరమా! ఒల్లనె (తిన్నగా) నా దగ్గర కూర్చొనియుండి వడివట్టి(నిలబెట్టి) రమ్మంటూ నన్ను గిల్లితే, నేనూ నిన్ను గిల్లక ఊరుకుందునా? ఓయీ! నీ కొప్పులో వున్న మొల్లలను తీసి నీవు నా కొప్పులో ముడిచితివి. మరి అటువంటప్పుడు పెల్లున (గభాలున) నా నోటిలోని తాంబూలము నీ నోటిలో కుక్కినాను. ఇందుకు ప్రతిగా నేజేసినది నేరమా? నీవు గక్కున (చటుక్కున) నన్ను కౌగిలించుకొంటే ఉక్కువలె బిగువైన నావురోజములతో నిన్ను వొత్తవద్దా? జాడతో నన్ను గూడితివి. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇందుకు ప్రతిగా నేను మొక్కలము (మొరటుతనము) మాని వినమ్రతతో నీకు మొక్కవద్దా?

*** దువ్వటపు = సన్నని, * ఇక్కువ = జాడతో**

101 సంఖ్య : 51 సంపుటము: 27 పుట: 35 రాగం: బౌళి

**పల్లవి:** **వరుసకు నీమగఁడు వచ్చీఁగాక**
**సరసురాలగు నీకుఁ జలపట్టనేఁటికి**

**చ. 1:** **వాసితోడఁ బతిమీఁద వలపు గలదానికి**
**వేసరఁగనేఁటికే వేమారును**
**రాసికెక్క నేఁడు సింగారమున నుండి నీకు**
**సేసకొప్పు వేఁకమంటాఁ జింతించనేఁటికే**

**చ. 2:** **పనివడి నాయకునిఁ బాయలేని దానికి**
**పెనఁగఁగ నేఁటికే బిగియుచును**
**వెనుకొని జవ్వనాన విఱ్ఱవీఁగే యట్టి నీకు**
**చనుఁగవ గట్టి యంటా జడియఁగ నేఁటికే**

**చ. 3:** **అన్నిటా శ్రీవేంకటేశునాలవైన దానికి**
**సన్నసేయనేఁటికి సముకమున**
**వెన్నెల నవ్వులతోడ వేడక పడే నీకు**
**కన్నులివి గొప్పలంటా కావరించ నేఁటికే**

**భావదీపిక:**

అన్నమయ్య ఈ సరస సంకీర్తనలో దేవి చెలికత్తెవలె ఆమెని (అమ్మవారినే) నీకీ చలపట్టు దేనికమ్మా అని ప్రశ్నిస్తున్నారు. చలపట్టు అంటే మాత్సర్యము లేక మొండి పట్టుదల అని అర్థం. పైగా నీవు సరసురాలవు కూడాను. రాక రాక నీ మగడు దారికి వచ్చాడని అనుకోవేమి? నేను చెప్పేది వినవమ్మా! అంటున్నారు. ఈ కీర్తనను నేటి తెలుగులో వివరించాలంటే, ఇదే దారి. నీకు నీపతిపై వలపున్నదని వాసికెక్కిన మాటయే కదా! మరి అట్టిదానికి విసుగెందుకమ్మా? అదీగాక పలుమార్లు నీ పతిముందు విసుగు చూపవచ్చునా? నీవు సింగారించే తీరు విఖ్యాతి చెందినదే. కాని మీ ఇరువురి సరాగములో ఎత్తైన నీ కొప్పు చెదిరిపోయిందని చింతించడం దేనికమ్మా? కావాలనుకొన్నా నీవు నీ నాయకుని విడచి వుండలేవు. అటువంటి దానివి ఆయన దగ్గరకు వస్తే బిగిసిపోయి పెనుగులాడెద వేమమ్మా? నీవు యౌవనము వెనుకనున్నదని విఱ్ఱవీగుచున్నావు. మఱి అట్టి నీకు పయోధరములు గట్టివని జడియు టెందులకమ్మా? నీవు సర్వకాల సర్వావస్థలయందు శ్రీవేంకటేశ్వరుని ఇల్లాలివే. ఇక ఆయనను సమక్షముననే చిన్నబుచ్చ తగునా? దేవీ! వెన్నెలలు వెదజల్లే మనోహరమైన నవ్వు గలిగిన నీకు వేడుకగా నుండక, సొగసైన కన్నులు గొప్పగా నీకే వున్నాయని అంత గర్వమెందుకమ్మా?

*** సేసకొప్పు = ఉన్నతమైన కొప్పు * సన్నచేయుట = చిన్నబుచ్చుట**

102 సంఖ్య: 382 సంపుటము: 17 పుట: 221 రాగం: ఆహిరి

**పల్లవి:** **వినవే చెలియ నేఁడు విభుని నా చందములు**
**మునుప నేనే వాని మోవఁగా నాడితినే**

**చ. 1:** **అలిగిపోయేటివాని నలమి పానుపుమీఁద**
**బలిమిఁ బడవేసి నేఁ బైకొంటినే**
**అలసి విడువు మంటా నానవెట్ట రాఁగాను**
**నులివేఁడి తమ్ములము నోరిలో నించితినే**

**చ. 2:** **వులుక శిరసు వంచుకుండఁగా నా వాఁడిగోర**
**గుటిగా గడ్డము వట్టి కొసరితినే**
**చులుక నే నని వాఁడు చూచి నన్నుఁ దిట్ట రాఁగా**
**మొఱగి వాని కెమ్మెఱవి మోవిఁ బెనచితినే**

**చ. 3:** **ఆకడిమోమె యుండఁగా నడ్డగించుకొని నేనే**
**జోకగాఁ గౌఁగిటిలోనఁ జొచ్చుకొంటినే**
**యీకడ శ్రీవేంకటేశుఁ డిందుకే మెచ్చి నాతోఁ**
**గైకొన్న అలుక దేరి గక్కనఁ గూడెనే**

**భావదీపిక:**

పెద తిరుమలయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో నాయిక "ప్రగల్భాల ప్రౌఢ" ఆమె సిగ్గును అవతలకు నెట్టిన కామశాస్త్ర విశారద. తన అనుభవాన్ని తన చెలియకెలా వివరిస్తున్నదో వినండి. ఓ చెలియా! వినవే నేడు నా వల్లభుని, నా చేష్టలను. నేను నా మనుపు(కోపాన్ని) బయటబెట్టి అతగానిని మోవగానాడితిని. (నొప్పించాను). చెలియా! అతగాడు నాపై అలిగి వెళ్లిపోబోతుంటే వానినాక్రమించి బలముకొద్దీ పానుపుపై పడద్రోసి పైకొంటినే. అతడాగ్రహించి ఉదాసీనుడై విడువమని ఒట్టుపెట్టబోతుంటే నా నోటిలోని నులివెచ్చని తాంబూలపు తమ్మను అతని నోటిలో కుక్కి నింపితిని. చెలియా! వులక (వూఱకనే) నా వాడు శిరసువంచికొని యుండగా వాని గడ్డము పట్టి నా గోటితో పైకెత్తి కొసరితేనే (కొసరిమరీ బ్రతిమలాడితేనే) నన్ను చులుకైన దానివని తిట్టిపోస్తే వానిని ఉరిమిచూసి వాని అరుణాధరమును నా అధరములతో పెనవేసితిని. మరి నాకంతకంటే ఏమి చెయ్యాలో తోచినది కాదు. చెలియా! అతగాడు చిన్నబుచ్చుకొన్న మోముతో వుండగా నేనే అడ్డగించి వానిని ఉత్సాహంతో కౌగిటిలో జొచ్చుకొంటిని(పొదుపుకొంటిని). అందుకనే శ్రీవేంకటేశ్వరుడు నన్ను మెచ్చుకొని స్వీకరించినాడు. అంతేకాదు తన అలకదీరి గ్రక్కున నన్ను కూడినాడే.

*** జోకగా = ఉత్సాహముగా * చులక = చులుకైనది**

103 సంఖ్య : 147 సంపుటము: 3 పుట: 99 రాగం: ఆహిరి

**పల్లవి:** **విన్నపము లేమి సేసే వేగినంతాను**
**మన్నించి రక్షించే నీ మహిమలే ఘనము**

**చ. 1:** **నీవంక నేరమి గద్దా నేనే అపరాధిని**
**దేవ నే జడుఁడఁగాన తెలుసుకోను**
**వావాత మీగురుఁ డాడేవాక్యము నీయాధీనము**
**పావనమైన నీపలుకెల్లా సత్యము**

**చ. 2:** **మంచితనమల్లా నీదె మాయదారివాఁడ నేను**
**చంచలుఁడఁ గనక వివా(చా?)రించుకోను**
**అంచల నీదాసుని ఆనతి యమోఘము**
**యెంచ నీవిచ్చిన వరమెం(మిం?)దుకంటే బలువు**

**చ. 3:** **కరుణెల్లా నీసొమ్ము కఠినచిత్తము నాది**
**నరుఁడఁ గనక అట్టె యరసుకోను**
**పరగ మా జనకుని ప్రతిజ్ఞయు నీపంపు**
**నిరతి శ్రీవేంకటేశ నీపంతము సతము**

**భావదీపిక:**

ఈ కీర్తన ఆఖరి చరణాలలో "మా జనకుని ప్రతిజ్ఞ" అని వుండుటచేత ఇది పెదతిరుమలయ్యగాని, చిన తిరుమలయ్యగాని చెప్పిన కీర్తనగా నేను భావిస్తున్నాను. కీర్తనలోని "ఆర్తి" ని బట్టి పెద తిరుమలయ్యవైపే నేను మొగ్గుతున్నాను. వేగినంతాను (బాధలనుభవించు నంతదాకా) ఈ జీవులు యెన్ని విన్నపములను చేస్తారయ్యా? బాధలు లేకపోతే నిన్ను తలచుకొనే వాడెవడుంటాడు? అయినాగాని మేమంటే నీకు యెంత కరుణ ప్రభూ!! మావంటి హీనులను కూడా మన్నించి రక్షించే నీ మహిమయే ఘనమైనది, సాటిలేనిది. దేవదేవా! నేనే అపరాధినయ్యా! నీవైపున యే నేరమూ లేదు. నేను జడడను కాబట్టి దేనినీ యెరుగను. నోరారా మా గురువు చెప్పిన మాటలన్నీ నీ అధీనములు. నీ పవిత్రమైన మాటలన్నీ పరమసత్యములు. నిజానికి నేను మాయదారి వాడను, కాని నాలో యేదన్నా మంచితనం వున్నదంటే అది నీవిచ్చినదే. నాకున్న చంచల స్వభావమువలన మంచీ చెడుల మధ్య విచక్షణ నెరుగకున్నాను. నీదాసుడైన మా గురువు నాకిచ్చిన ఆనతి అమోఘమైనది. కాని నీవు నాకిచ్చి వరముకూడా అమితబలమైనది. ఆయన దీక్షను నేను కొనసాగించగలుగుతున్నానంటే మాటలా? నిజానికి నేను కఠిన చిత్తుడను. కాని నాలో వున్న కరుణ నీవిచ్చిన సొమ్మే (ఆభరణమే). నరుడిని కాబట్టి సమయానుకూలంగా రెండూ ప్రకటిస్తుంటాను. మా తండ్రిగారు (అన్నమయ్య)కు చేసిన "ప్రతిదినమూ ఒక కొత్త కీర్తన చెప్పెదనను" ప్రతిజ్ఞ. నీ పంపున (ఆదేశమున) జరిగినదే. ఓ శ్రీవేంకటేశ్వరా! మా సంకల్పం యేమైనా నీ పంతమే నెరవేరుతుంది, తండ్రీ!

**గమనిక :** ఈ కీర్తనలో గురుడు అన్నమాచార్యులవారే.

*** సతము = శాశ్వతము; * వావాత = నోరార**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

104 సంఖ్య : 440 సంపుటము: 17 పుట:254 రాగం: ముఖారి

**పల్లవి:** **విఱిగినట్టిబండివారు వెట్టివారు గాక నీ**
**వెఱఁగి సతము చేసుకొంటి వేమి సేతువే**

**చ. 1:** **పొలఁతి నీవు అతనిఁ బిలువఁబోయినట్టిపొద్దు లేద**
**నిలువుఁ జెమటతోడి యలపు నీ కిదేడదే**
**వెలుఁగుచేను మేసినట్టి విధము దోఁచె నీయందు**
**అలసి సొలసి నిన్ను నింక నాడ నేఁటికే**

**చ. 2:** **యింతి నేను విరహమునను యెదురుచూచు టేడ నీవు**
**వింతపులకగముల విఱ్ఱవీఁగు టేఁటిదే**
**కంతుసంచకారులోనఁ గల్లఁ దోఁచెనీయందు**
**మంతనమున నీతోడిమాట లేఁటికే**

**చ. 3:** **వనిత శ్రీవేంకటేశ్వరుఁడు దానె నన్నుఁ గూడె**
**చనవి మనవి నతనిని సన్న లేఁటికే**
**తనరి వీఁపు గానరాఁగాఁదాగినట్టి చందమాయ**
**వెనక నాకుఁ బ్రియము చెప్పి వేఁడ నేటికే**

**భావదీపిక:**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో , తాను వేంకటరమణుని చెలియై దేవితో యేమని అంటున్నారో ఆలకించండి. కృష్ణయ్య బండిని తన్ని ముక్కలుముక్కలు చేసి చంపితే, వాళ్ళు వెట్టివాళ్ళు కాబట్టి వూరకున్నారు. హరిని శాశ్వతముగా నీ వానిని చేసికొంటివి. ఇంకాయేమిసేతువు? ఓ పొలతీ (దేవీ) నీవు ఈయనను పిలువనంపిన రోజులను మఱచిపోయావా? మరి నీస్వామీ నన్ను కలుస్తాడేమోనని ఆందోళనతో నీకు చెమటలెందుకు పడుతున్నాయి? ఎందుకు నీకీ శ్రమ? సూర్యకాంతియే మన చేనుని మేస్తే, యెవరేమి చేయగలరు? నీ వరుస కూడా అలాగే వున్నది. అసలే అలసిసొలసి వున్నావు. నిన్ను ఇంకా మాటనటం నాకెందుకు? ఓ యింతీ! నేను విరహంతో నీ స్వామికోసం యెదురుచూస్తున్నానని మాటలంటున్నావు. ఇదెక్కడిదమ్మా? మరి నీ శరీరంపై పులకలు కనిపిస్తున్నాయి కదా! ఇదేటిదే? నిన్ను చూస్తే మన్మథునికి కూడా బయానా (అడ్వాన్స్) ఇచ్చివచ్చావా యేమిటి, అనిపిస్తోంది. అటువంటి నీతో మంతనాలాడి, మాటలతో నచ్చచెప్పటం దేనికమ్మా? నీకొక పరమసత్యం చెబుతాను, విను. ఓ **వనితా** నీ శ్రీవేంకటేశ్వరుడు తనంతట తానే నన్ను గూడినాడు. ఆతనిని చనువుతోను, మనవి (విన్నపము) తోను నీ వానిని చేసికో సన్నలేటికి (రుసరుసలెందుకు?) మన వెనకనున్నా మన "వీపు" మనకు కనబడుతుందా? అట్లాగే నీ వాడైన స్వామిని నీకు కట్టేసుకో. నాకు నీతులు చెప్పినా వేడుకొన్నా లాభమేమిటమ్మా?

* **కంతుసంచకారు = మన్మథునికి బయానా,** * **ప్రియము** = హితవు

105 సంఖ్య : 35 సంపుటము: 2 పుట: 24 రాగం: పాడి

**పల్లవి:** **వేసరకు వీఁడేల యనకుము విడువ నిన్నిఁక శరణు చొచ్చితి**
**నీసరెవ్వరు లేరు వెదకిన నిండుబండికిఁ జేటవేఁ గా**

**చ. 1:** **మీరు నాకుఁ గలరు నేనేమి సేసినఁ గాతురనియెడి-**
**ధీరతను జము సరకు గొనకే తివిరిఁ సేసితిఁ బాపము**
**వోరసేయుచు నెంతలేదని వూరకే మీరుంటిరేనియు**
**వారికినిఁ గొరగాను నే నెవ్వరిని నెఱఁగను మిమ్మేకాని**

**చ. 2:** **మిమ్ముఁ గొలిచిన గర్వమున నేమీఁ జేయక కాలమందే**
**నమ్మి కర్మములెల్ల మానితి నాకు నాకే వేసరి**
**దొమ్మి కోపక మీకు నాకును దూరమనుచుఁ బరాకుచేసిన**
**యిమ్ములను నన్నవియు రోసును యేల నాకవి నీవేకాక**

**చ. 3:** **నీకు మొక్కిన మందెమేళము నే నొక కొండ సేసుక**
**లోకముల దేవతలకెల్లను లోను వెలిగానైతి**
**యీకడను శ్రీవేంకటేశుఁడ యిప్పుడిటు ననుఁ గరుణఁజూచితి**
**చేకొనుచు వారె మెత్తురు చెలఁగి నీకింకరుఁడననుచు**

**భావదీపిక:**

అన్నమయ్య చెప్పిన ఈ అధ్యాత్మ కీర్తనలో ఆయన వాడిన తెలుగు పదములునేటి కాలంలో వాడుకలో లేనందువలన నా స్ఫురణకిట్లా తట్టింది. ఓ దేవదేవా! నాపై విసుగు చూపకు. వీడెందుకులే అని నన్ను నిర్లక్ష్యం చేయకు. నేను నిన్ను శరణుజొచ్చాను. వెదకి చూస్తే నీతో సమానులు లేనేలేరు. బండి జనంతో నిండిపోయి వుంటే, దానికి చేట అడ్డం పడితే ఎండ తగలకుండా వుంటుందా. నీ కరుణ కూడా ఒకరు ఆపితే ఆగేదికాదు. ప్రభూ! మీరు నాకున్నారు నేనేమి చేసినా మీరు రక్షిస్తారనే ధైర్యంతో నేను యముడినే లెక్కసేయకుంటిని. పాపముకూడా చేశాను. ఇప్పుడు నీవు లెక్కసేయక వూరకున్నారంటే ఆ యముడికి కొరగాకుండా పోతాను. మీరు తప్ప నాకెవ్వరూ తెలియదు తండ్రీ! నీదయ నా ప్రాప్తం. నాకు నాకే విసుగు గలిగి నేను చేయవలసిన కర్మలను గాలికి వదిలేశాను. స్వామీ! నిన్ను కొలుస్తున్నానను గర్వంతో చేయవలసిన కాలంలో యే వొక్క విహిత కర్మా చేయక కాలంగడిపేశాను. ఇప్పుడు మీరు మీకూ నాకూ చాలాదూరం వున్నదని పరాకు చిత్తగించారంటే, నేను కర్మలకి చెడి మీకూ చెడిపోతాను. నాకవి యెందుకు తండ్రీ? నీవుంటే చాలునాకు. దేవా! నీకు మొక్కాననే గర్వం వంటి తెంపరితనంతో నేనొక కొండవంటి వాడనని లోకంలోని ఇతరదేవతలకు లోకువైపోయాను. ఏది యేమైనా వో శ్రీవేంకటేశా! ఇప్పుడు నన్ను కరుణించితివి. ఇప్పటి దాకా నన్ను చులకనగా చూసిన వారంతా ఇకపై మన్నింతురు.

* **మందెమేళము = గర్వం, తెంపరితనము,** * **ఓరసేయు** = మర్యాదచేయు

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

106 సంఖ్య : 113 సంపుటము: 2 పుట: 76 రాగం: సాళంగనాట

**పల్లవి:** **సిరిఁ దొడపై నిడి శ్రీనరసింహుఁడు**
**యిరవుగ వరములనిచ్చీని వాడే**

**చ. 1:** **ఘనమగు కోరలు కరాళవదనము**
**చెనకుచు గొడసెటి జిహ్వాయును**
**నినిపుఁ గటమరలు నిటలలోచనము**
**నొనరఁగ గొలువై యున్నాఁడు వాఁడే**

**చ. 2:** **చటులచక్రకరంబును శార్ఙరంబుసు**
**అటు వరదాభయహస్తములు**
**పటుతరయోగపు పట్టబంధమును**
**కటితటి జెలఁగఁగఁ గడఁగీ వాఁడే**

**చ. 3:** **పరపగు శేషుని పడగల నీడల**
**అరుదగు రవిచంద్రాంకముల**
**సిరులగద్దెపై శ్రీవేంకటేశుడు**
**పరిపూర్ణుఁడై పరగీ వాఁడే**

**భావదీపిక:**

అన్నమయ్య శ్రీనరసింహునిపై చెప్పిన చక్కని కీర్తన ఇది. స్వామి వర్ణనబట్టి, ఈ స్వామి వెలసిన చోటు తెలియరాకున్నది. పూర్తి వర్ణన నందించిన అన్నమయ్య వూరు ప్రస్తావన తేలేదు. శ్రీలక్ష్మిని తొడపై నుంచుకొనిన శ్రీనరసింహుడు వాడే. ఇక్కడ సుస్థిరుడై అనేక వరములనిచ్చీని, అంటున్నారు పల్లవిలో. ఘనమైన కోరలతో ఈ స్వామి భయంకరమైన మొఖమును కలిగియున్నాడు. అదిమిపట్టి నందువల్ల ఆయన నాలుక నుండి లాలాజలము కారుచున్నది. గొప్ప సంఖ్యలో నున్న దేవతలు, నిటలాక్షుడైన శంకరుడు వినయముగా కొలుచుచుండగా అదిగో వాడే కొలువుదీర్చియున్నాడు. స్వామి ఒకచేత గిరగిరా తిరిగే సుదర్శన చక్రము ధరించియున్నాడు. వేరొకచేత "శార్ఙము" అను ధనస్సును ధరించి యున్నాడు. ఆయన వొక చేయి "వరదహస్తము" (వరములనొసగే చేయిగాను), ఇంకొక చేయి "అభయహస్తము" భయనివారకమగు చేయిగాను ఆయన నడుముపై వున్నవి. నృసింహునికి పరపుగ (మెత్తగా) వుండాలని ఆదిశేషుడు చుట్టులు చుట్టుకొని తన పడగలను గొడుగువలె పట్టుకొని యున్నాడు. ఎక్కడా లేని విధముగా, సూర్య చంద్రులు ఆయన కిరీటముపై అమరియున్నారు. సిరులొలికే గద్దెపై ఆసీనుడైన ఈయనే శ్రీవేంకటేశ్వరుడు. వారే ఇక్కడ పరిపూర్ణుడైన నారసింహుడు.

*** చటుల చక్రము = గిరగిరా తిరిగే సుదర్శన చక్రము, * పరిపూర్ణుడు = అన్నియు సమృద్ధిగా నున్నవాడు**

107 సంఖ్య : 364 సంపుటము: 3 పుట: 245 రాగం: సాళంగనాట

**పల్లవి:** హరి యిచ్చిన వరము లటువలెఁ గావుగా
తిరమై వివేకులెల్లాఁ దెలిసేటి దిదియే

**చ. 1:** శిరసులు తుంచితుంచి చిచ్చులోన వేలిచి
వరములు వడసె రావణుఁ డెన్నైనా
నిరతి రాముని చేత నిమిషములోననే
వరములన్నియు నెందో వరతిపాలాయ

**చ. 2:** వీరఘోరతపముల వెలయ బాణాసురుఁడు
కోరి చేకొన్నవరాలు కోటానఁగోటి
వూరకే కృష్ణునిచేత నొక యిసుమంతలోనే
తోరమైన వరములు తుత్తునియలాయ

**చ. 3:** వట్టిజాలిఁ బొరలక వరుస విభీషణుఁడు
జట్టిగ రఘుపతికి శరణనెను
నెట్టన నాతనిఁ గాచె నేఁడూ నున్నాఁడదె
యిట్టే శ్రీవేంకటాద్రి నిచ్చీ వరములు

**భావదీపిక:**

"హరియిచ్చిన వరము అన్నమయ్య" అనే ఈ సంపుటములకు ఇది మకుటాయమానమైన కీర్తన. ఏడుకొండలవానిని కీర్తించే ఈ సంకీర్తన అన్నమయ్య అద్భుతసృష్టి. అసురులు హరివైరులై బ్రహ్మ శివులను తపములచే మెప్పించి అనేక వరములు పొందికూడా, హరిచేత ఆ వరములే వారికి చేటుదెచ్చాయి. అందుకే అన్నమయ్య హరి యిచ్చినవరములట్లాకావు అంటున్నారు. ఆ వరములు స్థిరమైనవి. ఇది వివేకులందరూ యెరిగిన సత్యమే. మొండివాడి భక్తీ ప్రాణాంతకమే అవుతుంది. అలనాడు రావణాసురుడు తన పదిశిరస్సులను త్రుంచి త్రుంచి అగ్నిలో హోమంచేసి బ్రహ్మదేవుడిని మెప్పించి ఎవ్వరూ తనను చంపలేనివరం కోరి, పొగరుతో నరులను వానరులను వదలినాడు. హరి మానవుడైన శ్రీరాముడై ఆసక్తికరంగా నిమిషంలో నిర్మూలించాడు. వాడి వరములన్నీ వ్యర్థమైనాయి కదా! వీరత్వముతో ఘోరమైన తపస్సు చేసి శివుని మెప్పించి తన రక్షకునిగా నియోగించుకొనిన బాణాసురిడి గతియేమైనది? కోటానుకోట్లు వరాలను చేకొని కూడా వూరకనే క్షణంలో శ్రీకృష్ణునిచేత తోరమైన ఆ వరములన్నీ తుత్తునియలైపోయాయి కదా! కానీ అసురుడైనా విభీషణుడు శ్రీరామచంద్రుని జట్టిగా దాసుడై శరణంది, వట్టి జాలి బొరలక (వూరకనే దుఃఖించక) పెక్కు వైభవములను పొందాడు. అదే కోవలో నేడీ తిరుమల వేంకటేశ్వరుడు తన దాసులకు అనేక వరములనిచ్చుచున్నాడు.

*** వరతి పాలాయ = వ్యర్థమైనవి, * నెట్టున = అత్యధికముగా**

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

108 సంఖ్య : 303 సంపుటము: 15 పుట: 204 రాగం: సాళంగనాట

**పల్లవి:** **హరి నీవే దిక్కు గాని యట వుపాయము లేదు**
**కరుణానిధివి నన్నుఁ గావవే యిఁకను**

**చ. 1:** **కర్మము లనుభవించి కడతేర దాయెను**
**ధర్మములు సేసియుఁ గ్రోధము వోదాయె**
**నర్మిలి బొందులు మోచి యలయిక లేదాయె**
**నిర్మల మౌట యెన్నఁడు నెట్టన నా బ్రదుకు**

**చ. 2:** **చుట్టి నానాలోకములు చొచ్చి సిగ్గుగాదాయె**
**పొట్టు వొర్లై చదివి నొబ్బుద్ధి గాదాయె**
**వొట్టిన రాత్రుల నిద్ర నొందియుఁ దనియదాయె**
**గట్టియై నిల్చుట యేకాలము నాబ్రదుకు**

**చ. 3:** **తపముల బడలినా దర్పము విడువదాయె**
**వుపను నెందరిఁ గొల్చి వొప్పు గాదాయె**
**యిప్పుడు శ్రీవేంకటేశ యిటు నీకు మొక్కఁగాను**
**కృపచేసితి వీడేరెఁ గిందటి నా బదుకు**

**భావదీపిక:**

ఈరోజు సంక్రాంతి నేను ప్రతిరోజూ నిద్రించేముందు హరినామంతోను, నిద్రలేస్తూనే హరినామంతోనే లేస్తాను. హరికీర్తన రాస్తున్నప్పుడు ఆ శ్రీహరే నాతో రాయిస్తాడు. అన్నమయ్య చెప్పిన హరిశరణాగతి యొక్క పల్లవిని నాకు, నేను రాస్తున్నట్లు స్ఫురింప చేసినది శ్రీహరే. నిన్నరాత్రి ఈ పల్లవిలోని "యట" యేమిటో నాకు తెలియలేదు. కానీ ఈ తెల్లవారుజామున స్ఫురించింది. ఇక నా కలం ఆగదు. ఓ శ్రీహరీ! నీవు నాకు దిక్కుగానిచోట నాకిక యే ఇతర వుపాయము లేదు తండ్రీ! నీవు కరుణానిధివి, ఇకనైనా నన్ను రక్షించవయ్యా! ఎంత కర్మ అనుభవించినా దానికి అంతేలేదు, ఎంత ధర్మమునాచరించినా, కోపాన్ని నిగ్రహించడం నావల్ల కావటం లేదు.. ఆపేక్షతో యెన్ని శరీరాలు ధరించినా ఈ జీవుడికి అలసట రాకున్నది. మరి ఇక నిర్మల హృదయుడ నెప్పుడవుతాను? ఈ బ్రతుకు, యింకెట్లా కడతేరుతుంది ప్రభూ! దొర్లి దొర్లి యెంత చదివినా ఒబ్బుద్ధి (సద్బుద్ధి) రావటం లేదు. ఇవాళ రాత్రి యెంత నిద్రించినా మరునాడు నిద్రించక తప్పదు. యిక నా బ్రతుకులో దృఢముగా నిలబడటం జరిగే పనియేనా స్వామీ? అలసట వచ్చేట్లు తపమునాచరించినా గర్వమును, అహంకారమును విడవలేకున్నాను. యెన్ని ఉద్యోగాలు చేసినా, యెంతమందిని కొలిచినా అది సరియైనది కాదని వదిలేశాను. ఇప్పుడు వో శ్రీవేంకటేశ్వరా! నీకు మ్రొక్కగానే నన్ను కృపజూపినావు. నాగతంనాటి బ్రతుకు యీడేరింది తండ్రీ!

*** పొట్టువొర్లు** = **దొర్లిదొర్లి, * ఉపమ** = నేర్పుతో